


తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ
: fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
26-4-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 84 పేజీలు: 10+4 వెల: 6.50








శుక్రవారం వాఘా సరిహద్దు మీదుగా భారత్‌నుంచి తిరిగి వెళుతున్న పాకిస్థానీయులు

# 'ఉగ్ర' నిర్మూలనకు మద్దతు

>> తరువాత తమ మద్దతు ఉంటుందని ప్రధానికి స్పష్టం చేశారు. పహల్గాం ఉగ్రదాడిని టార్గెట్ చేసి మరి కావాలని చంపారు. గడిచిన మూడేళ్ల నుంచి కాశ్మీర్ ప్రశాంతంగా ఉంది. దేశంలో ప్రతి ఒక్కరికి కాశ్మీర్‌తో అనుబంధం ఉంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితిలో అందరూ కలిసి కట్టుగా నిలబడాలన్నదే తమ నిర్ణయం అన్నారు. అందరూ ప్రధాని నరేంద్ర మోదీకి అండగా నిలబడాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. మన రాష్ట్రంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. విశాఖ వాసి చంద్రమౌళి మృతి చెందటం బాధాకరం. బాధిత కుటుంబాలను నిలదొక్కుకోవడానికి సహకరించాలి. ఉగ్రవాదిని ప్రోత్సహిస్తే అదే వినాశ రోజు కావాలి. ప్రజల పోలిసింగ్ చేసే పరిస్థితి రావాలి. 2042కి వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకుంటామనే భయంతోనే ప్రపంచంలో భారత్ వేగంగా అభివృద్ధి అవుతుంది. అందుకే ఈ దాడులు తీవ్రవాదులు చేస్తున్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం చేసుకుని సమాజ భద్రతతో నడవాలి చంద్రబాబు ప్రధాని మోదీతో చంద్రబాబు ప్రస్తావించారు. అందరు సంఘటితంగా ఈ దాడిని తిప్పికొడదామని ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. ఈ భేటీలో పోలవరం బనకచర్ల ప్రాజెక్టు గురించి చంద్రబాబు వివరించారు. కేంద్రం ప్రతిపాదిస్తున్న నదుల అనుసంధాన లక్ష్యాన్ని ఈ ప్రాజెక్టు నెరవేరుస్తుంది. దీని ద్వారా గోదావరికృష్ణాపెన్నా నది పరివాహక ప్రాంతాలను అనుసంధానించిన రాష్ట్రంలో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలను తీర్చవచ్చు. కాబట్టి కేంద్ర ప్రభుత్వం తన వంతు సాయం చేయాలని విజ్ఞప్తిచేశారు. ఏపీకి సంబంధించిన వివిధ అంశాలు ప్రధానికి చంద్రబాబు చర్చించారు. అమెరికా టారిఫ్ యుద్ధం ప్రకటించాక ఆక్వా రంగంలో నెలకొన్న అనిశ్చితిని వివరించారు. భారత్ నుంచి దిగుమతి చేసుకొనే వస్తువులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 26 సుంకాలు విధించడం ఏపీలో మత్స్య రంగానికి తీరని నష్టం చేకూర్చేలా ఉన్నందున కేంద్రం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకోసం స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక చర్యలను ప్రతిపాదించారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధిపైనా చర్చించారు. వీటికి బడ్జెట్‌లో కేటాయించిన నిధులను వినియోగించి త్వరగా మౌలిక వసతుల కల్పనకు ఉపక్రమించాలని కోరారు. ప్రకాశం జిల్లాలో ఉప్పు భూములను రాష్ట్రానికి అప్పగించే అంశం వారి మధ్య చర్చకు వచ్చింది. ఇతర్రత రూ.వేకోట్ల నిధుల అందిస్తున్నందుకు ప్రధాని మోదీకి చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. తమ రాష్ట్రంలో ప్రధాని ప్రతిపాదిత సూర్యఘర్ యోజనకు మంచి స్పందన లభిస్తుందని వివరించారు. రాష్ట్రానికి విభజన చట్టాన్ని అనుసరించి రావాల్సిన నిధులు, ఇతర విభజన సమస్యలను పరిష్కరించాలని ప్రధానిని చంద్రబాబు కోరారు. ఇక మే 2వ తేదీన అమరావతి పునఃప్రారంభ పనులకు మోదీని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానించారు.. అమరావతిలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను ప్రధానికి వివరించారు. దీనిపై స్పందించిన ప్రధాని, రాజధాని నిర్మాణానికి సంబంధించి పలు సూచనలు చేశారు. అమరావతికి వచ్చినను పెంచేందుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని..., ఇందుకోసం మియావాకీ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. పనులు పునఃప్రారంభించే కార్యక్రమానికి హాజరయ్యేందుకు ప్రధానమంత్రి అంగీకారం తెలిపారు. మరోవైపు పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పురోగతిని, ఆర్‌ఐఎన్‌ఎల్ గురించి ప్రధానికి సీఎం వివరించారు. ఎస్ వర్క్‌కరణకు కేంద్రం ఆమోదం తెలిపినందుకు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్‌ఎండీసీ, ఆర్సెలార్ మిటల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్‌కు మద్దతు, అలాగే బీపీసీఎల్ రిఫైనరీ మంజూరు విషయంలోనూ ప్రధానికి ధన్యవాదాలు చెప్పారు. ఆరామ్‌కో భాగస్వామ్యాన్ని ఖరారు చేయడంతో అదనపు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈసారి రాష్ట్ర పర్యటనలో శ్రీశైలం కూడా సందర్శించాలని నరేంద్రమోదీని చంద్రబాబు కోరారు. రూ.లక్ష కోట్ల పనుల ప్రారంభానికి సూచికగా ప్రధాని మోదీ పైలాన్ ఆవిష్కరించనున్నారు. ఈ రోజు మధ్యాహ్నం తరువాత నుంచి విజయవాడ విమానాశ్రయం నుంచి ఢిల్లీ చేరుకున్న సీఎం చంద్రబాబు సాయంత్రం నాలుగు తరువాత పీఎం నరేంద్రమోదీని కలుసుకున్నారు. పలు అంశాలపై ఆయన మాట్లాడిన తరువాత సీఎంచంద్రబాబు ప్రధానిని రాష్ట్రానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఇక ఈ రాత్రికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలోనే బసచేస్తారు. అక్కడ నుంచి రేపు ఉదయం విశాఖ చేరుకుంటారు. ఆ జిల్లామత్స్యకార భరోసా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

# కస్తూరి రంగన్ కన్నుమూత



సార్‌లో కస్తూరి రంగన్‌కు శ్రద్ధాంజలి ఘటిస్తున్న దృశ్యం

>> శాస్త్రవేత్తగా ఎదిగారు.

**డిప్యూటీ డైరెక్టర్ నుండి ఇస్రో చైర్మన్ దాఖ:** 1970లో బెంగళూరులోని ఉపగ్రహ నిర్మాణ సంస్థలో శాస్త్రవేత్తగా చేరిన కస్తూరి రంగన్ అక్కడ భౌతిక శాస్త్ర విభాగానికి ఆధ్వర్యం వహించారు. అనంతరం 1984లో శాటిలైట్ సెంటర్‌కు డిప్యూటీ డైరెక్టర్‌గా నియమితులైయ్యారు. మరో 10 ఏళ్లకు 1994లో అదే శాటిలైట్ సెంటర్‌కు డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. 1994 మార్చి 31న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్‌గా, అంతరిక్ష కమిషన్ అధ్యక్షుడిగా, భారత ప్రభుత్వ అంతరిక్ష విభాగ కార్యదర్శిగా ఏకకాలంలో నియమితులైయ్యారు. అయితే ఆ మధ్య కాలంలో సుమారు పాతికేళ్ళ పాటు అంతరిక్ష రంగ అభివృద్ధికి నూతన ఆవిష్కరణలకు కస్తూరి రంగన్ ఎంతో పరిశోధనలు చేసారు. ఉపగ్రహాల నిర్మాణం తొలిదశలో ఆయన పాత్ర ఎనలేనిది. భారతీయ మొట్టమొదటి ఉపగ్రహం ఆర్య భట్ట నిర్మానానికి ఆయన కీలక పాత్ర పోషించారు. సమాచార ఉపగ్రహాలు ప్రారంభంలో మనకు రాకెట్ ప్రయోగం అందుబాటులో లేని కారణంగా ఇతర దేశాల నుంచి ప్రయోగించేవారు. అప్పట్లో భాస్కర 1, భాస్కర 2 అలాంటి ఉపగ్రహాలే. వీటి విజయం తరువాత రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాలు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అనంతరం ఇన్‌సాట్ ఉపగ్రహాలు నిర్మించారు. సొంతంగా శ్రీహరి కోటలో రాకెట్ ప్రయోగ కేంద్రం ఏర్పడింది. ఈ కేంద్రం అభివృద్ధిలో కస్తూరి రంగన్ విశేష కృషి చేసారు.

**ఇస్రో చైర్మన్‌గా ఖండాంతర ఖ్యాతి:** 1994 మార్చి 31న ఇస్రో చైర్మన్‌గా కస్తూరి రంగన్ బాధ్యతలు స్వీకరించారు. పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్‌ల అభివృద్ధిలో ఆయన పాత్ర ఎంతో వుంది. ఈ తరహా రాకెట్‌ల నిర్మాణం తరువాతనే ఇస్రోకు ఖండాంతర ఖ్యాతి దక్కింది. ఎన్నో కీలక ఉపగ్రహాలను శ్రీహరి కోట నుండి విజయవంతంగా ప్రయోగించుకున్నారు. విదేశి ఉపగ్రహాలను అలవోకగా అంతరిక్షంలోని చేర్చుకుని ఇస్రోకు వాణిజ్య లాభాలు ఆర్జించడానికి కారణమయ్యారు. శ్రీహరి కోటను ఒక విధంగా డాలర్ల పంట పండించే క్షేత్రంగా అభివృద్ధి చేసారు. పిఎస్‌ఎల్‌వి రాకెట్‌ల ద్వారా ఐఆర్‌ఎస్ పి2, ఐఆర్‌ఎస్ పి3, ఐఆర్‌ఎస్ 1డి తో పాటు కీలకమైన కల్పనా 1, (మెట్ సాట్) ఉపగ్రహాన్ని కస్తూరి రంగన్ ఆధ్వర్యంలోనే ప్రయోగించారు. దేశంలో విద్యాభివృద్ధి కోసం ఉపగ్రహం ఉపయోగం రుచి చూపించిన ఘనత కస్తూరి రంగన్‌దే..

**రాజ్యసభ సభ్యునిగా సేవలు..**

ఇస్రో చైర్మన్‌గా దాదాపు 10 ఏళ్ల పాటు కొనసాగి 2003 ఆగస్టు 27న పదవి విరమణ చేసిన కస్తూరి రంగన్ అదే రోజు రాజ్యసభ సభ్యునిగా నామినేట్ అయ్యారు. దేశాభివృద్ధికి పెద్దల సభ నుంచి దిశా నిర్దేశం చేసారు. సహజంగా పుస్తక ప్రియుడు, దైవ భక్తుడు అయిన కస్తూరి రంగన్ రాజ్యసభ సభ్యుని హోదాలోని వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశారు. ముఖ్యంగా విద్యాభివృద్ధికి ఆయన విశేష కృషి చేసారు. జాతీయ విద్యా విధానం రూప కల్పన కమిటీకి అధ్యక్షత వహించారు. ఎంతో వెనుకబడిన శ్రీహరి కోట సమీపంలోని సూళ్ళూరుపేటలో విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలు ప్రస్తుతం పలువురు గుర్తు చేసుకుంటున్నారు. భారత ప్రభుత్వం కస్తూరి రంగన్ సేవలకు 1982లోనే పద్మశ్రీ అవార్డు ఇచ్చి సత్కరించింది. 1992లో పద్మభూషన్‌తో గౌరవించింది. 2000లో పద్మవిభూషన్‌గా ఆయన ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్నారు. వీటితో పాటు దేశ, విదేశాలకు చెందిన ఎన్నో సంస్థలు కస్తూరి రంగన్‌కు పలు అవార్డులు అందజేశారు. శుక్రవారం రంగన్ మృతి పట్ల దేశ వ్యాప్తంగా పలువురు సంతాపం ప్రకటించారు. శ్రీహరి కోటలో సార్ కంట్రోలర్ ఎం. శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో కస్తూరి రంగన్ చిత్రపటానికి పూజలు చేసి శ్రద్ధాంజలి ఘటించారు. డిప్యూటీ డైరెక్టర్లు శంకరన్, గోపి కృష్ణా తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి కొత్త ఆవిష్కరణలు

>> సదుపాయాలు మరియు డెవలపర్ వనరులతో సహా సాంకేతిక సహాయాన్ని అందిస్తుంది. అన్ని బృందాలు ప్రభుత్వం నియమించిన నిపుణుల జ్యూరీ ముందు తమ ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్‌లను ప్రజెంట్ చేస్తాయి. ప్రభుత్వం పూర్తి స్థాయి అమలు కోసం అత్యంత ఆశాజనకమైన ప్రాజెక్టులను ఎంపిక చేయవచ్చు. **డబ్ల్యుడిజీటీ ఈ సేవలన్నింటినీ ఉచితంగా అందిస్తోంది.**

జాబితా చేయబడిన ప్రమాణాల ప్రకారం, సాంకేతికత, ఇగవర్నెన్స్ లేదా ఐటీపాజెక్ట్ అమలుకు ముందస్తుగా పరిచయం ఉన్న అధికారులను నామినేట్ చేయాలని విభాగాలకు సూచించబడింది. అనుబంధం1లో అందించిన ఫార్మాట్‌ను ఉపయోగించి ప్రాజెక్ట్ ఆలోచనలను సమర్పించాలి. ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి ప్రభుత్వ విభాగాన్ని డిజిటల్‌గా మార్చడం, పౌరులకు మెరుగైన సేవలను అందించడం మరియు పాలనలో సామర్థం ,పారదర్శకతను మెరుగుపరచడం. ఇక నేను ప్రభుత్వంలో ఉన్న అధికారులందరినీ మార్చలేను గానీ వారి స్థానాలను మార్చగలను. 1995లో నేను సీఎం అయ్యాను. ఐటీ అంటే తెలియని అధికారులు నాడు ఉన్నారు. ఆ సమయంలోనే హైటెక్ సిటీ నిర్మించాం. పల్లెటూర్ల నుంచి చాలా మంది వచ్చి ఐటీ ఉద్యోగాలు చేశారు. నారాయణ విద్యాసంస్థలను కూడా ప్రోత్సహించాను. ఆ రోజుల్లో ఐఐటీలో ఒకశాతం కూడా అడ్మిషన్స్ వచ్చేవి కావు. విద్యాసంస్థల అధినేతలను పిలిచి ఐఐటీలో మనం నెంబర్ వన్‌గా ఉండాలని చెప్పాను. తర్వాత వచ్చిన మార్పులతో 20 శాతం సీట్లు మనవాళ్లే సాధిస్తున్నారు. బిట్స్ పిలానీలో 70 శాతం తెలుగువారే ఉండేవారు. ఇంతమంది ఎలా వస్తున్నారు, మార్కులు తారుమారు చేస్తున్నారేమోనని వాళ్ల సొంత వ్యవస్థతో పరీక్షలు నిర్వహించినా ఏమాత్రం తగ్గకుండా మనవాళ్లు ఎంపికయ్యారు. గతంలో సరైన టెక్నాలజీ ఉండేదికాదు. ఇప్పుడు టెక్నాలజీతో పాటు రియల్ టైం సమాచారం వచ్చింది. క్వాంటమ్ వ్యాలీ కూడా వచ్చేసింది. క్వాంటమ్ వ్యాలీ ఏంటనేది చాలా మందికి తెలీదు... ప్రస్తుతం పని చేస్తున్న కంప్యూటర్ల కంటే వెయ్యి రెట్లు వేగంగా పని చేయడమే క్వాంటమ్ వ్యాలీ. దీనిని అమరావతిలో ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి ఇంట్లో ఒక ఏఐ ప్రొఫెషనల్ ఉండాలి. 2047 నాటికి భారతదేశంలో అగ్రజాతిగా, ఎక్కువ ఆదాయం వచ్చే వారిగా తెలుగువారు ఉండాలి. ప్రపంచంలో నాలెడ్జ్ ఎకానమీలో ప్రభావవంతులుగా తెలుగువారు ఉండాలి. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా రాష్ట్రంలో 270 సేవలు పౌరులందరికీ అందిస్తున్నాం, త్వరలో ఈ సేవలు 1000కి పెంచుతాం. టెక్నాలజీలో వచ్చిన మార్పులను ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. ఒకప్పుడు ఇంటర్నెట్ కనెక్షన్ కోసం ఎదురు చూసేవారమని, 2 ఎంబీపీఎస్ స్పీడ్‌తో ఇంటర్నెట్ సేవలు దొరకడమే గగనమయ్యేదని గత రోజులను గుర్తుచేశారు. ఆ దశ నుంచి వేగవంతమైన ఇంటర్నెట్ సేవలతో కూడిన పాలన అందించే స్థాయికి ఎదిగామని చెప్పారు. ఇప్పుడు డేటా ఆధారిత పాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. ముప్పయి ఏళ్ల క్రితం చేసిన ప్రయత్నంతో నేడు టెక్నాలజీలో ఏపీ కీలకంగా ముందుందని అన్నారు.

# తీవ్ర వడగాల్పులు

>> త కొనసాగుతోంది. దాదాపు ఎండలు తీవ్రంగా ఉన్నాయి. రాయలసీమ, ఉమ్మడి కృష్ణా, శ్రీకాకుళం, విశాఖ, విజయనగరం, ఉమ్మడి గుంటూరు. నెల్లూరు జిల్లాల్లో నేడు వడగాలులు తీవ్రంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసారు. శుక్రవారం ఏపీలో17 మండలాల్లో తీవ్ర వడగాలులు వీచాయి. దగ్గర దగ్గర 21 మండలాల్లో వడగాలులు ఉన్నాయి, 150కిపైగా మండలాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయి. ఎండలకు తోడు ఉక్కపోతకు చిన్నారులు అల్లాడుతున్నారు. శుక్రవారం శ్రీకాకుళం జిల్లా 4, విజయనగరం5, పార్వతీపురం మన్యం 8.. ఇలా రాష్ట్రంలోని మొత్తం 17 మండలాల్లో తీవ్రవడగాలులు, 21 మండలాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. శనివారం 12 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందన్నారు. శుక్రవారం శ్రీకాకుళం 1 మండలంలో విజయనగరం10మండలాలు. పార్వతీపురంమన్యం 7 మండలాలే అల్లూరి సీతారామ రాజు జిల్లాలో 3 మండలాల్లో వడగాల్పులు వీచాయి. శని, ఆదివారాల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ ఏడాది నంద్యాల జిల్లాలో ఎండలు తీవ్రంగానే ఉంటున్నాయి. ఇప్పటికే నంద్యాల జిల్లా దోర్నిపాడులో 43.8, ప్రకాశం జిల్లా పెద్దదోర్నాలలో 43.7, వైఎస్సార్ జిల్లా అట్లూరులో 43.6 , విజయనగరంలో 42.8, కర్నూలు జిల్లా కామవరం, పల్నాడు జిల్లా నర్మలపాడులో42.7, ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడులో 42.4,, నెల్లూరు జిల్లా మనుబోలు, తిరుపతి జిల్లా వెంకటగిరిలో42.1డిగ్రీల చొప్పున అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు, అలాగే 139 ప్రాంతాల్లో 41కు పైగా ఉష్ణోగ్రతలు రికార్డు అయినట్లు తెలిపారు. పిడుగులతో పాటు తేలకపాటి వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, రాబోయే ఐదు రోజుల్లో రాయలసీమలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 నుంచి 45 డిగ్రీల మధ్యలో నమోదవుతాయని అంచనా వేసింది. శని, ఆదివారాల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవొచ్చని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ తెలిపారు.

## పాకిస్థానీలను గుర్తించి వెనక్కి పంపేయండి

>> నక్కినట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం రావడం వల్ల భద్రతా సిబ్బంది సెర్చ్ ఆపరేషన్‌ను చేపట్టారు. ఈక్రమంలో జవాన్లపై ముష్కరులు కాల్పులు జరిపారు. దీంతో భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులకు దిగారు. ప్రస్తుతం ఇక్కడ జమ్ముకశ్మీర్ పర్యటనకు భారత్ ఆర్మీ చీఫ్ ఉన్న సమయంలోనే ఈ ఎన్‌కౌంటర్‌జరిగింది. ఉద్రిక్తతల నేపథ్యంలో భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది శుక్రవారం శ్రీనగర్, ఉధమ్‌పూర్‌లో పర్యటించనున్నారు. కశ్మీర్ లోయలోని ఆర్మీ కమాండర్లు, ఇతర భద్రతా ఏజెన్సీల ప్రతినిధులతో భేటీ కానున్నారు. ప్రస్తుతం నియంత్రణ రేఖ వెంబడి ఉన్న పరిస్థితులపై సమీక్షించనున్నారు. సరిహద్దుల వద్ద కాల్పుల విరమణ, పహల్గాం దాడి నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. పహల్గాంలో ఏప్రిల్ 22న పర్యటకులపై జరిపిన ఉగ్రవాదులు దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. పాక్‌తో దౌత్య సంబంధాలకు సంబంధించి భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. పాక్‌దౌత్యవేత్తకు సమన్లు జారీ చేయడం, సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడం, పాకిస్థాన్‌కు సంబంధించి అన్నీ వీసాలపై వేటు, అంతేకాకుండా దాయాది పౌరులను తక్షణమే భారత్ విడిచివెళ్లాలని ఆదేశించింది.

## సావర్కర్‌పై వ్యాఖ్యలు: రాహుల్‌కు సుప్రీం మందలింపు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:** వీడీ సావర్కర్‌పై ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తప్పుబట్టింది. స్వాతంత్ర్య సమరయోధుల పట్ల ఇలాగే ప్రవర్తి స్తారా అని ప్రశ్నించింది. స్వాతంత్ర్య సమం ˇయోధుల గురించి బాధ్యతారహిత ప్రకటనలు చేయొద్దని మందలించింది. అలాగే, రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై దాఖలైన కేసులో ఆయనపై క్రిమినల్ చర్యలను అత్యున్నత న్యాయస్థానం నిలిపివేసింది. దీంతో ఆయనకు భారీ ఊరట లభించినట్లైంది. సావర్కర్‌పై గతేడాది రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై లఖ్‌నవూలోని అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ కేసులో రాహుల్ గాంధీ కోర్టు సమన్లు పం పింది. ఈ సమన్లను రద్దు చేయాలని రాహుల్ గాంధీ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఏప్రిల్ 4న రాహుల్ అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. దీంతో రాహుల్ గాంధీ సుప్రీంకోర్టు మెట్లు ఎక్కారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టిన జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మా సనం, రాహుల్ గాంధీ వ్యాఖ్యలను తప్ప బట్టింది. 2022 నవంబర్ 17న మహారాష్ట్ర లోని అకోలాజిల్లాలో జరిగిన భారత్ జోడో యాత్రలో సావర్కర్‌పై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. సావర్కర్ బ్రిటిషర్స్ సేవకుడు, వారి పెన్షనర్ అంటూ రాహుల్ గాంధీ కామెంట్స్ చేశారు. దీంతో సావర్కర్‌ను ఆయన ఉద్దేశపూర్వకంగా అవమానిం చారని ఆరోపిస్తూ నృపేంద్ర పాండే అనే న్యాయవాది లక్నోలో కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు ఈ కామెంట్స్‌పై జస్టిస్ దత్తా అభ్యంతరం వ్యక్తం చేశారు. వైస్రాయ్‌కు మహాత్మా గాంధీ రాసిన లేఖల్లో కూడా యువర్ ఫేత్‌ఫుల్ సర్వెంట్ అనే పదాన్ని ఉపయోగించారని, అలా గని, మహాత్మా గాంధీని బ్రిటిష్ సేవకుడు అని పిలవవచ్చా అని ప్రశ్నించారు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు సావర్కర్‌ను ప్రశంసిస్తూ లేఖ రాసిన విషయం మీ క్లైంట్‌కు తెలుసా అని రాహుల్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీని జస్టిస్ దత్తా అడిగారు. సావర్కర్ ఏమైనా రాజకీయ నాయకుడా మహారాష్ట్రకు వెళ్లి ఒక ప్రకటన చేస్తారా, అక్కడ ఆయన్ను పూజిస్తారు. ఇంకోసారి ఇలాచేయొద్దు అని జస్టిస్ దత్తా మంద లించారు. స్వతంత్ర్యాన్ని తీసుకొచ్చిన వారి పట్ల ఇలాంటి వ్యాఖ్యలను తాము అనుమతించబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. భవిష్యత్‌లో ఇలాంటి వ్యాఖ్యలు చేయొద్దన్న షరతుపై ఇప్పుడు స్టే విధిస్తున్నట్లు చెప్పింది.

## ఉగ్రదాడిపై ప్రతీకారం ఇలా.. భారత్ ముందు నాలుగు సైనిక ఎంపికలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:** మూడు రోజుల క్రితం పహల్గాంలో జరిగిన ఉగ్రదాడితో భారత్ ఉలిక్కిపడింది. ఈదాడిలో 26 మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోవడంపై ప్రతీకారంతో రగిలిపోతోంది. ఈ క్రూరమైన దాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్థాన్‌పై దౌత్యపరమైన ఒత్తిడి పెంచింది. భవిష్యత్తులో ఆర్థికంగా కోలుకోకుండా సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. ఇక పహల్గాంలో నరమేథం సృష్టించిన ఉగ్రవాదులను వదిలిపెట్టకూడదని, వాళ్లకు ధీటైన జవాబు ఇవ్వాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఎలా ప్రతీకారం తీర్చుకొంటారన్నది చర్చనీయాంశంగా మారింది. భారత ప్రభుత్వం మాత్రం సైనిక చర్య అంశంపై గుంభనంగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలో భారత్ ఎలాంటి అడుగు వేయబోతుందనే విషయంలో నిపుణులు తమతమ అంచనాలను వెల్లడిస్తున్నారు. మొత్తానికి భారత్ ఎదుట నాలుగు మిలిటనీ ఆప్షన్లు ఉన్నట్లు చెబుతున్నారు. **రఫేల్, మిరాజ్‌లను రంగంలోకి దింపడం:** ప్రస్తుతం వాయుసేనలో అత్యాధునిక ఫైటర్ జెట్లు అయిన రఫేల్, మిరాజ్ విమానాలు ఉన్నాయి. వాటిని ఉపయోగించి పాకిస్థాన్‌లోని కీలక స్థావరాలపై దాడులు చేయడం ఇండియన్ మిలిటరీ ముందున్న మొదటి ఆప్షన్. అదే సమయంలో బాలాకోట్‌పై దాడి అనంతర అనుభవాలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ప్రత్యర్థుల రక్షణ వలయాన్ని ఛేదించే సామర్థ్యాలు రఫేల్, మిరాజ్‌లకు ఉన్నాయి. అయితే ఈ ఆప్షన్‌ను ఎంచుకుంటే అంతర్జాతీయ ఒత్తిడిని ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధంగా ఉండాలి. **లైన్ ఆఫ్ కంట్రోల్‌ను దాటి..** సిమ్లా ఒప్పందాన్ని పక్కన పెడతామని తాజాగా పాకిస్థాన్ బెదరించింది. ఆ ప్రకారం చూస్తే ఆ దేశం నియంత్రణ రేఖను గుర్తించనట్లు అవుతుంది. దాంతో భారత్‌కు దూకుడుగా ఆపరేషన్లు చేపట్టే అవకాశం లభిస్తుంది. ఇటీవల ఎల్‌ఓసి వద్ద పాకిస్థాన్ జరిపిన ఉల్లంఘనలను భారత్ కారణంగా చూపవచ్చు. ఉగ్ర స్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఆపరేషన్లు చేపట్టవచ్చు. ఇది భారత్ ముందున్న మరో ఆప్షన్‌గా చెప్పవచ్చు. కాకపోతే అత్యంత కఠినమైన భౌగోళిక పరిస్థితులు భారత దళాలకు సవాల్‌గా మారుతాయి. **భారతీ టార్గెట్స్‌పై సర్జికల్ స్ట్రైక్స్.** భారీ టార్గెట్లను గుర్తించి సర్జికల్ స్ట్రైక్స్ చేయడం భారత్ ముందున్న మూడో ఆప్షన్. కాకపోతే ఇప్పుడు పాకిస్థాన్ అప్రమత్తంగా ఉండటంతో సర్జికల్ స్ట్రైక్స్ అంత సులభం కాకపోవచ్చు.

**శతఘ్నులు, స్నైపర్లతో కాల్పులు..** ఇక లక్ష్యాలపై గురిపెట్టి భారీ శతఘ్నులు, స్నైపర్ గన్స్‌తో కాల్పులు జరపడం భారత్ ముందున్న నాలుగో ఆప్షన్‌గా చెప్పవచ్చు. వీటితోపాటు భారీ మోర్టార్లను కూడ వాడవచ్చు. దాంతో ఉద్రిక్తతలకు అవకాశం తక్కువగా ఉంటుంది. నియంత్రణ రేఖ సమీపంలోని శత్రుస్థావరాలు, సరఫరాల మార్గాలు, ఔట్‌పోస్టులను తుడిచిపెట్టవచ్చు. కాకపోతే ఈ దాడులతో ఫలితం పెద్దగా ఉండదు. భారీ దాడులతోనే భారీ ఫలితం దక్కుతుంది.



పోప్ మృతికి తన సంతాప సందేశం రాస్తున్న ఏఐసిసి నాయకుడు రాహుల్ గాంధీ

# 3రోజుల కస్టడీకి పిఎస్ఆర్

>> సమక్షంలో విచారణ చేయాలని కోర్టు ఆదేశించింది. ముంబయికి చెందిన సినీనటి కాదంబరి జత్వాని ఆమె కుటుంబ సభ్యులపై అక్రమ కేసు బనాయించి వేధించిన కేసులో పీఎస్ఆర్ ఆంజనేయులు అరెస్ట్ అయ్యారు. ప్రస్తుతం విజయవాడ లోని జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఇక మద్యం కుంభకోణంలో అరెస్టై రిమాండ్ నిమిత్తం విజయవాడలోని జిల్లా కారాగారానికి వెళ్లిన రాజ్ కసిరెడ్డికి జైలు అధికారులు 7813 నెంబరు కేటాయించారు. ఈ కేసులో ఏసీబీ ప్రత్యేక కోర్టు వచ్చే నెల 6వ తేదీ వరకు రిమాండ్ విధించింది. ముంబయి నటి కేసులో అరెస్టైన అయిన ఐపీఎస్ అధికారి, మాజీ నిఘా విభాగాధిపతి సీతారామాంజనేయులుకు బుధవారం విజయవాడలోని 3వ ఏసీజేఎం కోర్టు వచ్చే నెల 7వ తేదీ వరకు రిమాండ్ విధించింది. అనంతరం విజయవాడ కారాగారానికి రిమాండ్ నిమిత్తం తరలించారు. అక్కడ రిమాండ్ ఖైదీగా నెం. 7814ను కేటాయించారు. వీరికి భద్రత దృష్ట్యా జైలు నిబంధనల మేరకు సింగిల్ సెల్‌లు కేటాయించారు. కసిరెడ్డిని ఒకటో బ్యారెక్‌లోని సెల్, సీతారామాంజనేయులుకు రెండో బ్యారక్‌లోని సెల్‌లో ఉంచారు. ఇతరులతో కలపకుండా భద్రతను దృష్టిలో పెట్టుకుని వారిని ఒంటిరిగానే ఉంచారు. తనకు ప్రత్యేకంగా సదుపాయాలు వద్దని, అందరిలా చూడమని పీఎస్ఆర్ చెప్పినట్లు తెలిసింది. రాజ్ కెసిరెడ్డి మాత్రం తనకు నడుం నొప్పి ఉందని జైలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనికి సంబంధించి పాతవి కాకుండా, ఏడాదిలోపు ఉన్నవి రిపోర్టులు ఉంటే సమర్పించమని అధికారులు చెప్పినట్లు సమాచారం.

## విజయవాడలో 10మంది ఉగ్రవాదులు?

>> మొత్తం 10మంది కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. 10 మంది గొల్లపూడి, అశోక్‌నగర్, లబ్బీపేట ప్రాంతాల్లో వేర్వేరు పనులు చేస్తున్నట్లు గుర్తించారు. ఇప్పటివరకు ఏ కార్యక్రమాలు చేయడం లేదని నిఘా కొనసాగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. గతంలో కూడా మావోయిస్టులకు షెల్టర్ జోన్‌గా విజయవాడ నిల్చింది. ఇక కాశ్మీర్‌లో సామాన్య పర్యాటకుల దాడుల నేపథ్యంలో విజయవాడ కనకదుర్గమ్మ గుడి, సమీప ప్రాంతాల్లో పోలీసు భద్రతను ముమ్మరం చేసింది. నగరంలో వన్‌టౌన్ (పాతబస్తీ), ఆరండల్‌పేట, భవానిపురం ప్రాంతాల్లోను పోలీసు నిఘా పెట్టిందంటున్నారు.

## సునీల్‌కుమార్‌పై ఆరు అభియోగాలు

>> దేశాల్లోని పలు ప్రాంతాల్లో పర్యటించారని, కొన్ని సందర్భాల్లో ఒక దేశానికి వెళ్ళేందుకు అనుమతి పొంది మరో దేశంలో పర్యటించారంటూ ఆయనపై 6 అభియోగాలు నమోదు చేసింది. అఖిల భారత సర్వీసు ప్రవర్తన నియమావళిని ఆయన ఉద్దేశ్యపూర్వకంగా ఉల్లంఘించి, తీవ్ర క్రమశిక్షణ రాహిత్యానికి దుష్ప్రవర్తనకు పాల్పడ్డారంటూ గత నెల 2న సునీల్‌కుమార్‌ను సస్పెండ్ చేసిన ప్రభుత్వం... తాజాగా ఆయనపై అభియోగాలు మోపింది. వ్యక్తిగతంగా హాజరై లేదా లిఖితపూర్వకంగా వాటన్నింటికీ 30 రోజుల్లోగా సమాధానాలివ్వాలని ఆదేశించింది. నిర్ధేశిత గడువులోగా సమాధానాలివ్వకపోతే, చెప్పడానికి ఏమీ లేదని భావించి తమ వద్ద అందుబాటులో ఉన్న వివరాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొంది. విచారణను ప్రభావితం చేసేలా వ్యవహరించినా, ఎవరితోనైనా సిఫారసు చేయించినా తీవ్ర చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులిచ్చారు.

# ఇంకా సస్పెన్స్ ఎందుకో?

>> డిఐజి మురలీరాంభా నేతృత్వంలోని తిరుపతి అడిషనల్ ఎస్పీ వెంకట్రావు, డిఎస్పీలు, సిఐలు అనేక కీలక ఆధారాలు సేకరించారు. దాని ఆధారంగా కల్తీనెయ్యి సరఫరాలో ప్రధాన సూత్రధారులు ఎవరనేది తేలుస్తారని, వారందరికీ నోటీసులు జారీచేస్తారనే సంచలనం రేగింది. అయితే గత రెండు నెలలుగా సిట్ అధికారులు కీలక సూత్ర ధారులు తేల్చడంలో తలనొప్పి వ్యవహారం ఎదురవుతోందా?అనే ప్రశ్నలు లేకపోలేదు. గత ఐదేళ్ళలో కనీసం నెయ్యితయారీ అర్హతలేని డైరీలు టెండర్లు దక్కించుకోవడం వెనుక గత టిటిడి ట్రస్ట్ బోర్డు పెద్దలు, టిటిడి అధికారుల పాత్ర ఉందనేది తేల్చింది. దేవుని లడ్డూల ప్రసాదాలకు నాణ్యతలేని, కల్తీ నెయ్యి తక్కువ ధరకు సరఫరా చేస్తామని డైరీల యాజమాన్యం, కాంట్రాక్టర్లు ఆసక్తిచూపడం, కల్తీ నెయ్యేగాక ఏకంగా జంతువుల కొవ్వు, పామాయిల్, పందికొవ్వు , చేపనూనెతో బాటు ఇతరత్రా సోయాబీన్, పొద్దుతిరుగుడు, ఆలివ్, గోధుమబీన్, మొక్కజొన్న, పత్తిగింజలతో నూనె వినియోగించారనేది నిందితుల రిమాండ్ రిపోర్టులో చోటు చేసుకున్న అంశాలు. ఇప్పుడు కీలక సూత్రదారులెవరనేది వెల్లడించడంలో మాత్రం గోప్యత పాటిస్తున్నారనేది ప్రధాన ఆరోపణ.

## బైసారన్ ఉగ్రదాడి మాస్టర్‌మైండ్ హాఫీజ్‌సయీద్!

**శ్రీనగర్, ఏప్రిల్ 25:** పహల్గాం ఉగ్రదాడి వెనుక ఉన్నది ది రెస్సిస్టెన్స్ ఫ్రంట్ అని ఆ సంస్థ ప్రకటించుకున్న విషయం తెలిసిందే. 26 మంది ఆమాయక భారతీయులను పొట్టనపెట్టుకుంది ఈ గ్రూపుకు చెందిన తీవ్రవాదులు అయినా, ఆ క్రూరమైన దాడికి కర్త, కర్మ, క్రియ మాత్రం మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్, లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్ సయీద్ అని భారత నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. భద్రతా సంస్థ అనుమానాలకు కారణం లేకపోలేదు. జమ్ము లోయలో గతంలో జరిగిన పలు ఉగ్రదాడులను పోస్ట్ మార్టం చేస్తున్న అధికారులకు గతంలో లష్కరే తోయిబా మ్యాడ్యూల్‌తో పహల్గాం దాడికి సారూప్యత ఉంది. ఉగ్రదాడి చేశాక అడవుల్లోకి వెళ్లి దాక్కోవడం లష్కరే తోయిబా మిలిటెంట్ల ప్రత్యేకత. గతేడాది సోనామార్గ్, బూటా పత్రి, గండేర్బల్‌లో జరిగిన ఉగ్రదాడులు సమయంలో అదే చేశారు. పాకిస్థాన్‌లో ఉండే తమ హ్యాండ్లర్ల నుంచి తదుపరి ఆదేశాలు వచ్చే వరకు వాళ్లు అడవుల్లోనే ఉండిపోతారు.

### వారం - వర్జ్యం

తేది : 26-04-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
కృ.త్రయోదశి ఉ.8.26, చతుర్దశి తె.4.49
ఉత్తరభాద్ర ఉ.6.27, రేవతి రా.3.38
వర్జ్యం సా.5.36-రా.8.25
దు.తె.5.46-ఉ.7.25
శుభసమయం : ఉ.5.40-6.10
రాహుకాలం - ఉ.9.00-10.30

### వార్తాఫలం

**మేషం :** వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**వృషభం :** ఉద్యోగాలలో గందరగోళం ఏర్పడిన అధిగమిస్తారు. శ్రమ తప్పదు. ఆలయ దర్శనాలు.

**మిథునం:** పనులు చకచకా సాగుతాయి. విందు, వినోదాలు, శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**కర్కాటకం:** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**సింహం:** దూరప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

**కన్య :** ఉద్యోగాలలో మరింత ఉత్సాహం పొందుతారు. నూతన వ్యక్తులు పరిచయమై సాయం అందిస్తారు.

**తుల :** బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. స్థిరాస్తి వివాదాలు కొలిక్కి వస్తాయి. ఆకస్మిక ధనలాభం పొందుతారు.

**వృశ్చికం:** సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

**ధనుస్సు:** ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. పనుల్లో అవాంతరాలు.

**మకరం:** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**కుంభం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. శ్రమ తప్పదు. దైవ దర్శనాలు చేసుకుంటారు.

**మీనం :** ఉద్యోగాలలో ఒత్తిడులు పెరిగినా అధిగమించి ముందుకు సాగుతారు. ఋణ బాధలు తప్పవు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విజయవాడ : fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

26-4-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 84 పేజీలు: 10+4 వెల: 6.50



సావర్కర్‌పై వ్యాఖ్యలు: రాహుల్‌కు సుప్రీం మందలింపు

ఉగ్రదాడిపై ప్రతీకారం ఇలా.. భారత్ ముందు నాలుగు సైనిక ఎంపికలు

2లో


# అభివృద్ధికి కొత్త ఆవిష్కరణలు

## ఎఐని పూర్తి స్థాయిలో వినియోగిస్తాం

## 1000కి పెరగనున్న వాట్సాప్ సేవలు: సిఎం చంద్రబాబు



**విజయవాడ, ఏప్రిల్ 25,ప్రభాతవార్తప్రతినిధి:** ఏ వ్యవస్థ అభివృద్ధి చెందాలన్న ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలు అవసరమని ఏపీ చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు.ఆంధ్రప్రదేశ రాష్ట్రం ఎప్పటికప్పుడు కాలానుగుణం సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ప్రగతి పథంలో ముందుకు నడుస్తుందన్నారు.రాష్ట్రంలో ఐటితో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను సమాంతరంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు.శుక్రవారం ప్రభుత్వ డిజిటల్ పరివర్తన లక్ష్యంగా కొనసాగుతున్న ఉన్నత స్థాయి శిక్షణ కార్యక్రమం చివరి రోజుకు చేరుకుంది.ఈ సందర్భంగా చంద్రబాబు కీలక సందేశం ఇస్తూ వివిధ విభాగాల నుండి 100 మంది ఛాంపియన్‌లు మరియు 200 క్యాటలిస్టులు తమ హ్యాండ్స్ ఆన్ శిక్షణను కొనసాగించారు.అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రభుత్వ రంగాలలో డిజిటల్ పరివర్తనను నడిపించడానికి ఈ అధికారులను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు. ఛాంపియన్స్ వారి సంబంధిత విభాగాలలో డిజిటల్ మార్పుకు కీలక ఏజెంట్లుగా వ్యవహరిస్తారు. వారి బాధ్యతలలో స్పష్టమైన వ్యూహాన్ని రూపొందించడం, నిపుణుల సహకారంతో ప్రాజెక్టులను గుర్తించడం, వాటి అమలుకు నాయకత్వం వహించడం, సంబంధిత సాంకేతికతలను అంచనా వేయడం మరియు విభాగాలలో నైపుణ్యాన్ని పెంచడాన్ని సులభతరం చేయడం వంటివి ఉంటాయి. క్యాటలిస్టులు వారి విభాగాలలో డిజిటల్ పరివర్తన ప్రయాణానికి మద్దతు ఇస్తాయి. వారి పాత్రలు ప్రాజెక్ట్ నిర్వహణ, విషయ నిపుణులుగా జ్ఞానాన్ని పంచుకోవడం, సమర్థవంతమైన కమ్యూనికేషన్ మరియు సహకారాన్ని సులభతరం చేయడం, సామర్థ్యాన్ని పెంపొందించే చొరవలకు మద్దతు ఇవ్వడం మరియు ప్రాజెక్టులను పర్యవేక్షించడం మరియు మూల్యాంకనం చేయడం వంటివి ఉంటాయి. ఈ శిక్షణా కార్యక్రమం మూడు కీలక దశల్లో నిర్వహించ బడుతుంది వ్యక్తిగత శిక్షణ దశ ఉంటుంది.ఈ శిక్షణలో పాల్గొనేవారు డిజిటల్ పరివర్తనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర, సంబంధిత సాంకేతికతలు, ప్రభుత్వానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వ్యూహ అభివృద్ధి, వినియోగ కేసుల ఆచరణాత్మక అమలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాజెక్టుల నిర్వహణ గురించి సమగ్ర అవగాహన పొందుతారు.

ఈ శిక్షణ ప్రతి విభాగం యొక్క నిర్దిష్ట అవసరాలు మరియు సవాళ్లను పరిష్కరించడానికి రూపొందించబడింది. అధికారులు డిజిటల్ వ్యూహాలుఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాజెక్ట్ ఎంపిక మరియు అభివృద్ధి, సాంకేతిక ఏకీకరణ ద్వారా సేవా మెరుగుదల మరియు మరిన్నింటిపై లోతైన జ్ఞానాన్ని పొందుతారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ శిక్షణా కార్యక్రమం యొక్క ఖర్చులను పూర్తిగా భరిస్తుంది. ప్రారంభ శిక్షణ తర్వాత, బృందాలు ఆలోచన మరియు ప్రాజెక్ట్ అమలు దశలోకి వెళతాయి. సీనియర్ అధికారుల మార్గదర్శకత్వంలో, వారి విభాగాలకు సంబంధించిన వినూత్న డిజిటల్ పరివర్తన ఆలోచనల ఆధారంగా, కాన్సెప్ట్ ప్రూఫ్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయమని వారిని ప్రోత్సహిస్తారు.ఐటిఈ అండ్‌సీ నిపుణులు మరియు సలహాదారులు ఈ శ్నిదిలను మెరుగుపరచడంలో మరియు అభివృద్ధి చేయడంలో సహాయం చేస్తారు. మౌలిక

>>2

# పాకిస్థానీలను గుర్తించి వెనక్కి పంపేయండి



## హోంమంత్రి అమిత్‌షా ఆదేశాలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:** జమ్ము కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో శుక్రవారం మాట్లాడారు. ఆయా రాష్ట్రాల్లో నివాసం ఉంటున్న పాకిస్థానీ జాతీయలను గుర్తించి తిరిగి వాళ్ల దేశానికి పంపించాలని ఆదేశించారు. వాళ్లు తిరిగి వెళ్లేలా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. గడువు తేదీ ముగిసే వరకు పాకిస్థాన్ జాతీయులు ఉండకుండా చూడాలని కోరారు. తొలుత స్థానికంగా ఉంటున్న పాకిస్థానీయులను గుర్తించి ఆ సమాచారం కేంద్రానికి ఇవ్వాలని, అప్పుడే వారి వీసాల రద్దుకు అవకాశం ఉంటుందన్నారు. కాగా, ఇప్పటికే పాకిస్థాన్ పౌరులకు జారీ చేసిన వీసా సేవలను నిలిపివేసిన భారత్, ఈనెల 27 వరకూ అన్ని వీసాలు రద్దవుతాయని తెలిపింది. వీసాల గడువు ముగిసేలోగా పాక్ పౌరులంతా భారత్‌ను వీడి వెళ్లాలని చెప్పింది. అయితే, ఈ వీసాల రద్దు అంతుకు ముందు పాకిస్థానీ హిందువులకు జారీ చేసిన వీసాలకు వర్తించదని కేంద్రం తెలిపింది. దీంతో పలువురు పాక్ జాతీయులు అటారీ సరిహద్దు ద్వారా భారత్‌ను వీడి వెళ్లిపోతున్నారు. ఆగ్రా తాజ్ గంజ్ లోని తమ బంధువుల ఇంటికి ఒక నెల వీసాపై వచ్చిన పాకిస్థాన్ పౌరులను పోలీసులు తిరిగి పంపించారు. కరాచీకి చెందిన ఓ కుటుంబం మాట్లాడుతూ తమ బంధువులను కలుసుకునేందుకు 45 రోజుల వీసా గడువుపై భారత్‌కు వచ్చామని తెలిపింది. గతంలో భారత్ సార్క్ వీసా పొడిగింపు పథకం కింద చాలా మంది పాకిస్థాన్ జాతీయులకు భారత్‌లో పర్యటించే అవకాశం కల్పించారు. ఈ పథకం కింద భారత్‌లో ఉన్న ఎవరైనా సరే 48 గంటల్లో దేశాన్ని వీడాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. కానీ, మెడికల్ వీసాలు పొందిన వారికి మాత్రం ఏప్రిల్ 29వ తేదీ వరకు గడువు ఉంది. కాగా, పాక్ నుంచి కొత్త దరఖాస్తుదారులకు వీసా సర్వీసులను తక్షణమే నిలిపివేశామని విదేశాంగ శాఖ ఇప్పటికే వెల్లడించింది. దీంతోపాటు పాక్‌లో ఉన్న భారత జాతీయులు కూడా తిరిగి వచ్చేయాలని అడ్వైజరీ జారీ చేసింది. మరోవైపు సింధూ నది జలాల వివాదంపై తన నివాసంలో అమిత్ షా చర్చించనున్నారు. ఈ సమావేశానికి షాతో పాటు జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, పలువు ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. ఇప్పటికే ఈ ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు అధికారులు వెల్లడించారు.

### సరిహద్దుల్లో పాక్ కవ్వింపు చర్యలు

పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడితో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ సరిహద్దుల్లో దాయాది సైన్యం కవ్వింపు చర్యలకు దిగింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి మరి జమ్ముకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంబడి, పలు ప్రాంతాల్లో పాక్ సైన్యం కాల్పులకు తెగబడ్డాయి. ఈ దాడిని భారత్ ఆర్మీ దీటుగా బదులిచ్చినట్లు సైనిక వర్గాలు తెలిపాయి. గురువారం అర్ధరాత్రి నుంచి ఈ కాల్పులు జరుగుతున్నట్లు పేర్కొన్నాయి. అయితే ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదని, ఎవరికీ గాయాలు కాలేదని ఆర్మీ అధికారి ఒకరు వెల్లడించారు. ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. మరోవైపు, జమ్ముకశ్మీర్‌లోని బందిపొరాలో ఎన్‌కౌంటర్ జరిగింది. శుక్రవారం ఉగ్రవాదులతో జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు భద్రతా సిబ్బంది గాయపడ్డారు. ఈ జిల్లాలోని కుల్నార్ బజిపొరా ప్రాంతంలో ఉగ్రవాదులు

>>2



## 3 రోజుల కస్టడీకి పిఎస్ఆర్

**విజయవాడ,ఏప్రిల్25,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ఇంటలిజెన్స్ మాజీ ఛీఫ్ పిఎస్ఆర్ ఆంజనేయులు కస్టడీ పిటీషన్‌పై విజయవాడ కోర్టులో విచారణ జరిగింది. ఆయన్ను వారం రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సిఐడి అధికారులు పిటీషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న న్యాయస్థానం మూడు రోజుల కస్టడీకి అనుమతించింది. ఆది, సోమ, మంగళవారాల్లో సిఐడి అధికారులు ఆయన్ను కస్టడీకి తీసుకోనున్నారు. ఉదయం 10 నుండి సాయంత్రం 5గంటల వరకు విచారించనున్నారు. న్యాయవాదుల

>>2

# 'ఉగ్ర' నిర్మూలనకు మద్దతు

## సంక్లిష్టస్థితిలోనైనా కేంద్రంతోనే ఉంటాం

## అమరావతి పనులు పునఃప్రారంభానికి ప్రధాని మోడీని ఆహ్వానించిన బాబు



శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఏప్రిల్ 25,ప్రభాతవార్తప్రతినిధి:** ఎటువంటి సంక్లిష్ట పరిస్థితుల్లోనైనా కేంద్రంతోనే తాముంటామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయ్యారు. శుక్రవారం సాయంత్రం ఆయన కేంద్ర మంత్రులు కె,రామ్మోహన్ నాయుడు, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు కృష్ణదేవరాయల్‌తో కలిసి ప్రధాని మోడీని కలుసుకున్నారు.పహల్గామ్ ఉగ్రదాడిని చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. కేంద్రం తీసుకునే ఎలాంటి నిర్ణయానికైనా రాష్ట్ర ప్రభుత్వం

>>2

# 'కల్తీనెయ్యి' కేసులో ఇంకా సస్పెన్స్ ఎందుకో?

## కీలక సూత్రధారులెవరో తేల్చేదెన్నడు?



**తిరుమల,ఏప్రిల్ 25ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరా చేసిన కేసులో అసలు కీలక సూత్రధారులెవరని తేల్చేవిషయంలో సిబిఐ సిట్ గోప్యత పాటిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కల్తీనెయ్యి సరఫరా చేసిన కేసులో టెండర్లు పిలిచి దక్కించుకుని ,అర్హత సామర్థ్యం లేకపోయినా నెయ్యిసరఫరా చేసేలా సహకారమందించిన వారెవరని తేల్చడంలో సిట్ అధికారులు ఇప్పటికే ఆధారాలు సేకరించినా మౌనంగా ఉండటం అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికే ఈ కేసులో నలుగురు నిందితులు ఏఆర్ డైరీ ఎండి రాజశేఖరన్ , ఉత్తరప్రదేశ్‌కు, ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబాడైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, పోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పెనుబాక)సిఇఒ అపూర్వవినయ్ కాంత్ చావ్దాలను సిట్ కస్టడీకి తీసుకుని సమగ్రంగా విచారణ చేసిన విషయం విదితమే. కల్తీనెయ్యి సరఫరాలో కీలకంగా మారిన ఇద్దరు నిందితులు ఫోమిల్‌జైన్, అపూర్వవినయ్‌కాంత్‌చావ్దా సిట్ కస్టడీలో కొన్నివాటికి సమాధానాలు చెప్పగా మరికొన్నిటికి గుర్తులేదు, తెలియదనే సమాధానాలిచ్చిందనేది సమాచారం. సిబిఐ సిట్ అధికారులు నాలుగు టీమ్‌లుగా తమిళనాడులోని దిండిగల్‌లో ఉన్న ఏఆర్ డైరీని, పాలు సేకరణ,చిల్లింగ్ ప్లాంట్‌లు, నెయ్యితయారీ, టిటిడికి ఎవరి ద్వారా నెయ్యిసరఫరా టెండర్లు దక్కించుకున్నారు, ఈ డైరీకి అర్హతలు ఉన్నాయా అనే కోణంలో కూడా విచారణ ముగించారు.నాయుడుపేటసమీపంలోని వైష్ణవి డైరీలో కూడా ఇదే తరహాలో విచారణ సాగించి కొన్ని కీలకమైన ఫైళ్ళను, పాలు, నెయ్యితయారీ నమూనాలను సేకరించారు. తిరుమలలోని గోడౌన్‌లను, నెయ్యి నమూనాల పరిశీలనకు సంబంధించి ఆధారాలు ,వివరాలు రాబట్టుకున్నారు. సిబిఐ సిట్ అధికారులు సిబిఐ జాయింట్ డైరెక్టర్ వీరేశ్‌ప్రభు,

>>2

## విజయవాడలో 10 మంది ఉగ్రవాదులు?

### సమాచారమిచ్చిన నిఘా సంస్థ

**విజయవాడ,ఏప్రిల్25,ప్రభాతవార్త ప్రతినిధి:** ఉగ్ర కదలికలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. సిమి సానుభూతిపరుల గురించి 2 నెలల క్రింద కేంద్ర నిఘా వర్గాల నుండి విజయవాడ పోలీసులకు సమాచారం అందింది. కేంద్ర నిఘా సంస్థ నలుగురు అనుమానితుల గురించి సమాచారం ఇచ్చింది. మరో ఆరుగురు అనుమానితులను స్థానిక పోలీసులు గుర్తించారు.


>>2

## సునీల్‌కుమార్‌పై ఆరు అభియోగాలు

### 30 రోజుల్లోగా సమాధానాలివ్వాలని ప్రభుత్వ ఆదేశం

**విజయవాడ,ఏప్రిల్ 25,ప్రభాతవార్త ప్రతినిధి:** సీనియర్ ఐపిఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌పై రాష్ట్ర ప్రభుత్వం పట్టుబిగుస్తోంది. ఆయనపై క్రమశిక్షణా చర్యలకు ఉపక్రమించింది.జగన్మోహనరెడ్డి హయాంలో ఆయన రాష్ట్రప్రభుత్వ అనుమతి తీసుకోకుండా తరచూ దుబాయ్ సహా ఇతర

>>2



## తీవ్ర వడ గాల్పులు

### పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలెర్ట్

### మేలో వర్షాలు కురిసే అవకాశం

**విజయవాడ,ఏప్రిల్ 25,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో వడగాల్పుల తీవ్ర

>>2



కస్తూరి రంగన్ (ఫైల్)

# అవిశ్రాంత అంతరిక్ష పరిశోధకుడు కస్తూరి రంగన్ కన్నుమూత

## ప్రధానితో సహా పలువురు దిగ్భ్రాంతి

**శ్రీహరికోట(తడ), ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** అంతరిక్ష విజ్ఞానంలో అలుపెరగకుండా శ్రమించి భారతదేశాన్ని అగ్ర దేశాలకు దీటుగా నిలిపిన డాక్టర్ కృష్ణస్వామి కస్తూరి రంగన్ (84) ఇక లేరు. శుక్రవారం ఉదయం 10.43 గంటలకు బెంగళూరులోని ఆయన నివాసంలో కన్నుమూసారు. డా. రంగన్ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోడీతో పాటు దేశ విదేశాలకు చెందిన అంతరిక్ష శాస్త్రవేత్తలు, ప్రముఖులు తీవ్ర సంతాపం ప్రకటించారు. భారత దేశం అగ్రరాజ్యాలతో పోటీ పడి అంతరిక్ష పరిశోధనలు చేయడానికి కస్తూరి రంగన్ సేవలు ఎనలేనివి. క్రయోజనిక్ ఇంజన్లు ఇచ్చేందుకు నిరాకరించిన అగ్రదేశాల ఆంక్షలను లెక్కచేయక స్వదేశి పరిజ్ఞానంతో నిర్మించుకున్న ధిశాలి కస్తూరి రంగన్. కేరళ రాష్ట్రంలోని యర్నాకులంలో విశాల, సిఎం కృష్ణస్వామి దంపతులకు 1940 అక్టోబర్ 24న కస్తూరి రంగన్ జన్మించారు. వారిది మధ్య తరగతి కుటుంబం. తండ్రి ఉద్యోగం కోసం అప్పట్లో బొంబాయికి వెళ్ళాల్సి వచ్చింది. అక్కడే బిఎస్సీ, ఎంఎస్సీ పూర్తి చేశారు. మొదటి నుండి ఖగోళ శాస్త్రంపై ఆసక్తి పెంచుకున్న కస్తూరి రంగన్ ఆ శాస్త్రానికి సంబంధించిన ఎన్నో పుస్తకాలు చదివేవారు. అనంతరం భారత అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాబాయి సహచర్యం లభించింది.ఆయన స్ఫూర్తితో అంతరిక్ష

>>2




వార్త

బలీయమైన విశ్వాసాలు, నైతిక సూత్రాలకు కట్టుబడని వారు ఏ పార్టీలో ఉన్నా వారికి ఆ పార్టీకి కూడా క్షేమం కలగదు.

-ఆండర్సన్

# అప్రకటిత యుద్ధం?

దాయాది దేశాలు కయ్యానికి కాలు దువ్వుకుంటున్న విషయం భారతదేశ ప్రజలకు ఈ పాటికే అర్థమయ్యింది. పాకిస్థాన్ ఆర్మీచీఫ్ మునీర్ ఈ మధ్యనే ఇచ్చిన స్టేట్మెంట్ ఒకటి పహల్గాం ఊచ కోతను ప్రోత్సహించినట్లుగా ప్రతి భారతీయునికి తెలిసే ఉంటుంది. కశ్మీర్ పాక్ కంఠ రక్తనాళంగా చెపుతూ ఆ పాంతం మీద తమకున్న భ్రమను విశ్లేషిస్తూ ఆయన అన్నమాటలు నిజంగా ముష్కరుల దుశ్చర్యలకు ప్రోత్సహించి ఉంటాయనడంలో సందేహం లేదు. 26 మంది పర్యాటకులను ఒక్కసారిగా బలి తీసుకున్న ఘటనతో తమకేమీ సంబంధం లేదని పాకిస్థాన్ బుకాయిస్తోందన్న మాట తెలిసిందే. భారత దేశం యావత్తు మొన్నటి నరమేధాన్ని ముక్త కంఠంతో ఖండిస్తోంది. దీని వెనుక పాక్ ఆర్మీ అండదండలు ఉండి ఉంటాయని సంపూర్ణంగా నమ్ముతోంది. ఆ దాడిని అన్ని దేశాలు ఖండిస్తున్నాయి. జూన్ నెలలో జరిగే అమర్నాథ్ యాత్రను నిలువరించే పన్నాగం ఇదొక భాగమే. ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు దేశం సంసిద్ధంగా ఉంది. భారత్, పాకిస్థాన్‌లు ఒకరిపై ఒకరు ఆంక్షలు విధించుకోవడం చూస్తుంటే వారీ మధ్య జరుగబోయే భయంకర యుద్ధానికి సంకేతాల వలె అనిపిస్తున్నాయి. దాదాపు వారి మధ్య భయంకర యుద్ధానికి దారితీసే అవకాశమే కనిపిస్తోంది. ఇతర దేశాల రాయబారులకు ఆయా దేశాల మద్దతు కూడగట్టే పనిలో విదేశాంగ శాఖ నిమగ్నమైంది. అంతర్జాతీయ వేదికపై పాక్ దుశ్చర్యను ఎండగట్టి ఒంటరి చేయాలన్న తలంపుతో అమెరికా, రష్యా, బ్రిటన్, ఇటలీ, జర్మనీ, ఆస్ట్రేలియా, యూఏఈ రాయబారులతో భేటీ అయి కాశ్మీర్ నరమేధంలో, పాక్ పాత్ర గురించి వివరించే పనిలో విదేశాంగ శాఖ కృషి చేస్తోంది. పహల్గాం మారణకాండ అనంతరం న్యూఢిల్లీ గాని పాకిస్థాన్ హై కమిషనర్ కార్యాలయంలో సిబ్బంది మిఠాయిలు పంచుకున్నారని తెలియగానే ప్రభుత్వం పాక్ హై కమిషనర్ కార్యాలయంలో నియమితులైన రక్షణ, నావికా దళ, వైమానిక దళ సలహాదారులను 'పర్సన్ నాన్ గ్రాటా' గా ప్రకటించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఆ మేరకు ఆయా అధికారులు వారం రోజుల్లోగా భారతదేశం విడచి వెళ్లాలి. ఇస్లామాబాద్‌లోని భారత్ హై కమిషన్ నుంచి మన ఉద్యోగులను వెనక్కి తిరిగి రప్పిస్తోంది. వాఘా అటారీ చెక్ పోస్ట్‌ను భారత్ తక్షణమే మూసి వేసింది. భారత్ గగన తలాన్ని మూసి వేసింది. అమెరికా, యూరప్ తదితర దేశాలకు తమ గగనతలం మీదుగా వెళ్లే విమానాలను అనుమతించబోమని పాక్ స్పష్టం చేసింది. దీని వలన భారత్ నుంచి ఆయా దేశాలకు చేరడం విమాన ప్రయాణికులకు వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని. ఉభయ దేశాల మధ్య వాణిజ్య ఒప్పందాలు కూడా నిలిచిపోయాయి. ఇప్పుడు ఉభయ దేశాల మధ్య సఖ్యత లేదు. సిమ్లా ఒప్పందమూ లేదు, సింధు జలాల వాటా లేదని భారత్ నిర్ద్వంద్వంగా తేల్చిచెప్పింది. ఉన్నట్టుండి ఇరు దేశాలు సరిహద్దుల్లో క్షిపణి పరీక్షలకు దిగాయి. సరిహద్దు గ్రామంలో గన్‌తో తచ్చాడుతున్న సింగ్ అనే జవానును పాక్ రక్షక దళాలు బంధించి ఇంకా విడచి పెట్టనేలేదు. ఈదుర్ఘటన అనంతరం అక్కడ పాక్ భారత సైనిక అధికారుల మధ్య రిట్రీట్‌కు ఏమాత్రం ఆస్కారం లేదు. భారత్ బాగా సీరియస్‌గా ఉంది. పర్యాటకులు దారుణ మరణానికి గురయ్యాక ఉభయ దేశాల సైన్యం మధ్య పలకరింపులు కూడా లేవు. భారత దేశం తమను నమ్మడం లేదని పాకిస్థాన్ గుర్తించి వెంటనే, కొత్త పల్లవి అందుకుంది. అయితే కంటి తుడుపు చర్యగా ఊచకోతను ఖండించింది. దాడికి కుట్రలో తమ దేశపు పాత్రపై కిమ్మనలేదు. వీసా స్కీమ్ కింద భారత్‌లో ఉన్న పాకిస్థానీయులు 48 గంటలలోపు దేశం విడిచి వెళ్లాలి. సార్క్ వీసా మినహాయింపు పథకం కింద పాక్ పౌరులకు కూడా ఇకపై భారత్లో ప్రవేశించే అనుమతి లేదు. దాయాది దేశాల మధ్య ఏనాటి నుంచో అమలులో ఉన్న సింధు జలాలపై హక్కులకు సంబంధించి ఒప్పందాన్ని భారత్ తక్షణమే రద్దు చేసింది. కలలో కూడా ఊహించని రీతిలో ఉగ్రవాదులకు, వారికి మద్దతునిచ్చిన వారికి బుద్ధి చెబుతామని, ప్రతీకార చర్యలు తీసుకుంటామని ప్రధాని నరేంద్ర మోడీ తీవ్రంగానే హెచ్చరించారు. భారత్ నుంచి ఇది ఊహించని షాక్. పాక్‌లో వ్యవసాయానికి సింధు జలాలె ఆధారం. గతంలోఇలాంటి ఊచకోత ఘటనలు జరిగినా భారత్ జలజగడాల జోలికి పోలేదు. తాజా అంశంలో భారత్ బాగా సీరియస్ అయ్యింది. సింధుజలాల ఒప్పందం రద్దుతో పాకిస్థాన్ ఒక్కసారిగా సంయమనం కోల్పోయింది. భారత్ తొందరపడి ఈ విషయంలో ఇలాంటి నిర్ణయం తీసుకుంటుందని భావించలేదు. సాధారణంగా ఇలాంటి సందర్భాలు జరిగినప్పుడల్లా భారత్ హెచ్చరించి వదిలిపెట్టడమో, ఉగ్రవాదుల ఏరివేత మంత్రంతో సరిపెట్టుకోవడం చేసేది. అవసరమైతే ఈ జలవివాదంపై అంతర్జాతీయ కోర్టుకి న్యాయం కోసం సంప్రదిస్తానని వివరించింది. తాము దేనికైనా రెడీ అనే ధోరణిలో పాకిస్థాన్ నేతలు మాట్లాడుతున్నారు. ఈ సారి సింధు జలాల వాటాలో కోత అనడంతో యుద్ధాన్ని ప్రకటించినట్లేనని పాకిస్థాన్ స్పష్టంచేసింది. సరిహద్దుల్లోకి అత్యాధునిక ఆయుధాలు, క్షిపణులను తరలిస్తోంది. భారత్ కూడా అత్యాధునిక యుద్ధ విమా నాలు, క్షిపణి వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్, దానికితోడుగా యుద్ధ నౌక సూరత్ పాక్‌వైపుకు తరలి వెళ్తున్నాయి. ఇవన్నీ క్రోడీకరించుకుంటే నేరుగా యుద్ధం ప్రకటిం చకపోయినా సరిహద్దుల్లో యుద్ధ ఛాయలు కనిపిస్తున్నాయి.

నీది కాదని తెలిసిన దాన్ని కూడా నీదనుకోవడం నిజంగా నేరం.



ఠాగూర్

ప్రయత్నించండి, అపేక్షించండి, అన్వేషించండి కానీ లొంగిపోకండి.



మహాత్మాగాంధీ

# ప్రజావాక్కు



### భగవద్గీతకు యునెస్కో గుర్తింపు

భగవద్గీతను యునెస్కో గుర్తించి మెమరీ ఆఫ్ ద వరల్డ్ రిజిస్టర్‌లో చేర్చినందుకు భారతీయులు, మరీ ముఖ్యంగా హిందువులు గర్విస్తున్నారని వార్తలు అందుతున్నాయి. కుల,మతాలకు అతీతంగాభారతీయులు అందరూ, ప్రపంచ ప్రజలందరూ సంతోషించాల్సిందే. కానీ యునెస్కో భగవద్గీతను గుర్తించినందుకుకాదు, భగవద్గీత గొప్పతనాన్ని గుర్తించే స్థాయికి యునెస్కో ఎదిగినందుకు. భగవద్గీతను గుర్తించి యునెస్కో తనను తాను గౌరవించుకొంది. అది విషయం.ప్రపంచ మేధావులు ఏనాడో భగవద్గీత గొప్పతనాన్ని గుర్తించి వేనోళ్ల చాటి చెప్పారు.

-రాచమడుగు శ్రీనివాసులు, అనంతపురం

### టీచర్లకు బదలీలు నిర్వహించాలి

ఆంధ్రప్రదేశ్‌లోని 164 మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న రెగ్యులర్ ఉపాధ్యాయులకు బదలీల అవకాశాన్ని కల్పించేదుకు ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించాలి. ఇప్పటికే 2018, 2019లో నియమితులైన ఉపాధ్యాయులు ఐదేళ్లకుపైగా సుదూర ప్రాంతాల్లో కొనసాగుతున్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ ఉపాధ్యాయులకు చట్ట పరిధిలో బదలీలు జరిపే సందర్భంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకూ అదేవిధంగా అవకాశమివ్వాలి. ముఖ్యంగా మోడల్ స్కూల్స్ డీఎస్సీ2025 నిర్వహణకు ముందే బదలీలు చేపడితే, మోడల్ స్కూల్స్‌లో సిబ్బంది క్రమబద్ధీకరణ జరిగి, న్యాయం జరిగే అవకాశం ఉంటుంది.

-బి. సురేష్, ఆంధ్రప్రదేశ్

### పెట్రేగిపోతున్న అవినీతి

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల్లో అవినీతి పెట్రేగిపోతుంది. ఏ కార్యాలయం వెళ్లినా లంచం ఇవ్వనిదే పని కావడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఒక్క జనవరి నెలలోనే ఇరవై మంది ఏ.సి.బి కి చిక్కడం సంచలనం సృష్టించింది.ప్రజలతో నేరుగాసంబంధం ఉండే రెవెన్యూ, మున్సిపల్, విద్యా,ఆర్థిక, పశుసంవర్ధక,పోలీస్, పంచాయతీ రాజ్‌శాఖల్లో అవినీతి ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. కొంతమంది లంచావతారులు చేతికి మట్టి అంటకుండా ప్రైవేట్‌వారిని నియమించుకుని లంచాలకు మరిగినారు. అవినీతి అధికారులు ఇకనైనా మారండి. ప్రజలకు అవినీతి రహిత సేవలు అందించాలి.

-కె. సతీష్ రెడ్డి జయశంకర్, భూపాలపల్లి జిల్లా

### పనుల వేగం పెరగాలి!

రాష్ట్ర రాజధాని అమరావతికి 57 కిలో మీటర్ల రైలు మార్గం నిర్మాణం పూర్తి కావడానికినాలుగు సంవత్సరాలు పడుతుందని రైల్వే శాఖ ప్రకటించింది. 57 కిలో మీటర్ల మార్గానికి అంత సుదీర్ఘ కాలం పట్టడం ఆశ్చర్యంగా ఉంది! వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే ముఖ్యమంత్రి బుల్లెట్ ట్రైన్ అంటూ ప్రకటనలు చేయడం విడ్డూరంగా ఉంది ! నిజానికి ఈ ప్రతిపాదిత మార్గం ఒక రైలు మార్గంనుంచి మరోమార్గానికి అనుసంధానించడమే, అదీ పూర్తిగా మైదానప్రాంతం! ఒక్క కృష్ణానదిపై రైల్వే బ్రిడ్జి తప్పితే మిగిలిన పనులు ఒకటి,రెండుసంవత్సరాల్లో పూర్తి చేయవచ్చు! రైల్వే బ్రిడ్జి కూడా ఇప్పుడు మొదలు పెడితే రెండు సంవత్సరాల్లో పూర్తిచేయవచ్చు?భూసేకరణ ఇప్పటికే ప్రారంభ మైంది. నిర్మాణ పనులను విభజించి టెండర్ల ప్రక్రియ పూర్తి చేయడానికి కాలయాపన చేయడం తగ్గించి పనుల్లో వేగం పెంచితే రెండుసంవత్సరాల్లో పూర్తిచేయవచ్చు. ప్రజా ప్రతినిధులు, రాష్ట్రప్రభుత్వం రైల్వేశాఖపై పనుల వేగానికి ఒత్తిడి పెంచాలి!

-జి. రామ కృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి

ఈ ఎండాకాలంలో ఎండలు మరింత ఉగ్రరూపం చూపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో నీటి సంరక్షణ చర్యలు అత్యవసరమైతే ఆ చర్యలు ప్రస్తుత అవసరాలను తీర్చుకోవడంతోపాటు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సాగాల్సిన అవసరం ఉంది. అయితే ఉపాధి హామీలో చిన్న నీటి కుంటలు, పార్కులేషన్ టాంక్స్ నిర్మాణం పైన గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు దృష్టి సారించాలి. ఇకపోతే రైతులకు కూడా భూగర్భ జలం పెరగడంతోపాటు పశు పక్షాదులకు దాహం తీరే అవకాశం ఉంటుంది.దానివల్ల వేసవిలోకూలీలకు పని దొరకడంతోపాటు ఇంకా నీరుభూమిలోకి ఇంకి జల మట్టం పెరుగుతుంది.

-భారత అవినాష్, జనగామ

### వికలాంగులకు డిప్యుటేషన్ ఆపాలి

తెలంగాణ రాష్ట్రంలోని వివిధ గురుకులాలలో పనిచేస్తున్న వికలాంగులైన లెక్చరర్స్,ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌ను రద్దు చేయాలి.జులై2024లోకొత్తగా లెక్చరర్స్‌గా ఉపాధ్యాయులుగా ఉద్యోగాలలో నియామకం జరిగింది. సంవత్సర కాలం కూడా పూర్తికాకముందే ఇప్పుడే డిప్యూటేషన్ వలన చాలా ఇబ్బందులు కలుగుతాయి. నివాసం ఉండడానికి గదులు కిరాయికి తీసుకొని ఉంటున్నారు. వేరే ప్రాంతాలకు వెళ్లడం చాలా ఇబ్బందికరం.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# చదువుల యజ్ఞంలో సమిధలు

**తలతాకట్టుపెట్టి అప్పోసొప్పో చేసి లక్షలాది రూపాయలు తల్లిదండ్రులు తమ భవిష్యత్ కోసం ఫీజుల రూపంలో చెల్లించడం, వారు ఆశించిన మేరకు తాము చదవలేకపోవడం, చదివినా మనసుకెక్కపోవడంతో మానసిక సంఘర్షణకు గురై అటు తల్లిదండ్రులకు వాస్తవ పరిస్థితులు చెప్పి ఒప్పించలేక ఈ బోధన చేసే అధ్యాపకులతో మనసువిప్పి తమ బాధలను వివరించలేక మానసిక ఒత్తిడిని తట్టుకోలేక తనువును చాలిస్తున్నారు. అయితే కొందరు అధ్యాపకులకు కొన్ని సందర్భాల్లో అర్థమైనా యాజమాన్యాల వ్యాపార కాంక్షకు వెరసి పెదవి విప్పలేకపోతున్నారు. ఇలా బట్టీపెట్టిన నాలుగు ముక్కలు రాసో,లేక మరో మార్గంలోనో ర్యాంకులు సంపాదించిన కొందరు విద్యార్థులు ఐఐటి లాంటి సంస్థల్లో చేరినా అక్కడ బోధనా పద్ధతుల్లో, విధానాల్లో ఇమడలేకపోతున్నారు. ఇలా ఈ చావులకు ఎన్నో కారణాలున్నాయి.**

దామెర్ల సాయిబాబ

మేధస్సు పంచేవారు మనిషి, మనసును పంచేవారు మహర్షి అన్నారు పెద్దలు.మన విద్యాలయాల్లో అంతో ఇంతో మేధస్సును అందిస్తున్నారు. కానీ మనసును పెంచే వారే కరవైపోతున్నారేమోననిపిస్తున్నది.అందుకే పరిస్థితులు వికటించి భావిభారత పౌరులుగా ఎదిగి ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న విద్యార్థుల జీవితాల్లో అంధకారం అల్లుకొని అర్ధాంతరంగా బలవన్మరణాల పాలవుతున్నారు. మొన్న ఇంటర్మీడియేట్ పరీక్షా ఫలితాలు వెలువడిన ఒక్క రోజే తెలంగాణ రాష్ట్రంలో ఆరుగురు విద్యార్థులు ఆత్మ హత్యలు చేసుకున్నారు.కొత్త విద్యాసంవత్సరం ప్రారంబమయ్యేనాటికి మరెందరు సమిధలైపోతారో? వైద్య విద్యతోపాటు ఇంజినీరింగ్ ఇతర ప్రవేశపరీక్షల ఫలితాలు వచ్చే వరకు ఇంకెందరు ప్రాణాలు తీసుకుంటారనే ఆందోళన వ్యక్తమవుతున్నది.నిన్న మొన్నటివరకు ఎంతో ఉల్లాసంగాఉన్న భావిభారత పౌరులు పరీక్షా ఫలితాలు రాగానే ఏదో ఒక్క సబ్జెక్టులో తప్పామనో, లేక అనుకున్న మార్కులు రాలేదనో లాంటి చిన్నచిన్న కారణాలతో ప్రాణాలు తీసుకుంటున్నారు. విద్యార్థి దశలోనే అర్ధాంతరంగా తనువు చాలిస్తున్న భావిభారత పౌరులను చూసి యావత్ దేశం నివ్వెరపోతున్నది.ఒకరు కాదు, ఇద్దరు కాదు యేటా దేశవ్యాప్తంగా వేలాదిమంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడడం సర్వత్రా ఆవేదన వ్యక్తమవుతున్నది. తల్లిదండ్రుల ఆశలను, ఆకాంక్షలను నెరవేరుస్తూ కుటుంబంలో కాంతు లు వెదజల్లే దీపాల్లాంటివారు. భవిష్యత్‌లో దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిన దివ్వెలు అర్థాంతరంగా ఆకస్మి కంగా ఆరిపోతున్నారు. కని, పెంచిన వారి ఆశలను చిదిమేస్తూ కుటుంబాల్లో అంధకారాన్ని నింపుతూ కనుమరగవు తున్న ఈ విద్యాదీపాల వెనుక ఎన్నోకారణాలు పైకి కన్పిస్తున్నా ఒత్తిడిని తట్టుకోలేకపోవడమే ప్రధాన కారణమనేది కాదనలేని వాస్తవం. కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రులు ఆ గర్భశోకాన్ని భరించలేక అనారోగ్యంపాలై తనువులు చాలిస్తుంటే మరికొందరు బలవంతపు చావులకు కూడా వెనుకాడడం లేదు. భారత్‌లో 1995-2019 మధ్య కాలంలో వివిధ కారణాలతో లక్షా డెబ్బైరెండు వేల మంది బలవన్మ రణాలకు పాల్పడినట్లు జాతీయ నేర గణాంకాల విభాగం ఎన్‌సిఆర్‌బి స్పష్టంచేసింది. దేశంలో ప్రతి గంటకు సగటున ఒక విద్యార్థి బలవన్మరణానికి పాల్పడుతున్నాడని ఎన్‌సి ఆర్‌బి గతంలో పార్లమెంటుకే నివేదించింది. పోని పది, ఇంటర్ పరీక్షల్లో మంచి మార్కులతో పాసయి పోటీ పరీక్షల్లో ర్యాంకులు సంపాదించి ప్రతిష్టాకరమైన ఐఐటిల్లోనో, మెడికల్ కాలేజీల్లోనో సీట్లు సంపాదించిన వారు సైతం ఈ చదువుల ఒత్తిడికి బలైపోతున్నారు. ప్రతిష్టాకరంగా ఐఐటిల్లో సీటు వచ్చిందని చేరుతున్న విద్యార్థులు కూడా అర్ధాంతరంగా తనువులు చాలిస్తున్నారు. మొన్న ఆ మధ్య హైదరాబాద్ ఐఐటిలో చదువుతున్న విద్యార్థి విశాఖపట్నం వెళ్లి సముద్రంలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. 2019 లోనే ఐఐటిల్లో నే ఏడుగురు విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఇప్పటివరకు ఈ మధ్యకాలంలో, కేంద్రీయ యూనివర్సిటీల్లో ఇరవైఐదు మంది, ఎన్ఐటిలో మరో ఇరవైఐదు మంది, ఐఐఎంలలో నలుగురు, ట్రిపుల్ ఐటిలో ఇద్దరు ఆత్మహత్యలకు పాల్పడినట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. దేశం లో విద్యార్థులు బలవన్మరణాలు ప్రధాన మంత్రి నరేంద్రమోడీని సైతం కదిలించాయి. పరీక్షలఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలని తెలియచేస్తూ 'ఎగ్జామ్ వారియర్స్'అనే పుస్తకాన్ని ప్రధానమంత్రి స్వయంగా రాశారు.పది, పన్నెండు తరగ తుల విద్యార్థులు పరీక్షలఒత్తిడిని తట్టుకొని జయించాలనే విషయాన్ని ఆ పుస్తకంలో విశ్లేషించారు. మార్కుల కన్నా, తమకు సహజంగా ఉండే నైపుణ్యాలపై విద్యార్థులు దృష్టిసారించాలనే లాంటి సూచనలు ఎన్నోచేశారు. వాస్తవంగా చూస్తే విద్య ఒక వ్యాపారంగా రూపాంతరం చెందినప్పటి నుండి ఈదురదృష్టపు పరిస్థితులు దాపురిస్తున్నాయి. గతం లో ఇంతటి దారుణ పరిస్థితులు లేవని చెప్పొచ్చు. ప్రాచీన భారత విద్యావిధానంలో కళలకు చక్కటి స్థానం ఉండేది. ఆచరణాత్మక పరీక్షా విధానాలు అవలంబించేవారు. నలంద, తక్షశిల విశ్వవిద్యాలయ పరీక్షల్లో పాల్గొనేందుకు విదేశాల నుంచి కూడా విద్యార్థులు తరలివచ్చేవారు. అప్పట్లో తరగ తుల్లో తక్కువ బోధించేవారు. ప్రయోగాత్మక విద్యకు అత్యం త ప్రాధాన్యత ఇచ్చేవారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ప్రభుత్వ బడులే కానీ, ప్రైవేట్ బడులు అంతగా లేకపోయేవి. ఎక్కడో ఒకటి, రెండుఉన్నా వాటి నిర్వహకులు లాభాపేక్ష లేకుండా విద్యాబోధనే ధ్యేయంగానడిపేవారు. తెలంగాణలో వాటిని 'కాణిగ' బడులు అనేవారు. ఈబడుల్లో విద్యాభ్యాసం చేసినవారు ఉన్నత చదువులకు ఎదిగి ఎన్నో కీలకమైన పదవులు అలంకరించి సమాజానికి నిరుపమాన సేవలు అందించారు. కానీ రాను రాను విద్యవ్యాపారంగా రూపాంతరం చెందింది.మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా తల్లిదండ్రుల ఆకాంక్షను దృష్టిలో ఉంచుకొని అవసరమైన విద్యనుఅందించడంలో ప్రభుత్వపరంగా విఫలమవుతున్నారనే చెప్పొచ్చు.విధానాలు, ఆలోచనలు ఎన్నో ఉన్నాయి. దేశవ్యాప్తంగా లక్షలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారు. కానీ ఆశించిన ఫలితాలు రావడంలేదు. అమలులో ఎన్నోలోపాలున్నాయి. ప్రైవేట్ విద్యపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మరొకపక్క పిల్లల చదు వులకై తల్లిదండ్రులకు ఆరాటం, ఆసక్తి అంతకంతకు పెరిగి వారిని చదివించుకోవడం ఒక్కటే జీవిత లక్ష్యంగా మారింది. తల్లిదండ్రులు చేస్తున్న త్యాగాలు చూస్తుంటే విస్తుపోవాల్సి వస్తుంది. పిల్లల చదువుల కోసం పుట్టిపెరిగిన ఊరును,తమ జీవనోపాధిని సైతం లెక్కచేయడానికి కడుపు చేతపట్టు కొని పట్టణాలకు, నగరాలకు, వలసవచ్చి చిన్నాచితక ఉపాధితో జీవనం సాగిస్తున్నారు. వచ్చే కొద్దిపాటి జీతంలో పొదుపుచేసి తలతాకట్టుపెట్టి ఫీజులుకడుతున్నారు. మధ్య తరగతి కుటుంబాల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కేవలం కార్పొరేట్ కాలేజీల్లో చదువుతేనే తాము కోరుకున్న ప్రొఫెషనల్ కాలేజీల్లో కావాల్సిన కోర్సులో సీటు దొరుకుతుందనే ప్రచారం పెరిగిపోయింది.మరొకపక్క ఇంజినీరింగ్, ఐఐటి, మెడికల్ వంటి ఉన్నతవిద్యను అభ్యసించిన పిల్లలకే వెంటనే ఉద్యోగాలు దొరకడమో, లేక విదేశాల్లో జీవనోపాధి లభించడమో చూస్తున్న తల్లిదండ్రులు తమ పిల్లలు కూడా అలాంటి జీవన సుఖాన్నిపొందాలని ఆరాట పడుతున్నారు. ఈ బలహీనతలను సొమ్ము చేసుకోవడానికి కొన్ని ప్రైవేట్ కాలేజీలు వ్యవహరిస్తున్నతీరు ఆందోళన కలిగిస్తు న్నది. ఎన్ని వేలమంది తమ కాలేజీల్లో చదివితే ఎందరికి ర్యాంకు వస్తాయో చెప్పరు.కేవలం పదుల సంఖ్యలో వచ్చిన ర్యాంకుల గూర్చి పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. తమ కాలేజీల్లో చదివిన వారికే ర్యాంకులు, సీట్లు వస్తాయని భ్రమ లు కల్పిస్తున్నారు. ఈ పోటీలో పిల్లలపై పడుతున్న ఒత్తిడి అంతా ఇంతాకాదు. ఆటపాటల్లో మరో ధ్యాస,వ్యాపకం అవకాశం లేకుండా చదివే లక్ష్యంగా రాత్రింబవళ్లు వారిపై ఒత్తిడిపెంచి చదివిస్తున్నారు. వారుపడుతున్న మానసిక ఒత్తిడి అంతా ఇంతాకాదు. ఈమానసిక ఒత్తిడితో పాటు అశాంతిని భరించలేక,అటు తల్లిదండ్రులను ఒప్పించలేక, తమలో తాము నలిగినలిగి విపరీతమైన టెన్షన్‌కు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తలతాకట్టుపెట్టి అప్పోసప్పో చేసి లక్షలాది రూపాయలు తల్లిదండ్రులు తమ భవిష్యత్ కోసం ఫీజుల రూపంలో చెల్లించడం, వారు ఆశించిన మేరకు తాము చదవలేకపోవడం, చదివినా మనసు కెక్కకపోవడంతో మానసిక సంఘర్షణకు గురై అటు తల్లిదండ్రులకు వాస్తవ పరిస్థితులు చెప్పి ఒప్పించలేక ఈ బోధన చేసే అధ్యాపకులతో మనసువిప్పి తమ బాధలను వివరించలేక మానసిక ఒత్తిడిని తట్టుకోలేక తనువును చాలిస్తున్నారు. అయితే కొందరు అధ్యాపకులకు కొన్ని సందర్భాల్లో అర్థమై నా యాజమాన్యాల వ్యాపార కాంక్షకు వెరసి పెదవి విప్పలే కపోతున్నారు. ఇలా బట్టీపెట్టిన నాలుగు ముక్కలు రాసో, లేక మరో మార్గంలోనో ర్యాంకులు సంపాదించిన కొందరు విద్యార్థులు ఐఐటి లాంటి సంస్థల్లో చేరినా అక్కడ బోధనా పద్ధతుల్లో, విధానాల్లో ఇమడలేకపోతున్నారు. ఇలా ఈ చావులకు ఎన్నో కారణాలున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ఇంకెందరో విద్యాకుసుమాలు రాలిపోకతప్పదు. ఇప్పటికైనా పాలకులు ఆలోచించాలి. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఒత్తిడిలేని విద్యావిధానాల రూపకల్పన దిశగామేధావులు అధ్యయనం చేయాలి. విద్యార్థిలోకాన్ని బలవంతపు చావుల నుంచి బయటపడేసేందుకు ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికపై చర్యలు చేపట్టాల్సిన తరుణమిది.ఇందులో ఎలాంటినిర్లక్ష్యం చేసినా దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిన ఉజ్వల భవిష్యత్ ఉన్న విద్యార్థులను దేశంకోల్పోతుంది. అంతేకాదు తల్లితండ్రుల వైఖరిలో మార్పురావాలి. ఏ కోణంలో చూసినా చదువుల పేరుతో ఆ లేత మనసులను బలిపీఠం ఎక్కించడం ఏమాత్రం సమంజసం కాదు. •

## ఒక్క మాట

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలేవి?


తరిగోపుల నారాయణ స్వామి

ప్రతి సంవత్సరం భారతదేశంలో సుమారు 1.5 లక్షల మంది రోడ్ యాక్సిడెంట్ల వల్ల మరణిస్తున్నారని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక చెబుతోంది. అనేకమంది శారీరక వైకల్యాలతో బాధపడుతూ, జీవితాంతం బాధపడుతున్నారు. అజాగ్రత్త గమనాలు, రోడ్డుపరిస్థితులు వాహనదారుల నిర్లక్ష్యం, ఈ ప్రమాదాలకు దారితీస్తున్నాయి. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు వేగంగా వాహనం నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం, నిద్రలేని, అలసటతో వాహనం నడపడం, నిబంధనలకు విరుద్ధంగా ఓవర్ లోడింగ్ చేయడం, రహదారి మరమ్మతుల లోపం, అశుభ్రమైన రహదారులు కారణాలుగా చెప్పవచ్చు. భారత ప్రభుత్వం రోడ్డు భద్రత కోసం కొన్ని ముఖ్యమైన చట్టాలు, పథకాలను అమలు చేస్తోంది. మోటార్ వాహనాల సవరణ చట్టం - 2019 ప్రకారం జాగ్రత్తగా డ్రైవింగ్ చేయని వారిపై భారీ జరిమానాలు విధించడం ద్వారా భద్రతను పెంచేందుకు చట్టం సవరించబడింది. నేషనల్ రోడ్ సేఫ్టీ పాలసీ ,ఈ పాలసీ ప్రకారం విద్యార్థుల నుంచి డ్రైవర్ల వరకూ ప్రత్యేక శిక్షణలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. డ్రైవింగ్ లైసెన్స్ కఠిన నియమాలు, ప్రతి వాహనాన్ని సమయానికి పరీక్షించడం, డ్రైవింగ్ పరీక్షలను కఠినతరం చేయడం ద్వారా అర్హులకే లైసెన్స్ ఇవ్వడం జరుగుతోంది. రోడ్ ప్రమాదం జరిగినప్పుడు 108కు కాల్ చేసి అంబులెన్స్ రప్పించండి. ట్రాఫిక్‌ను నియంత్రించి ఇతర ప్రమాదాలను నివారించండి. ఫస్ట్ ఎయిడ్ ఇవ్వగలిగితే ఇవ్వండి. ఆసుపత్రికి వెళ్లే వరకు బాధితునికి ధైర్యం చెప్పండి,గుడ్ సమారిటన్ చట్టం ప్రమాదానికి గురైన వ్యక్తికి సహాయం చేసినవారిని ప్రభుత్వం గౌరవిస్తుంది, విచారణ చేయదు. ఇది సహాయపడేందుకు ప్రజలలో భయం లేకుండా చేస్తుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో ప్రమాద బాధితులకు ప్రాథమిక వైద్యం ఉచితంగా లభిస్తుంది. ముఖ్యంగా,రూ. 25,000 వరకూ నగదు లేని వైద్యం. ప్రభుత్వ ట్రామా ఆసుపత్రులు ఈ సేవ అందిస్తాయి. బాధితుడి ఆదాయ స్థాయి సంబంధం లేకుండా ఈ సేవ లభిస్తుంది. ఇది ట్రాఫిక్ పోలీస్ లేదా ఆసుపత్రి స్టాఫ్ సహాయంతో నమోదు చేయవచ్చు. చాలా రాష్ట్రాల్లో, ఈ సేవ కోసం ప్రత్యేకమైన అంబులెన్స్‌లు కూడా ఉన్నాయి. సమాజం బాధ్యత, ప్రతి పౌరుడు ట్రాఫిక్ నిబంధనలు గౌరవించాలి. ఇతరులకు అవగాహన కల్పించాలి. స్కూళ్లు, కాలేజీల్లో ప్రచార కార్యక్రమాలు చేపట్టాలి. ప్రమాద సమయంలో బాధితులకు సహాయం చేయాలి. సోషల్ మీడియాలో రోడ్‌సేఫ్టీపై సందేశాలు షేర్ చేయాలి. తుదిగా మన ప్రాణం మన బాధ్యత అని ప్రతి వాహనదారుడు గుర్తించాలి. మనం పాటించే ఒక్క ట్రాఫిక్ నియమం, ఒక్క హెల్మెట్, ఒక్క సీటుబెల్ట్ మన ప్రాణాన్ని కాపాడగలవు. అలాగే ఇతరుల ప్రాణాలను కూడా కాపాడగలవు. మన భద్రత మన చేతుల్లో ఉంది. ఒక్క బాధ్యతాయుత నిర్ణయం వేల జీవితాలను కాపాడగలదు. ఇలా ప్రతి వాహనదారుడు ,రోడ్డు నియమ నిబంధనలు పాటిస్తూ, తన ప్రాణాలను కాపాడుకుంటూ, ఇతరుల ప్రాణాలను రక్షించడంలో కూడా కాపాడడంలో కూడా బాధ్యత వహించాలి. అతివేగం అనర్థదాయకం. •

# మేధోసంపత్తితోనే భవిష్యత్ ఆర్థికాభివృద్ధి!

డాక్టర్. పిఎస్. చారి

మేధోసంపత్తి హక్కులు అనేది ఆవిష్కరణలు, సాహిత్యం, కళాత్మక రచనలు, వాణిజ్యంలో ఉపయోగించే చిహ్నాలు వంటి సృష్టిని రక్షించే చట్టపరమైన హక్కులు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆవిష్కరణ ఆధారిత వృద్ధివైపు మారుతున్నందున మేధోసంపత్తి హక్కులు గత కొన్ని దశాబ్దాలుగా గణనీయమైన దృష్టిని ఆకర్షించాయి. ఈహక్కులు ఆవిష్కర్తలు తమపనిని ఎలా ఉపయోగించాలో నియంత్రిం చడానికి ప్రయోజనం పొందడానికి సహాయం చేస్తాయి. ఈ హక్కుల ప్రధాన రకాల్లో పేటెంట్లు, కాపీరైట్లు, ట్రేడ్ మార్క్‌లు, వాణిజ్య రహస్యాలు, పారిశ్రామిక డిజైన్‌లు, భౌగోళిక సూచనలున్నాయి. ఈ హక్కుల సృష్టికర్తలకు ఒక నిర్దిష్టకాలానికి వారి సృష్టిపై ప్రత్యేక నియంత్రణను ఇస్తాయి. ప్రపంచమేధోసంపత్తి దినోత్సవాన్ని ఏటా ఏప్రిల్ 26న పేటెంట్లు, కాపీరైట్, ట్రేడ్‌మార్క్‌లు, డిజైన్‌లు రోజువారీ జీవితంపై ఎలాప్రభావం చూపుతాయో అవగాహన పెంచ డానికి జరుపుకుంటారు. 2000లో ప్రపంచ మేధో సంపత్తి సంస్థ ఏప్రిల్ 26ని ప్రపంచ మేధోసంపత్తి దినోత్సవంగా ఎంపిక చేసింది.ఈ 2025 సంవత్సర వేడుక మేధోసంపత్తి సంగీతంపై దృష్టిపెడుతుంది. సంగీత పరిశ్రమలో హక్కులు, ఆవిష్కరణ విధానాలు సృష్టికర్తలు, వ్యవస్థాపకులు సంగీత పరిశ్రమకు తాజా ఆలోచనలను తీసుకురావడానికి, పాటల రచయితలు, స్వరకర్తలు, ప్రదర్శకుల పనిని రక్షించడానికి ఎలా శక్తినిస్తాయో అన్వేషించడం లక్ష్యంగా ఉన్నాయి. మేధో సంపత్తి వ్యక్తులు, వ్యాపారాలు సమాజానికి చట్టపరమైనరక్షణ, పోటీప్రయోజనం, ఆదాయ అవకాశాలు, పెట్టు బడులను ఆకర్షించడం,ఆవిష్కరణ, సృజనాత్మకతను ప్రోత్స హించడం, ఆర్థికవృద్ధి, ప్రపంచగుర్తింపు, విస్తరణ, వ్యక్తిగత గుర్తింపు మొదలైన అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ముఖ్యంగా పేటెంట్గ్రాంట్లు, దరఖాస్తుల సంఖ్యను పరిగణన లోకి తీసుకున్నప్పుడు 2023లోచైనా అత్యధిక మేధోసం పత్తిని కలిగి అత్యధిక సంఖ్యలో పేటెంట్లను జారీచేసి, యునైటెడ్స్టేట్స్ నఅంతర్జాతీయ మేధోసంపత్తి సూచికలో, యునైటెడ్స్టేట్స్ 95.48శాతం స్కోరుతో సూచికలో ముం దుంది. తరువాత యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్ ఉన్నాయి. అభివృద్ధిచెందిన దేశాలు మేధోసంపత్తిహక్కులను పొందడం లో ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. వారి సంపత్తి హక్కుల ఆధిపత్యాన్ని కొనసాగించడానికి ప్రపంచ మేధోసంపత్తి హక్కులసంస్థ ప్రపంచ వాణిజ్యసంస్థ,వాణిజ్యమేధో సంపత్తి హక్కులు ఒప్పందం ద్వారా ప్రపంచ మేధోసంపత్తి నియ మాలపై విధాన ప్రభావంతోపాటు బలమైన పరిశోధన అభి వృద్ధి, పెట్టుబడి, అధునాతన విద్య, ఆవిష్కరణ వ్యవస్థలు, బలమైన, చట్టపరమైన మేధోసంపత్తి మౌలికసదుపాయాలు, జ్ఞాన ఆధారిత ఆర్థికవ్యవస్థ, వనరులు ప్రపంచ వ్యాపార




వ్యూహం ఉన్నాయి. భారతదేశం పనితీరును చూసినప్పుడు, భారతదేశం 38.64శాతం స్కోరుతో 42వ స్థానంలో స్థిరంగా ఉంది. ఇది స్థిరమైన మేధోసంపత్తి చట్రాన్ని సూచిస్తుంది. 64,480 దరఖాస్తులతో భారతదేశం పేటెంట్ దఖలులో ప్రపంచవ్యాప్తంగా 6వస్థానంలోఉంది. ట్రేడ్‌మార్క్‌లో భారతదేశం ప్రపంచ వ్యాప్తంగా 4వస్థానంలో ఉంది. గత సంవత్సరంతో పోలిస్తే 6.1శాతం పెరుగుదల. ఇది భారతదేశం బ్రాండ్‌పై పెరుగుతున్న ప్రాధాన్యతను సూచిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో, భారత పేటెంట్ కార్యాలయం 1 లక్షకుపైగా పేటెంట్లను మంజూరు చేసింది. ఇది మునుపటి సంవత్సరంకంటే గణనీయమైన పెరుగుదల. ఇప్పటికీ భారతదేశంలో మేధోసంపత్తి హక్కులు చారిత్రాత్మకంగా ఆర్థిక, చట్టపరమైన, విద్యా,సాంస్కృతిక కారణాలవల్ల అభివృద్ధి చెందినదేశాల కంటే వెనుకబడిఉన్నాయి. భారతదేశం తన స్థూలదేశీయోత్పత్తిలో సాపేక్షంగా తక్కువ శాతాన్నిపరిశోధన అభివృద్ధిలో 0.7శాతం పెట్టుబడి పెడుతుంది.ఇది అభివృద్ధిచెందిన దేశాలలో దాదాపు 2-3శాతం. భారతదేశంలో అగ్రశ్రేణిసంస్థలు ఉన్నప్పటికీ, ఆవిష్కరణ మేధోసంపత్తి హక్కుల అవగాహన కోసం మొత్తం పర్యావరణవ్యవస్థ అసమానంగా ఉంది. భారతదేశంలో మేధో సంపత్తి హక్కుల దాఖలు అమలు ప్రక్రియ సంక్లిష్టంగా, తక్కువ వనరులతో కూడుకున్నది. పేటెంట్ ఆమోదాల కోసం ఎక్కువసేపు వేచి ఉండటం బలహీనమైన అమలు మేధోసంపత్తి హక్కులదాఖలు చేయడానికి ప్రేరణను తగ్గిస్తుంది. మేధోసంపత్తిహక్కుల నమోదు ముఖ్యంగా పేటెంట్లు అంతర్జాతీయ దాఖలు ఖరీదైనది. విద్యార్థులు, నిపుణులలో కూడా మేధోసంపత్తి హక్కుల విలువ గురించి అవగాహన లేకపోవడం ఒక లోపమే. భారతదేశ ఆర్థికవ్యవస్థ హైటెక్ ఉత్పత్తి ఆవిష్కరణల కంటేసేవల ద్వారా ఎక్కువగా నడపబడుతోంది. భారతదేశం దానిమేధో సంపత్తి విధానాలపై అంతర్జాతీయంగా, ముఖ్యంగా అమెరికా వంటి దేశాల నుండి విమర్శలను ఎదుర్కొంది. దేశంలో మేధో సంపత్తి పర్యావరణ వ్యవస్థను పెంపొందించడానికి, భారత ప్రభుత్వం 2016లో అన్ని మేధోసంపత్తి హక్కులను ఒకే దార్శనిక పత్రంలోకి చేర్చి, మేధోసంపత్తి హక్కుల చట్టాల అమలు, పర్యవేక్షణ సమీక్షకోసం ఒక సంస్థాగత యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. స్టార్టప్‌లు తమ పేటెంట్, డిజైన్ ట్రేడ్‌మార్క్ అప్లికేషన్‌లను దాఖలు చేయడానికి, ప్రాసెస్ చేయడానికి 2016లోస్టార్టప్‌ల మేధోసంపత్తి రక్షణపథకం వంటి కొన్ని కీలక చర్యలు ప్రారంభించబడ్డాయి. నేషనల్ భారతదేశంలో ప్రభావవంతమైన మేధోసంపత్తి హక్కుల అమలును గుర్తించడానికి ప్రోత్సహించడానికి 13 విభాగాలలో జాతీయ మేధోసంపత్తి అవార్డులను ఏటా ప్రదానం చేస్తారు. పేటెంట్ సముపార్జనను సులభతరం చేయడానికి పేటెంట్స్ (సవరణ) నియమాలు, 2024ను నోటిఫైచేశారు. మేధోసంపత్తి హక్కుల పర్యావరణ వ్యవస్థను మెరుగుపరచడానికి, స్టార్టప్‌లు తమ ఐపీని రక్షించుకోవడానికి ప్రోత్సహించడానికి ఫీజు రాయితీలు ఇవ్వబడ్డాయి. స్టార్టప్‌లు చిన్నసంస్థలకు పేటెంట్లలో 80శాతం వరకు, ట్రేడ్‌మార్క్‌లలో 50శాతం డిజైన్లలో 75శాతంవరకు ఫీజురాయితీ ఇవ్వబడుతోంది. మేధోసంపత్తి దేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుంది కాబట్టి, దీర్ఘకాలిక వ్యూహంతో మరిన్ని మేధోసంపత్తి హక్కులని సాధించాలి. •

## దేవస్థానం సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి! : సిఐ

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానం భద్రత దృష్ట్యా శుక్రవారం అర్బన్‌సిఐ డి.గోపి సిబ్బందికి పలు సూచనలు చేసారు.దేవస్థానంలోని సెక్యూరిటి,ఎస్‌పిఎఫ్ సిబ్బందిని సమావేశ పరచి చర్చించారు. ఇటీవల పహల్‌గావ్‌లో జరిగిన సంఘటనలకు సంబంధించి ప్రస్తావిస్తూ శ్రీకాళహస్తీశ్వరాలయంలో భద్రత అంత భద్రంగా లేదని కాబట్టి ఇక్కడ పని చేసే సెక్యూరిటి కొంత సంయమనంతో పని చేయాలని సూచించారు. తనిఖీల విషయంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహారించాలని సూచించారు.ఏ మాత్రం సందేహం వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గతంలో కూడా ప్రత్యేక భద్రతా సిబ్బంది ఇక్కడ భద్రతకు సంబంధించి నివేదికలు ఇచ్చారన్నారు.ఈ మేరకు ఇక్కడ పని చేసే సిబ్బంది ఎంతో జాగురూకతతో వ్యవహారించాలన్నారు.ఈసందర్భంగా సిఎస్‌ఓకు స్పష్టమైన ఆదేశాలు జారి చేసారు.ఈ కార్యక్రమాల్లో ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, ఎస్‌పిఎఫ్ హెడ్ చంద్రమోహన్‌రెడ్డి, సిఎస్‌ఓ టి.రవి, సహాయ సిఎస్‌ఓ సుదర్శనం రెడ్డి హోంగార్డులు, సెక్యూరిటి సిబ్బంది పాల్గొన్నారు.

## హైకోర్టులో మద్యం కుంభకోణం కేసు

### నిందితుడు కెసిరెడ్డి రిమాండ్ రద్దు చేయాలంటూ తండ్రి పిటిషన్

**విజయవాడ,ఏప్రిల్25,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో మొదటి నిందితుడు రాజ్ కెసిరెడ్డికి(కెసిరెడ్డి రాజశేఖరరెడ్డి) విజయవాడ ఎసిబి కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ ఈ నెల 22న వెలువరించిన ఉత్తర్వులను సవాలు చేస్తూ,ఆయన తండ్రి ఉపేంద్రరెడ్డి గురువారం హైకోర్టులో పిటీషన్ వేశారు. రిమాండ్ ఉత్తర్వులను చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించి,వాటిని రద్దు చేయాలని కోరారు. తన కుమారిడిది అక్రమ నిర్బంధమని...విడుదల చేసేలా ఉత్తర్వులివ్వాలని హెబియస్ కార్పస్ పిటీషన్‌లో పేర్కొన్నారు. అరెస్ట్ గల కారణాలను తెలిపే సమయంలో కేవలం ఐపీసీ సెక్షన్లు పేర్కొన్నారని,రిమాండ్ రిపోర్టులో మాత్రం అవినీతి నిరోధక చట్టం సెక్షన్లు చేర్చారని తెలిపారు. బీఎన్‌ఎస్‌ఎస్‌లో పేర్కొన్న నిబంధనలను అరెస్ట్ సమయంలో పోలీసులు పాటించలేదని వెల్లడించారు. ఏసిబీ కోర్టు ఈ వివరాలను పరిగణలోకి తీసుకోకుండా యాంత్రికంగా రిమాండు విధించిందని ఆరోపించారు.

## జనసేన క్రియాశీలక సభ్యుడు ఉగ్రదాడిలో మరణించడం బాధాకరం

### - మంత్రి నాదెండ్ల మనోహార్

**విజయవాడ ఏప్రిల్ 25 ప్రభాతవార్త** ప్రతినిధి:దేశ సమగ్రత,భద్రత కోసం ప్రజలంతా సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర మంత్రి.జనసేన నేత నాదెండ్ల మనోహార్ అన్నారు.స్థానిక కార్లమార్క్స రోడ్డులోని పాత బస్టాండు వద్ద జనసేన సభ్యులు మానవహారం నిర్వహించారు. పహల్గాం మృతులకు సంతాపం తెలుపుతూ నిర్వహించిన మానవహారంలో మంత్రి నాదెండ్ల మనోహార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలతో మానవహారం నిర్వహించినట్లు తెలిపారు. జనసేన క్రియాశీలక సభ్యుడు మదుసూదన్ ఉగ్రదాడిలో మరణించడం బాధాకరమన్నారు. ఉగ్రవాదాన్ని అణిచివేసేందుకు అందరం కలిసి ముందుకెళ్ళాలని పిలుపునిచ్చారు. మనదేశం, మనరాష్ట్రం ఆ తరువాతే మనందరమన్నారు. సమాజం కోసం, దేశం కోసం మనందరం నిలబడాలని సూచించారు. ప్రజలలో చైతన్యం తీసుకురావడం కోసం ఈ కార్యక్రమం చేస్తున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహార్ తెలిపారు. తమ వారిని కోల్పోయిన వారికి అండగా నిలబడాలన్నారు. కాగా కశ్మీర్ పర్యటనకి వెళ్లిని వారిని తీవ్రవాదులు దాడి చేయడం దిగ్భ్రాంతికరం. డిప్యూటీ సీఎం పవన్ ప్రత్యేకంగా కావలి, విశాఖ వెళ్ళి బాధితులను పరామర్శించారు. తీవ్రవాద సంబంధాలు ఏమైనా ఉంటే అధికారులు పూర్తిస్థాయి విచారణ చేస్తారు అని ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను వ్యాఖ్యానించారు.

## హెల్త్ వర్శిటీ విసిగా బాధ్యతలు స్వీకరణ

### గవర్నర్ సమక్షంలో బాధ్యతలు తీసుకున్న డాక్టర్ చంద్రశేఖర్

**కర్నూలు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ ఛాన్సలర్ గా డాక్టర్ చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ సమక్షంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యరంగంలో తనకున్న మేధస్సు, అనుభవాన్ని పూర్తిగా యూనివర్సిటీ అభివృద్ధికి ఉపయోగిస్తా అన్నారు. వైద్య విద్యను మరింత అభివృద్ధి పరిచే దిశగా చర్యలు తీసుకొని... రాష్ట్ర ప్రభుత్వ ఖ్యాతిని మరింత విస్తరింప చేస్తానన్నారు. తనకు వీసీగా అవకాశం ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పని చేస్తానని డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు.

# 'నాసిన్' అకాడమీ ఇండియా - భూటాన్ మధ్య మైత్రికి దోహదపడుతోంది

### - నాసిన అకాడమీలో కేంద్ర సహాయ మంత్రికి ఐఆర్ఎస్ టీం గౌరవ వందనం



ప్రత్యేక వాహనంలో అకాడమీని సందర్శిస్తున్న దృశ్యం

**గోరంట్ల, ఏప్రిల్ 25 ప్రభాతవార్త** ప్రధానమంత్రి నరేంద్రమోడి నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్‌చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద వున్న నాసిన్ అకాడమీలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో కేంద్ర మంత్రి పాల్గొన్నారు. పాలసముద్రంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇన్డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ అకాడమిలో 75వ ఇండియన్ రెవిన్యూ సర్వీసెస్ (ఐఆర్ఎస్) పాసింగ్ ఔట్ పరేడ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్‌చౌదరి హాజరయ్యారు. రెండవసారి నాసిన్ అకాడమీకి వచ్చిన మంత్రి పరేడ్‌ను పరిశీలించి, ట్రైనీ ఐపీఎస్‌ల నుండి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం ట్రైనీ ఆఫీసర్లకు బంగారు పతకాలను అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి పంకజ్‌చౌదరి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడి నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, ప్రధానమంత్రి ముద్ర యోజన పథకాలు ప్రవేశపెట్టి పేద బలహీనవర్గాల యువతి యువకులకు ఉపాధి కల్పించడమే ముఖ్య ఉద్దేశంగా పనిచేస్తోందన్నారు. 2047 నాటికి వికసిత భారత్ ద్వారా భారతదేశ దశ దిశా నిర్దేశాన్ని మార్చడమే ముఖ్య ఉద్దేశమని పంకజ్‌చౌదరి తెలిపారు. ప్రపంచ స్థాయి వసతులు కలిగిన ఈ నాసిన్ అకాడమీలో రెండవ బ్యాచ్‌లో42 మంది అధికారులు వుండగా వీరిలో 25 మంది పురుషులు, 17 మంది మహిళా అధికారులు వున్నారు, వీరిలో రాయల్ గవర్నమెంట్ ఆఫ్ భూటాన్ చెందినవారు 5 మంది అధికారులు వున్నారు. రెండవ బ్యాచ్ అధికారుల పరేడ్‌కు హాజరు కావడం సంతోషంగా వుందన్నారు. మన మిత్ర దేశమైన భూటాన్ అధికారులు కూడ ఇక్కడ ట్రైనింగ్ కావడం ఇరు దేశాల మైత్రికి దోహదపడుతుందన్నారు. ప్రధానమంత్రి నరేద్రమోడి భారతదేశ అభివృద్ధి, యువత కోసం ఎన్నో ఆకర్షణీయ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. సేవాభావం, దేశభక్తితో విధులు నిర్వహించాలన్న ప్రధాని మోడి భావనను మనసులో వుంచుకుని తమ తమ విధుల్లో ప్రతిభ చాటాలన్నారు. పాలసముద్రంలోని ఈ అకాడమీ నిర్వహణలో ఛైర్మన్ సంజయ్‌కుమార్ అగర్వాల్, డైరెక్టర్ జనరల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం యొక్క పాత్ర కీలకమన్నారు. భవిష్యత్తులో మరింత మంది సమర్థత కలిగిన అధికారులు దేశ సేవ చేయడం కోసం ఈ అకాడమీ నుండే రావడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబిఐసి బోర్డు మెంబర్ అరుణ, నారాయణగుప్త, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లడమే కూటమి లక్ష్యం

### శాంతిభద్రతల విషయంలో రాజీలేదు: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, ఏప్రిల్ 25( ప్రభాతవార్త):** కూటమి ప్రభుత్వం సమష్టిగా పని చేస్తుందని, ప్రజా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ముందుకు వెళ్తుందని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.అన్ని రంగాల్లోనూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లడమే లక్ష్యంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మార్గదర్శకంలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో కలిసి ముందుకు సాగుతామన్నారు.పిఠాపురం నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు శుక్రవారం పవన్ పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పిఠాపురంలో 9 నెలల్లోనే రూ.100 కోట్లపైగా అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు.ఎన్నికల ప్రచార సమయంలో పిఠాపురం ప్రజల కోరిక మేరకు 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చామని,ఆ హామీని నెరవేర్చే నిమిత్తం తొమ్మిది నెలల్లోనే రూ.34 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు.అదే విధంగా నూతనంగా రెండు కొత్త బ్లాకులు, ఓపీ వార్డు, మార్చురీ వార్డు, డయాలసిస్, బ్లడ్ బ్యాంక్, ఆధునాతన మెషీన్లు అందుబాటులోకి తీసుకురానున్నామని,ఆసుపత్రిలో నూతనంగా డెర్మటాలజీ, ఈఎన్టీ, ఆప్తమాలజీ, రేడియాలజీ, పెథాలజీ విభాగాలు ఏర్పాటు చేసి అందుకు సంబంధించి 66 కొత్త పోస్టులు మంజూరు చేశామన్నారు.ఈ ఆసుపత్రి ద్వారా పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని 3 లక్షల మంది ప్రజలతోపాటు చుట్టు పక్కల ఆరు మండలాల ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం అందుతుందన్నారు.గతంలో గొల్లప్రోలు సభలో ఇచ్చిన హామీ మేరకు, నేడు ఉప్పాడ కొత్తపల్లి మండలంలో సామాన్య ప్రజలు తక్కువ ఖర్చుతో వివాహాలు జరుపుకొనేందుకు వీలుగా రూ.2 కోట్ల అంచనా వ్యయంతో టిటిడి కళ్యాణ మండప నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, నిర్మాణ పనులు వేగంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.ఈ కళ్యాణ మండపం ద్వారా చుట్టు పక్కల గ్రామాలలో సుమారు పది వేల కుటుంబాలకు అతి తక్కువ రుసుముతో వివాహాది శుభకార్యాలు చేసుకునే సౌకర్యం లభిస్తుందన్నారు.

# తహసిల్దార్ కార్యాలయంలో కోర్టు రిట్ పిటిషన్‌ల రికార్డు గల్లంతు

**వలేటివారిపాలెం (నెల్లూరు), ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** వలేటివారిపాలెం మండల తహసిల్దార్ కార్యాలయంలో జగనన్న కాలనీ లేఔట్స్‌కి సంబంధించిన కోర్టు రికార్డులు గల్లంతయ్యాయి.ఇందుకు సంబంధించిన సమాచారం కార్యాలయంలో అందుబాటులోలేదని పౌరసమాచార అధికారి నాయబ్ రసూల్ తెలియచేశారు.సంవత్సరాల తరబడి భద్రంగా రికార్డుల్లో ఉండాల్సిన సమాచారం సంబందిత అధికారే అందుబాటులో లేదని చెప్పడం కార్యాలయ పనితీరుకు నిదర్శనం. వలేటివారిపాలెం మండలంలో గత ప్రభుత్వ హయాంలో జగనన్న లేఔట్‌ల నిమిత్తం లక్షలాదిరూపాయలు ప్రభుత్వ ధనం దుర్వినియోగమైంది.17 గ్రామాల్లో కాలనీల కోసం రూ.3.31కోట్లు విలువైన ప్రభుత్వభూమిని,రూ.1.54కోట్లు విలువైన రైతులు భూమిని కొనుగోలు చేశారు.ఈ లే అవుట్‌ల ఏర్పాటులో అక్రమాలు జరిగాయని పలువురు హైకోర్టుకెళ్లారు.ఈ కారణంగా కొన్ని, అనువైన ప్రాంతాలలో లేఅవుట్‌లు వేయలేదని మరికొన్ని ఆగిపోయాయి. కేవలం అంకభూపాలపురం,కాకర్లపాలెంలో మాత్రమే అరకొరగా ఉన్నాయి.మిగిలిన గ్రామాల్లో వెచ్చించిన లక్షలాది రూపాయలు దుర్వినియోగం అయ్యాయి.పోలినేనిచెరువు,రామచంద్రాపురం,నవాబుపాలెం, పోలినేనిపాలెం, వలేటివారిపాలెం,చుండి,అయ్యవారిపల్లె,ఉప్పలపాడు,కొండసముద్రం, కూనిపాలెం,నూకవరం శింగమనేనిపల్లె, నలదలపూరు,శాఖవరం, కలవళ్ల గ్రామాల్లో సుమారు 66ఎకరాల్లో 37 లేఅవుట్‌లు చేశారు.కొండసముద్రం, కూనిపాలెం,పోకూరు,నూకవరం,శింగమనేనిపల్లె ,శాఖవరం గ్రామాల్లో రైతులు నుంచి ఎ12-58 సెంట్ల భూమిని రూ.1కోటి 54లక్షలు వెచ్చించి కొనుగోలు చేశారు.వైసీపీ రైతులుకు చెందిన నిరుపయోగమైన భూములకు అధిక ధరలు చెల్లించారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి.ఈ నేపద్యంలో అక్రమంగా లేఅవుట్‌లు వేశారని తహసిల్దార్, సబ్‌కలెక్టర్,కలెక్టర్‌లను ప్రతివాదులుగా చేరుస్తూ పలువురు కోర్టుకెళ్లారు.కోర్టులో వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఈ నేపద్యంలో ఇందుకు సంబందించిన కోర్టు రిట్‌పిటీషన్ నంబరుల సమాచారం,లబ్దిదారులకు ఒక్కొక్కరికి ఎన్ని సెంట్లు కేటాయించారన్న సమాచారంపై సమాచారం హక్కు చట్టం ద్వారా వివరణ కోరగా కార్యాలయంలో అందుబాటులో లేదని డిప్యూటీ తహసిల్దార్ రాతపూర్వకంగా తెలియచేశారు.దీంతో సదరు రికార్డులు ఏమైనాయోనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఉన్నతాధికారులు నిజానిజాలు విచారించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎమ్మెల్యేకి పిర్యాదు: రెవిన్యూ సిబ్బంది పనితీరు అధ్వానంగా ఉంది.ఈ మేరకు మంగళవారం అయ్యవారిపల్లెలో సచివాలయ ప్రారంభోత్సవ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు గ్రామస్తులు పిర్యాదు చేశారు.ఒక్క పని కూడా చేయడం లేదని ఆరోపించారు.దీంతో సంబందిత వీఆర్వోఅందుబాటులో లేకపోవడంతో తహసిల్దార్ అబ్దుల్ హామీద్‌ను ఫోన్‌లో వివరణ కోరారు.ఎమ్మెల్యే గ్రామంలోకి వస్తుంటే గ్రామ సిబ్బంది హాజరవాలన్న విచక్షణా జ్ఞానం సదరు అధికారులుకు కానీ, సిబ్బందికి గానీ లేకపోవడాన్ని ఎమ్మెల్యే ఆక్షేపించారు.ప్రజల కోసం పనిచేయని అధికారులు ఇక్కడెందుకు అని ప్రశ్నించారు.అధికారులుగానీ,సిబ్బందిగానీ చేయతగిన పనిని సకాలంలో చేయకపోతే వెంటనే తనకు ఫోన్ చేయాలని గ్రామస్తులకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు.

# చంద్రబాబు ఇచ్చిన మాట తప్పితే, తీవ్రంగా ప్రతిఘటిస్తాం - మాజీ సిఎం జగన్

**విజయవాడ,ఏప్రిల్25,ప్రభాతవార్తప్రతినిధి** రూపాయికి ఇడ్లీ వస్తుందో లేదో కాని,ఊరూ పేరు లేని 'ఉర్సా'లాంటి కంపెనీలకు రూ.3వేల కోట్ల భూమిని ఎకరా రూ.99 పైసల చొప్పున చంద్రబాబు పాలనతో ఇచ్చేస్తున్నారని మాజీ ముఖ్యమంత్రి,వైకాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి ఆరోపించారు. లులు,లిల్లీ గ్రూప్‌లంటూ వాటికి రూ.1500-2000 కోట్ల విలువైన భూములను ఇచ్చి,తర్వాత నీకింత,నాకింత అని రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు అని అభియోగించారు. అమెరికాలోనూ 'ఉర్సా' కంపెనీ చిరునామాకు తమ వాళ్ళు వెళ్ళి విచారించారని అక్కడా ఏమీ లేదని చెప్పారు. ఐదారేళ్ళ కింద అమరావతి పనులకు పిలిచిన టెంటర్లు రూ.36000 కోట్లు,అప్టి కంటే ఇప్పుడే సిమెంట్,స్టీల్ రేట్లు తక్కువ అయినా రూ.36000 కోట్లను రూ.78000 కోట్లకు పెంచేసి టెండర్లను వాళ్ళకు సంబంధించిన వారికే ఇచ్చుకున్నారు. మొబిలైజేషన్ అడ్వాన్స్ అని 10 శాతం ముందే వారికిచ్చేసి వారి నుండి 8 శాతం చంద్రబాబు తీసుకుంటున్నారు అని ఆరోపించారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో రాయలసీమలో ఇటీవల ఉప ఎన్నికలు జరిగిన కొన్ని మున్సిపాలిటీలు,మండలాలకు సంబంధించి వైకాపా ప్రజాప్రతినిథులతో సమావేశంలో ఆయన మాట్లాడారు.ముందుగా,కాశ్మీర్ లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన వారికి జగన్ నేతలు నివాళులర్పించారు.రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అప్పుల సొమ్మంతా ఏమవుతోంది?జగన్ ఉన్నపుడు బటన్ నొక్కి ప్రజలకు నేరుగా ఇచ్చేవాడు. కాని ఇప్పుడు అప్పుల సొమ్ము,రాష్ట్ర ఆదాయం చంద్రబాబు చేతుల్లోకి వెళ్తునందువ్లే హామీలను అమలు చేయడం లేదు. సూపర్-6 గాలికొదిలేశారు.కరెంట్ బిల్లులు షాక్ కొట్టేలా పెరిగిపోయాయి. అవినీతి విచ్చలవిడి అయింది. ఎంఎల్ఏలు,ముఖ్యమంత్రి నీకింత,నాకింత అని దోచుకునే పరిస్థితి. వీటన్నింటిపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతకు సమాధానం చెప్పలేకనే రోజుకో డైవర్షన్ అంశాన్ని తెరపైకి తెస్తున్నారు. తిరుమల లడ్డూల్లో కల్తీ అని ఇంకోటని, ఐపీఎస్ అధికారి అరెస్ట్,మద్యం కుంభకోణం అంటూ రోజుకొక డైవర్షన్ డ్రామా చేస్తున్నారని విమర్శించారు.రాష్ట్రంలో ప్రజలు ఇవాళ యుద్ధ వాతావరణంలో బతుతున్న పరిస్థితి.ఇలాంటి దుర్మార్గపు రెడ్‌బుక్ పాలన గతంలో ఎప్పుడూ చూసి ఉండం.బలం లేకపోయినా స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో ప్రలోభపెట్టి,అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ కుట్రలు చేశారు.

# తిరుమల సమాచారం

## మెరుగైన శిక్షణతో ఉత్తమ సేవకులుగా తీర్చిదిద్దుతాం : ఇఒ శ్యామలరావు

**తిరుమల,ఏప్రిల్ 25ప్రభాతవార్తప్రతినిధి:** ప్రణాళికా బద్ధంగా శ్రీవారిసేవకులకు మెరుగైన శిక్షణ ఇచ్చి,అత్యుత్తమ సేవకులుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ సిద్ధంచేశామని టిటిడి ఇఒ జె.శ్యామలరావు తెలిపారు. ప్రవాసాంధ్రులు కూడా శ్రీవారిసేవ చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని టిటిడి సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవిని ఆదేశించారు. శ్రీవారి సేవపై మెరుగైన శిక్షణను పుట్టపర్తి, ఈశా ఫౌండేషన్, ఆర్ట్ఆఫ్‌లివింగ్ తదితర సంస్థల నుండి అభిప్రాయాలను సేకరించారన్నారు. ఆయా నిపుణుల అభిప్రాయాలను క్రోడీకరించాలని సూచించారు. శుక్రవారం సాయంత్రం తిరుపతి టిటిడి పరిపాలన భవనంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మం, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, డీన్ అల్లాడి రాజ్‌మోహన్, రవాణా జిఎం శేషారెడ్డి, డిప్యూటీ ఇఒ రాజేంద్రకుమార్, డివైసిఎఫ్ శ్రీనివాసులు,క్యాటరింగ్ అధికారి శాస్త్రితో కలసి శ్రీవారిసేవకులకు మెరుగైన శిక్షణ పై సమీక్షించారు. తిరుమలకు దేవుని దర్శనార్థం వచ్చే భక్తులకు శ్రీవారి సేవకులు మరింత మెరుగైన సేవలందించేలా శిక్షణ నివ్వాలన్నారు. ముఖ్యంగా దక్షిణభారతదేశం నుండి శ్రీవారిసేవ చేయడానికి సేవకులు అధికంగా తిరుమలకు వస్తున్నారన్నారు. ప్రణాళికాబద్ధంగా వీరికి శిక్షణనిచ్చి ఉత్తమసేవకులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాస్థాయిలోనూ ,ప్రాంతీయ స్థాయిలోనూ ,తిరుమలలో శిక్షణనిచ్చేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు.

## టిటిడి ఆధీనంలోకి శారదాపీఠం మఠం భవనం !



**తిరుమల,ఏప్రిల్ 25ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల గోగర్భమ్‌డ్యామ్ సమీపంలోని విశాఖ శారదాపీఠం మఠంకు చెందిన అక్రమనిర్మాణ భవనాన్ని టిటిడి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపడుతోంది. ఇప్పటికే ఈ అక్రమనిర్మాణ భవనంపై హైకోర్టు వెలువరించిన తీర్పు ఆధారంగా టిటిడి నోటీసులు జారీచేసి భవనాన్ని స్వాధీనం చేసుకోనుంది. మఠాలపేరుతో తిరుమలలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని, గత వైసిపి ప్రభుత్వంలో, గత ట్రస్ట్‌బోర్డు పెద్దలు నిబంధనలకు విరుద్ధంగా పర్యావరణం దెబ్బతినేలా శారదాపీఠంకు స్థలం ఇవ్వడం, నిర్మించిన ఆరు అంతస్థులను తొలగించాలని పలువురు హిందూసంఘం స్వామీజీలు డిమాండ్ చేశారు. విశాఖశారదాపీఠంకు చెందిన మఠం నిర్మాణంలో 4అంతస్థులకు అనుమతినిస్తే ఆరు అంతస్థులు నిర్మించారని ,5 చదరపు గజాలకు అనుమతినిస్తే 10వేల గజాల్లో అక్రమ కట్టడాలను నిర్మించారని స్వామీజిలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో తిరుమలలోని విశాఖ శారదాపీఠం మఠం ఖాళీ చేయాలంటూ టిటిడి అధికారులు నోటీసులు కూడా ఇచ్చారు. ప్రస్తుత టిటిడి ధర్మకర్తలమండలి తిరుమలలోఅక్రమనిర్మాణాలపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అక్రమనిర్మాణాలపై దృష్టి సారించారు.

## ఈ ఏడాది తిరుమలేశునికి సాలకట్ల బ్రహ్మోత్సవాలే !

**తిరుమల,ఏప్రిల్ 25ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి రానున్న సెప్టెంబర్‌నెలలో సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించేలా తిరుమల తిరుపతి దేవస్థానం ముహూర్తం ఖరారుచేసింది. సాధారణంగా అధికమాసం వచ్చినపుడు మాత్రమే ఏడుకొండలపై రెండు సార్లు దేవదేవునికి అంగరంగవైభవంగా సాలకట్ల,నవరాత్రి బ్రహ్మోత్సవాల పేరుతో తొమ్మిదిరోజులు కలియుగవైకుంఠంగానే జరిపిస్తారు. ఈ ఏడాది ఒక బ్రహ్మోత్సవం తొమ్మిదిరోజులు నిర్వహించేందుకు టిటిడి ప్రణాళికలు రూపొందించింది. ఈ ఏడాది సెప్టెంబర్ 24వతేదీ నుండి అక్టోబర్ 2వతేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

ఆ తొమ్మిదిరోజులు ఉదయం, రాత్రి వాహనసేవలతో తిరుమల మాఢవీధులు భక్తజనంతో నిండిపోతాయి. ఈ ఏడాది ఒక్కటే బ్రహ్మాండనాయకుడి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. తొమ్మిదిరోజులు ఉదయం పూట వాహనసేవలు 8గంటలకే మొదలవుతాయి. రాత్రి వేళ వాహనసేవలు 7గంటలకు ఆరంభవుతాయి. సెప్టెంబర్ 23వతేదీ మంగళవారం సాయంత్రం అంకురార్పణం జరగనుంది. 24న సాయంత్రం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవ ఘట్టానికి శ్రీకారంపడుతుంది. తొలివాహనసేవగా 24వతేదీ బుధవారం రాత్రి పెద్దశేషవాహన సేవతో వాహనసేవలు మొదలవుతాయి. తొమ్మిదిరోజుల బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యత ఉన్న వాహనసేవల్లో సెప్టెంబర్ 24వతేదీ సాయంత్రంధ్వజారోహణం,ఆ రాత్రికి పెద్దశేషవాహనం, ఐదవరోజు సెప్టెంబర్ 28వతేదీ ఆదివారం రాత్రికి గరుడవాహనసేవ, 29న సాయంత్రం స్వర్ణరథం, అక్టోబర్ 1వతేదీ ఉదయం రథోత్సవం, అక్టోబర్ 2వతేదీ ఉదయం చక్రస్నానం, రాత్రికి ధ్వజావరోహణం ఘట్టాలు ప్రధానమైనవి. బ్రహ్మోత్సవాలకు ఆరంభ సూచికంగా విశేష ఘట్టంగా ధ్వజారోహణం ప్రత్యేకత సంతరించుకుంటుంది. వైఖానస ఆగమోక్తంగా జరిగే ఈ బ్రహ్మోత్సవాలకు బంగారుధ్వజంపై ఆకాశానికెగసిన గరుడుడు బ్రహ్మోత్సవాలకు రావాలంటూ సకలసపరివార దేవతలను, భక్తులను ఆహ్వానిస్తారు.

## ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్‌కు భారీ విరాళం

### - రూ.కోటి చెక్కు అందజేసిన వెటిరో టైల్స్



**తిరుమల,ఏప్రిల్ 25ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న భక్తులకు ఆకలి తెలియకుండా నిరంతరాయంగా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్‌కు భారీ విరాళాలందాయి. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌కు చెందిన అపర్స్ ఎంటర్‌ప్రైజెస్ (వెటిరోటైల్స్ ప్రతినిధులు అన్నప్రసాదం కోసం కోటి రూపాయలు చెక్కును విరాళంగా అందజేశారు. ఉదయం సంస్థ ప్రతినిధులు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడును క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అందజేశారు. తమవంతు సహకారం అందించడం ఆనందంగా ఉందని దాతలు తెలిపారు. దాత కుటుంబసభ్యులకు శ్రీవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఛైర్మన్ నాయుడు ఆకాంక్షించారు.

## ఆర్టీసి బస్సుల్లో వినిపించని గోవింద నామం!

**తిరుమల,ఏప్రిల్ 25ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం...ప్రసిద్ధ హిందూ పుణ్యక్షేత్రమైన తిరుమలకు నడిచే ఆర్టీసి బస్సుల్లో గోవిందనామం వినిపించడంలేదు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరుజిల్లా తిరుమల-తిరుపతి మధ్య ఆధ్యాత్మికభావం ఉట్టిపడేలా టిటిడి ఉన్నతాశయంతో పలురకాల ప్రణాళికలు అమలుచేస్తున్నా ఇవేమీ ఆర్టీసి అధికారులకు పట్టడం లేదు. తిరుమల నుండి తిరుపతికి,తిరుపతి నుండి తిరుమలకు నడిచే ఆర్టీసి బస్సుల్లో ,విద్యుత్‌తో నడిచే ఆర్టీసి బస్సుల్లోనూ కనీసం భక్తిపారవశ్యం "గోవింద"నామం వినిపించడంలేదు. ఎంతో భక్తిభావంతో ..ప్రశాంత మనస్సుతో తిరుమలకు వచ్చే భక్తులకు తిరుపతి ఆర్టీసి బస్టాండు,రైల్వే స్టేషన్,విష్ణునివాసం తదితర ప్రాంతాల నుండి ఆర్టీసిబస్సులు గమ్యస్థానం చేరుస్తాయి. భక్తులు వెళ్ళే బస్సుల్లో గోవింద నామం వినిపించడంలేదు. ఘాట్‌లో ప్రయాణం ఎంతో ప్రమాదభరితం.అడుగడుగునా ఆపదమొక్కులవాడు రక్షగా వుండాలని....తమతో రావాలని భక్తులు ప్రార్థిస్తుంటారు. ప్రయాణం సురక్షితంగా సాగి... నీ దర్శనం చేసుకోవాలని భక్తులు కోరుతుంటారు. ఇప్పటికీ కొంతమంది ఉత్తరాంధ్ర భక్తులు, మహారాష్ట్ర,తమిళనాడు భక్తులు బస్సుల్లో గోవింద నామాలు చేస్తుంటారు.అయితే పూర్తిస్థాయిలో ఇవి ఆచరణకు నోచుకోవడంలేదు. తిరుమల తిరుపతి మధ్య రోజూ 480వరకు బస్సులు నడుస్తున్నాయి. 2వేలవరకు ట్రిప్పులు తిరుగుతున్నాయి. ప్రతిరోజూ 60వేలమంది భక్తులను చేరవేస్తున్నాయి. ఈ బస్సుల్లో గోవిందనామం వినిపింపజేయాలని పలువురు భక్తులు కోరుతున్నా అటు టిటిడి అధికారులు ఇటు ఆర్టీసి అధికారులు పట్టించుకోవడంలేదు.



నిత్యాన్నదాన ప్రసాదానికి విరాళమిచ్చిన దాతలకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

## దుర్గమ్మవారి ఆలయ స్వర్ణగోపురం పనులకు రు.5లక్షల విరాళం

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 25, ప్రభాతవార్త** స్వర్ణగోపురం పనులకు రు.5లక్షల విరాళాన్ని హైదరాబాద్‌కు చెందిన టి శ్రీనివాస్ సంపత్ తమ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దేవాలయ అధికారులకు అందించారు. దాతలకు మరియు వారి కుటుంబసభ్యులకు దుర్గమ్మ దర్శనం ఏర్పాటు చేసిన అధికారులు తదుపరి వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలను అందించారు. వేదపండితులు ఆశీర్వచనాలందించారు. దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన ఎం శశితేజ రు.1లక్ష 1వేయి 116ల విరాళం శుక్రవారం ఆలయాధికారులకు అందించారు. దాతకు వారి కుటుంబ సభ్యులకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అధికారులు తదుపరి వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలను అందించారు. వేదపండితులు ఆశీర్వచనాలందించారు. - భక్తిరసభరితంగా కూచిపూడి నృత్యప్రదర్శన: దుర్గమ్మవారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా విజయవాడకు చెందిన శ్రీ కనకదుర్గా నృత్య కళా మందిర్ ఆచార్యులు వై అనురాధ ఆధ్వర్యంలో 22 మంది శిష్యబృందం ఆద్యంతం భక్తిరసాన్ని ప్రదర్శిస్తూ కూచిపూడి నృత్యాన్ని అభినయించారు. వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటో, ఆశీర్వచనాలందించారు.

## పొగాకు వేలం కేంద్రాలను పరిశీలించిన ఇడి

**- బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ బి.విశ్వశ్రీ**

**కందుకూరు (నెల్లూరు), ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** పొగాకు బోర్డు ఎల్లప్పుడూ రైతుల శ్రేయస్సు కోసమే పనిచేస్తుందని బోర్డు ఎగ్జిక్యూటీవ్ డైరక్టర్ విశ్వశ్రీ అన్నారు. శుక్రవారం ఆమె కందుకూరు పట్టణంలోని 12 వేల కేంద్రాలను పొగాకు బోర్డు సెక్రటరీ దివి వేణుగోపాల్, తేలిక నేలల ప్రాంతీయ అధికారి శ్రీ లక్ష్మణరావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె వేలం జరిగే విధానాన్ని పరిశీలించి బయ్యర్లు రైతులకు మంచి ధరలు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా రైతులను ఉద్దేశిస్తూ వారు ప్రస్తుత మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని, దానికి అనుగుణంగా పొగాకును మాత్రమే తీసుకురావాలని కోరారు. వారు అంతర్జాతీయ స్థాయిలో ఉన్న పొగాకు ఉత్పత్తిని వివరించారు. పొగాకు బోర్డు ఎప్పుడూ రైతుల మంచి కోసమే పని చేస్తుందని తెలిపారు. వేలం కేంద్రాలకు వచ్చే ముందు ఒక సారి తమ పొగాకు బేళ్లను సరి చూసుకోవాలని తేమ, వేడి, షాప్ట్ లేకుండా చూడాలని అన్నారు. రైతు సోదరులు ఖచ్చితంగా గ్రేడింగ్ చేయాలని కోరారు. గ్రేడింగ్ సరిగా చేయకపోతే మార్కెట్ జరపడం కష్టం అని చెప్పారు. ఆ తరువాత కంపెనీ ప్రతినిధులతో మీటింగ్ నిర్వహించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని నోబిడ్‌లు తగ్గేలా చూడాలని సూచించారు. తదనంతరం పొగాకు బోర్డు సిబ్బందితో సమావేశం నిర్వహించి వేలం సజావుగా సాగడానికి తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు, రైతులు, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

## పి 4 విధానంతో అభివృద్ధి వేగవంతం సమీక్షలో ముఖ్యమంత్రి వెల్లడి

**విజయవాడ,ఏప్రిల్25,ప్రభాతవార్తప్రతినిధి:**రాష్ట్రంలో అభివృద్ధి ప్రాజెక్టులను పీపీపీ(పబ్లిక్,ప్రైవేట్, పార్ట్‌నర్‌షిప్) విధానంలో చేపట్టేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలు సాధించాలన్నా, పెట్టుబడులు భారీగా రావాలన్నా పీపీపీ విధానమే మార్గమని చెప్పారు. సంస్కరణల్లో భాగంగా తగంలో పీపీపీ విధానాన్ని ప్రవేశపెట్టి మంచి ఫలితాలు రాబట్టామని సిఎం గుర్తు చేశారు. గురువారం సచివాలయంలో పీపీపీ విధానాన్ని విస్తృతం చేసే అంశంపై అధికారులతో ఆయన సమీక్షించారు. జాతీయ రహదారులను అనుసంధానించేలా రహదారుల నిర్మాణం చేపట్టడంలో పాటు పోర్టులు, వైద్యరంగం, పర్యాటకం, మౌలిక సదుపాయాల కల్పనలో పీపీపీ విధానానికి ప్రాధాన్యతనివ్వాలి. ప్రభుత్వం చేస్తున్న మొత్తం వ్యయంలో మూలధన వ్యయం వాటా మరింత పెంచేందుకు అది దోహదపడుతుంది. ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా రాష్ట్రాలు పీపీపీ ప్రాజెక్టులను రూపొందించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. భూ కేటాయింపులు, అనుమతుల్లో ఆలస్యం, వివాదాలు పరిష్కరించక పోవడం వంటి ఇబ్బందులను అధిగమించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. +రాష్ట్రంలో 1422 కిలోమీటర్ల మేర 20 రహదారులను పీపీపీ పద్ధతిలో చేపట్టేందుకు డీపీఆర్‌లు సిద్ధమయ్యాయి. సాధ్యాసాధ్యాలను బట్టి వీటిని 8,893 కిలోమీటరుల పెంచడంపై దృష్టి పెట్టాలన్నారు. నూతన ప్రాజెక్టుల నిర్మాణం, ఆవిష్కరణల కోసం ఎన్ఏబిఎఫ్‌డీ, ఎన్ఐఐఎఫ్ క్రిందా వివిధ సంస్థల సహాయం కోరడం. ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఖనిజ వనరులను నిర్వహిస్తే అదనంగా రూ.9వేల కోట్ల ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. పరిశ్రమలకవసరమయ్యే మౌలిక వసతుల కల్పనకు ఏపీఐఐసీ మద్దతుతో రూ.5వేల కోట్ల రుణాల సేకరణ లక్ష్యంగా ఉండాలన్నారు. సుస్థిర ఆదాయాన్ని పెంచుకునేందుకు రాజధానిని అభివృద్ధి చేయడం. తీరప్రాంతాన్ని సద్వినియోగం చేసుకునేలా పర్యాటకం, లాజిస్టిక్స్ రంగాలను ప్రోత్సహించడంపై దృష్టి పెట్టాలన్నారు.

## ఉగ్రదాడిలో బలైన మధుసూధన్ కుటుంబానికి అండగా ఉంటాం

### ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు జి.సతీష్‌రెడ్డి

**కావలి (నెల్లూరు), ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** ఉగ్రదాడిలో బలైన మధుసూధన్ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని, ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు జి.సతీష్‌రెడ్డి తెలిపారు. ఉగ్రవాదుల దాడిలో బలైన సోమిశెట్టి మధుసూధన్ కుటుంబాన్ని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డితో కలిసి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశం నిర్వహించి సతీష్‌రెడ్డి మాట్లాడారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఎప్పటికప్పుడు మధుసూధన్ కుటుంబ యోగక్షేమాలు తెలుసుకుంటూ ఉన్నారని తెలిపారు. తానుకూడా దాడి సంఘటన, వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని ధైర్యం చెప్పడం జరిగిందన్నారు. గత కొద్దిరోజులుగా అందరూ కూడా ప్రభుత్వం నుంచి వస్తూ ఉన్నారన్నారు. మంత్రులు వచ్చి పరామర్శించి వెళ్లడం కూడా జరిగిందన్నారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి ఇక్కడే ఉండి అన్ని విషయాలు చూసుకుంటున్నారన్నారు. వైద్యులను నిరంతరం వారికి అందుబాటులో ఉంచుతూ వారి ఆరోగ్యంపై శ్రద్ధపెట్టడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లోకూడా మధుసూధన్ కుటుంబానికి ఏ రకమైనటువంటి సహాయం కావాలి, ప్రభుత్వంతో మాట్లాడి ఎలాంటివి చేయవచ్చో వాటిని కూడా చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నుండి అందవలసిన అన్ని సహాయసహకారాలు అందేలా చూస్తామన్నారు. అనంతరం కావలి ఎమ్మెల్యే దగుమాటి మాట్లాడారు. మధుసూధన్‌రావు మరణం కావలి పట్టణానికి శోకాన్ని మిగిల్చిందన్నారు. ఆ కుటుంబాన్ని ఏ విధంగా ఆదుకోవాలో ఆ విధంగా తప్పకుండా ఆదుకోవడం జరుగుతుందన్నారు. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గురించి బయటకు తీసుకువచ్చే విధంగా ప్రయత్నం చేస్తున్నారన్నారు. మధుసూధన్ కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్‌బాబు, బిజెపి జిల్లా టెలికాం సభ్యుడు కుట్టుబోయిన బ్రహ్మానందం, బిజెపి



కావలి నియోజకవర్గ కన్వీనర్ సివిసి సత్యం, జనసేన జిల్లానేత సమ్మన వెంకట సుబ్బయ్య, జియస్‌టి సభ్యుడు, బిజెపినేత అమరా వెంకటసుబ్బారావు, కావలి మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, మాజీ ఎఎంసి డైరక్టర్ తిరివీధి ప్రసాద్, టిడిపినేత నేరెళ్ల శేఖర్, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా ప్రసాద్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉగ్రదాడులను నియంత్రించడంలో మోడీ ప్రభుత్వం విఫలం - పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

**విజయవాడ,ఏప్రిల్25,ప్రభాతవార్తప్రతినిధి:**భారత రాజ్యాంగ సంరక్షణ కోసం తమ పార్టీ నేతలు ఉద్యమిస్తున్నామని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. బీజేపీ మత రాజకీయాల కోసం ఉగ్రదాడి ఘటనను వాడుకుంటుందన్నారు. ఇది చాలా బాధాకరమని చెప్పారు. అక్కడ ముస్లింలను కూడా చంపేశారన్నారు. అది హిందువులపైన దాడిగా ఎలా చెబుతారని ప్రశ్నించారు. ఆ ప్రాంతం చాలా సురక్షితంగా ఉందని.. మోదీ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రచారం చేసుకున్నారని గుర్తుచేశారు. వారి మాటలు నమ్మి వెళ్లినందుకు అమాయకులు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. మరి ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిరక్షణకు



తమ పార్టీ ఉద్యమిస్తుందన్నారు. ఈ నెల 9వ తేదీన అహ్మదాబాద్‌లో కాంగ్రెస్ న్యాయపథ్‌పై నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఏపీలో ఈ న్యాయపథ్ ద్వారా వాస్తవాలను ప్రజలకు వివరిస్తామని అన్నారు. బీజేపీ సొంత రాజ్యాంగం అమలు చేస్తూ ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. ఏపీసీసీ ఎగ్జిక్యూటివ్ సమావేశం శుక్రవారంవిజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో షర్మిల, కాంగ్రెస్ జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా షర్మిల మీడియాతో మాట్లాడుతూ... అన్నివర్గాల వారికి సమాన న్యాయం చేయాలనేది కాంగ్రెస్ సిద్ధాంతని ఉద్ఘాటించారు. 50 శాతం రిజర్వేషన్ ఎత్తి వేసి.. అవసరమైన మేరకు అమలు చేయాలని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమంగా తాము ప్రజల్లోకి వెళ్తామని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమంగా తాము ప్రజల్లోకి వెళ్తామని అన్నారు. ఉగ్రవాదుల దాడులను నియంత్రణ చేయడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపణలు చేశారు. పర్యాటకులు చనిపోతుంటే.. అక్కడ ఉన్న భద్రత దళాలు ఏమయ్యాయని ప్రశ్నించారు.

## పహల్గాం హంతకులను గుర్తించి కాల్చివేయాలి : మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్

**విజయవాడ,ఏప్రిల్ 25,ప్రభాతవార్తప్రతినిధి:**కశ్మీర్ లోని పహల్గాం లో దారుణ మారణకాండ సృష్టించిన ఉగ్రదాడిపై రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తీవ్రంగా స్పందించారు. పహల్గాం లో అమాయకుల ప్రాణాల ను బలిగొన్న ఉగ్రవాదులను గుర్తించి కాల్చి పారేయాలని అన్నారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో మీడియాతో మంత్రి మాట్లాడారు. దేశంలో పుట్టిన ప్రతి భారతీయుడు పహల్గాం లో జరిగిన దుశ్చర్యను ఖండించాలని, దారుణాతి దారుణంగా అరాచకం సృష్టించిన ఉగ్రవాదులకు నిలయమైన పాకిస్తాన్ పై చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో చల్లని ప్రాంతమైన కశ్మీర్లో సంతోషంగా, సుఖంగా, కుటుంబ సభ్యులతో ఆహ్లాదంగా గడిపేందుకు వెళ్లిన వారిని టార్గెట్ చేసి చంపడం దుర్మార్గమని అన్నారు. ఎన్నో ఆశలతో వివాహ బంధంలోకి , కొత్తగా పెళ్లి చేసుకున్న వారి ని కూడా చంపడం నీచాతి నీచమని అన్నారు. మతం పేరు చెప్పి, కులం పేరు చెప్పి చంపడం భారతదేశంలో ఎప్పుడూ అలాంటి సంస్కృతి లేదని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. నేరస్తులకు మతం ఉండదని, ఏ మతానికి చెందిన వారైనా, ఏ సొసైటీ కి చెందిన వారైనా ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడితే తీవ్రంగా స్పందించి ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవాల్సిందేనని మంత్రి ఫరూక్ స్పష్టం చేశారు.

## రాష్ట్ర డిజిపీతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి కీలక భేటీ

**విజయవాడ, ఏప్రిల్ 25,ప్రభాతవార్తప్రతినిధి:** గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగం విరివిరిగా తగ్గించేందుకు సరైన పర్యవేక్షణ, నిఘాతో వ్యూహాత్మక కార్యచరణతో వ్యవహరించాలని రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కోరారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ ) అధికారిక కార్యాలయంలో డీజీపీ హరీశ్ గుప్తాతో రాష్ట్ర



రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు సమావేశమైయ్యారు. మాదక ద్రవ్యాలు, గంజాయి ప్రభావంతో యువత నిర్వీర్యమవుతున్న విషయంపై చర్చించారు. మద్యం మత్తులో యువత అనేక అరాచకాలకు పాల్పడుతున్నారన్నారు. యువతను ఈ దుష్ప్రభావం నుంచి తప్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన "ఈగిల్" సంస్ద వేగంగా పనిచేయాలన్నారు. పలు అంశాలపైన డీజీపీతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చర్చించారు. సామాన్యుల జీవితాలు, కుటుంబాలు నాశనం కాకుండా యువతతో పాటు ముక్కుపచ్చలారని విద్యార్థులు, చిన్నారులను ఈ డ్రగ్స్ మహమ్మారి బారిన పడకుండా ఉజ్వల భవిష్యత్తును ఏర్పాటు చేసుకునే విధంగా పోలీస్ ఉన్నతాధికారులు కార్యాచరణ చేపట్టాలని, ప్రత్యేకంగా అన్నమయ్య జిల్లాలో ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు, అనంతరం ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఈగిల్) (ఐజి) రవికృష్ణ గారిని కలిసి రాయచోటి నియోజక వర్గంలో ఈగిల్ దళం కార్యాచరణ ప్రణాళిక అంశాలపై మంత్రి రాంప్రసాద్ రెడ్డి చర్చించారు.

## ఐపిఎస్ అధికారి పి.జాషువా కేసు 30కి వాయిదా

**విజయవాడ,ఏప్రిల్25,ప్రభాతవార్తప్రతినిధి:** స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించి డబ్బు వసూలు చేశారని ఎసిబి నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ ఐపిఎస్ అధికారి పి.జాషువా దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఈ నెల 30కి వాయిదా పడింది. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది సూర్యనారాయణ చేసిన వాదనలు గురువారం పూర్తయ్యాయి. తదుపరి విచారణ వరకు పిటిషనర్‌పై ఎసిబి కఠిన చర్యలు తీసుకోరాదన్న అభ్యర్థనను తోసిపుచ్చింది. క్వాష్ పిటిషన్‌లో ఆ తరహా ఉత్తర్వులు ఇవ్వలేమని, ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చునని చెప్పింది. ఎసిబి తరఫు వాదనలు ఈ నెల 30న విచారిస్తామని జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఎలాంటి ప్రాథమిక విచారణ లేకుండా విజిలెన్స్ నివేదికను ప్రాతిపదికగా చేసుకుని కేసు నమోదు చెల్లదని పిటిషనర్ తరుపు న్యాయవాది వాదనలు వినిపించారు.

## ఎస్వీయూ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ పై బదలీ వేటు

**తిరుపతి విద్య, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** ఎస్వీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం దామ్లానాయక్ పై వర్సిటీ అధికారులు బదిలీ వేటు వేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయనను వర్సిటీ ఇంజనీరింగ్ విభాగానికి బదిలీ చేస్తూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. వారం రోజుల పాటు సెలవులో ఉన్న దామ్లానాయక్ పై వేటు వేయడంపై సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. డిగ్రీ 2వ, 4వ సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి హాల్టికెట్ల జారీలో జరిగిన గందరగోళంతోనే



ఆయనపై అధికారులు వేటు వేశారనే వార్తలు వర్సిటీలో హల్చల్ చేస్తున్నాయి. ప్రభుత్వ ఆన్లైన్ సంస్థ జ్ఞానభూమి పోర్టల్ సాంకేతిక లోపంతోనే హాల్ టికెట్ల జారీలో తప్పులు దొర్లయాని ఇది వర్సిటీ ఉద్యోగులకు సంబంధంలేని విషయవని ఉద్యోగులు వాపోతున్నారు. ఈ విషయాన్ని సైతం అధికారులు తేల్చిన చెప్పిన విషయం విధితమే. అయితే సెలవులో ఉన్న ఆయనపై హుటా హుటిన బదిలీ వేటు వేయడం వెనుక ఆంతర్యమేమిటో అర్థం కాలేదని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. - నూతన కంట్రోలర్ గా రాజమాణిక్యం ఎస్వీయూ ఇంజనీరింగ్ విభాగంలో డిప్యూటీ రిజిస్ట్రార్గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ బి రాజమాణిక్యంను నూతన కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ గా అధికారులు నియమించారు. వచ్చేనెల 3లోపు బాధ్యతలు తీసుకోవాలని ఆ ఉత్తర్వులు పేర్కొన్నారు.

## సిబిఐ పేరిట సైబర్ నేరగాళ్లు 30లక్షలు స్వాహా..

**కొత్తపేట, ఏప్రిల్ 25:ప్రభాతవార్త** సిబిఐ పేరుతో గుర్తు తెలియని వ్యక్తులు రిటైర్డ్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్ ఉద్యోగినిని మోసం చేసి రూ.30 లక్షలు కాజేసిన వైనం అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో కలకలం రేపింది. కొత్తపేట న్యూ బ్యాంకు కాలనీకి చెందిన కొయ్యే సత్యవతి రిటైర్డ్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్ గా పనిచేస్తూ గత ఏడాది మార్చిలో రిటైర్ అయ్యారు. ఆమె భర్త శ్రీనివాస్ డి.ఆర్.డి.ఏ ఉద్యోగిగా పనిచేసి కొన్నేళ్ల క్రితం రిటైర్ అయ్యారు ద్దరూ కొత్తపేట న్యూ బ్యాంకు కాలనీలోని ఇంటి వద్దనే ఉంటుండగా వారి ఇద్దరి కుమారులు లండన్, విజయవాడల్లో ఉంటున్నారు. కుమార్తె, అల్లుడు రాజోలులో ఉంటున్నారు. ప్రభుత్వం నుంచి ఇటీవల సత్యవతి అకౌంట్ కి రిటైర్మెంట్ కు సంబంధించిన సొమ్ము జమ అయ్యింది. ఇంట్లో ఈ వృద్ధ దంపతులు మాత్రమే ఉంటున్న నేపథ్యంలో ఈనెల 16వ తేదీన సత్యవతి మొబైల్ నెంబర్ కు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి మీపై సిబిఐ అరెస్ట్ వారెంట్ ఉందని బెదిరించారు. ఇలా తరచూ ఫోన్ చేసి బెదిరిస్తూ రూ.30 లక్షలు పంపిస్తే నీ మీద అరెస్టు వారంటూ లేకుండా చేస్తామని నమ్మించి బ్యాంకు అకౌంట్ వివరాలు ఇచ్చారు. దీంతో భయపడిన సత్యవతి ఈ విషయం ఎవరికీ చెప్పకుండా ఈనెల 22వ తేదీన తమ బ్యాంక్ అకౌంట్ నుంచి ఆర్.టి.జి.ఎస్ ద్వారా వారు ఇచ్చిన అకౌంట్ కు రూ.30 లక్షలు మనీ ట్రాన్స్ఫర్ చేసారు. ఆ తర్వాత వారి ఫోన్లు పనిచేయకపోవడంతో తమ కుమారుడి సూచన మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసారు. దీనిపై కొత్తపేట ఎస్సై జి సురేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బోరుగడ్డ అనిల్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

**విజయవాడ,ఏప్రిల్25,ప్రభాతవార్తప్రతినిధి:** వైకాంగ్రెస్ పార్టీ నాయకుడు బోరుగడ్డ అనిల్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. బోరుగడ్డకు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. తనపై ఉన్న అన్ని కేసుల్లో బెయిల్ ఇవ్వాలని కోరుతూ బోరుగడ్డ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీనిపై శుక్రవారం సుప్రీంలో విచారణ జరిగింది. జస్టిస్ బి వి నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. దీనిపై హైకోర్టులోనే తేల్చుకోవాలని సుప్రీం కోర్టు తేల్చిచెప్పింది. నకిలీ పత్రాలు సమర్పించి గతంలో బెయిల్ పొందినందుకు ఈ కేసును హైకోర్టే తేల్చుతుందని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో పాటు మంత్రి నారా లోకేష్ , జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై అసభ్య పదజాలంతో దూషించిన కేసులో బోరుగడ్డను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించి ఇటీవల హైకోర్టు కొన్ని వ్యాఖ్యలు కూడా చేసింది. బోరుగడ్డను కొంతకాలం జైలులోనే ఉంచాలని, ఎలా ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారు అని ప్రశ్నించింది ధర్మాసనం. నకిలీ పత్రాలు సమర్పించి బెయిల్‌పై బయటకు వచ్చారంటూ బోరుగడ్డ బెయిల్ రద్దు చేయాలంటూ ఇటీవల పోలీసులు పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలో తనపై నమోదైన అన్ని కేసుల్లో బెయిల్ ఇవ్వాలంటూ బోరుగడ్డ అనిల్ సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. జస్టిస్ బి వి నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం ముందు విచారణ జరిగింది. అయితే అంశాన్ని హైకోర్టులోనే తేల్చుకోవాలని, నకిలీపత్రాలు సమర్పించి గతంలో బెయిల్ పొందినందున ఈ కేసును హైకోర్టులోనే తేల్చుకోవడం మంచిదని సుప్రీం కోర్టు ధర్మాసనం అభిప్రాయపడుతూ బోరుగడ్డకు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది.

## జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల విజయభేరీ

### ఓపెన్ కేటగిరిలో ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ హైదరాబాద్ విద్యార్థిదే


### 100లోపు 10 ర్యాంకులు కూడా భాగ్యనగర్ విదార్థులవే

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 25:** లక్షలాది మంది విద్యార్థులు రాసిన జెఈఈ-మెయిన్ 2025 పరీక్షల్లో దేశం గర్వించేలా టాప్ ర్యాంకులు సాధించి శ్రీచైతన్య హైదరాబాద్ విద్యార్థులు సంచలన రికార్డ్ సాధించారు. ఒక్క హైదరాబాద్ నుంచే 300కి 300 మార్కులుతో ఓపెన్ కేటగిరీలో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించిన వంగా అజయ్‌రెడ్డి శ్రీచైతన్య విద్యార్థే. అంతేగాక ఓపెన్ కేటగిరిలో ఆలిండియా టాప్ 100లోపు 10 ర్యాంకులు, ఓపెన్ కేటగిరీలో ఆలిండియా టాప్ 500లోపు 31 ర్యాంకులు సాధించింది ఒక్క శ్రీచైతన్య హైదరాబాద్ విద్యార్థులే. అదే విధంగా వివిధ కేటగిరీల్లో 100లోపు 46 ర్యాంకులు ఒక్క శ్రీచైతన్య హైదరాబాద్ విద్యార్థులే సాధించారు. భారత దేశంలోనే తెలంగాణను ఉన్నత శిఖరంలో నిలిపింది మన శ్రీచైతన్య హైదరాబాద్ విద్యార్థులేనని శ్రీచైతన్య విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ తెలియజేశారు.

గత మూడు సంవత్సరాలుగా జెఈఈ మెయిన్‌లో 300/300 మార్కులతో ఓపెన్ కేటగిరిలో ఆలిండియా నంబర్ వన్ ర్యాంకులు సాధిస్తూ తిరుగులేని అధిపత్యాన్ని కొనసాగిస్తున్న శ్రీచైతన్య హైదరాబాద్ విద్యార్థులు తెలంగాణ ఖ్యాతిని దశదిశలా చాటుతున్నారని ఆమె అన్నారు. శ్రీచైతన్య హైదరాబాద్ విద్యార్థులు ఇంతటి ఘన విజయాలు సాధించడానికి కారణమైన శ్రీచైతన్య అనితర సాధ్యమైన ప్రోగ్రాములు, మైక్రో షెడ్యూల్స్, ఇంటర్నల్ ఎగ్జామ్స్, ర్యాంకింగ్ సిస్టమ్, ఇన్ఫినిటీ లెర్న్, ఆన్‌లైన్ యాప్‌చ, దేశంలో నిరంతరం శ్రమించే టాప్ ఫ్యాకల్టీ వల్లే ఇంతటి ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. శ్రీచైతన్య హైదరాబాద్ రెసిడెన్షియల్ విద్యార్థులు తమకు పోటీయే లేదని జెఈఈ మెయిన్-2025 ఫలితాలతో మరోసారి నిరూపించారని ఆమె హర్షం వ్యక్తం చేశారు.



## ఎన్‌టిఆర్ జిల్లా రాజకీయ పరిస్థితులు గురించి సిఎంకు మాజీమంత్రి నెట్టెం రఘురామ్ నివేదన



**జగ్గయ్యపేట, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లాలో నెలకున్న రాజకీయాలు, ప్రజలు ఎదుర్కొంటున్న పలు ప్రాధాన్యతతో కూడిన సమస్యల గురించి అధ్యయనం చేసిన ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీమంత్రి నెట్టెం రఘురామ్ శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును వెలగపూడి సచివాలయంలో నేరుగా కలుసుకుని నివేదించారు. సమస్యల పరిష్కార మార్గాల గురించి ఇరువురు చర్చించారు. ఈమేరకు రఘురామ్ మీడియాకు వివరాలు వెల్లడిస్తూ తాను నివేదించిన అంశాల సమాచారం తెలిపారు. జగ్గయ్యపేట మండల పరిధిలోని తెలంగాణా సరిహద్దు గ్రామమైన ముక్త్యాల గ్రామం వద్ద కృష్ణానదిపై నిర్మాణమవుతున్న బ్రిడ్జికి తెలంగాణాలోని ఖమ్మం నుండి జగ్గయ్యపేట ప్రాంతంలోని గండ్రాయి, జగ్గయ్యపేట, ముక్త్యాల వరకు ఖమ్మం నేషనల్ హైవేకి అనుసంధానంచేస్తారు.

## అండమాన్ నికోబార్ దీవుల్లో తెలుగుదేశం కూటమి విజయం

**విజయవాడ ఏప్రిల్ 25 ప్రభాతవార్త ప్రతినిధి:** అండమాన్ నికోబార్ దీవుల్లో భారతీయ జనతాపార్టీ, తెలుగుదేశం పార్టీ కూటమి విజయం సాధించింది విజయపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా తెలుగుదేశం పార్టీకి చెందిన ఎస్.షాహుల్ హమీద్ ఎన్నికయ్యారు. టీడీపీ కేంద్ర కార్యాలయం నేడు ఒక ప్రకటన రూపంలో ఈ విషయం వెల్లడించింది. మున్సిపాలిటీకి 2022-23 లో నిర్వహించిన ఎన్నికల్లో ఏ పార్టీకి ఆధిక్యం లభించని కారణంగా భాజపా, తెదేపా సభ్యులు కూటమిగా ఏర్పడి ఏడాదికి ఒకరు చొప్పున ఛైర్‌పర్సన్‌గా ఉండాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. మొదటి ఏడాది భాజపా, రెండో ఏడాది తెదేపా సభ్యుడు ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు. మూడో ఏడాది మారిన రాజకీయ పరిణామాల్లో కాంగ్రెస్ సభ్యుడు ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఈసారి నిర్వహించిన ఎన్నికల్లో భాజపాతో పాటు స్వతంత్ర సభ్యుడి మద్దతుతో తెదేపా సభ్యుడు హమీద్ ఛైర్‌పర్సన్‌గా గెలుపొందారు. మొత్తం 24 ఓట్లలో హమీద్ 15 ఓట్లు సాధించి ప్రస్తుత మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుదీప్ రాయ్ శర్మ ను ఓడించారు. ఇక్కడ మున్సిపల్ చట్టం ప్రకారం ఏ పార్టీకి ఆధిక్యం ఉన్నా లేకపోయినా ఛైర్‌పర్సన్ స్థానానికి ఏటా ఎన్నికలు నిర్వహిస్తారు. హమీద్ విజయానికి ఎంతో కృషి చేసిన తెదేపా జాతీయ ఉపాధ్యక్షుడు, అండమాన్ రాష్ట్ర ఇన్‌ఛార్జి వి.మాధవనాయుడు, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు అజోయ్ బైరాగి ఎన్నికల కమటీ సభ్యులకు అండమాన్ నికోబార్ రాష్ట్ర తెదేపా అధ్యక్షుడు ఎస్.మాణిక్యరావు యాదవ్ ధన్యవాదా తెలిపారు. ప్రజా సంక్షేమమే ఎజెండాగా తెదేపా పనిచేస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

## జాతీయ విద్యావిధానంతో సవాళ్లను ఎదుర్కనేలా తోడ్పాటు

**తిరుపతి,ఏప్రిల్ 25ప్రభాతవార్తప్రతినిధి:** ప్రవేశం, సమానత్వం, నాణ్యత, అందుబాటు బాధ్యత ఐదు ప్రధాన సూత్రాల ఆధారంగా రూపుదిద్దుకున్న జాతీయ విద్యావిధానం(ఎన్ఇపి)2020 అని తిరుపతి పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం డీన్ ఆచార్య పి.విజయలక్ష్మి తెలిపారు. ఈ విధానంలో భవిష్యత్తులో జాతీయ, ప్రపంచస్థాయి సవాళ్ళను ఎదుర్కొనే విధంగా యువ మేధావులను సిద్ధం చేయడానికి తోడ్పడుతుందని ఆమె అన్నారు. పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలో అధ్యాపకులు అందరూ లైఫ్‌స్కిల్స్ ఎడ్యుకేషన్‌లో శిక్షణ పొందారని, కొత్తగా చేరే విద్యార్థులందరికీ మొదటి సెమిస్టర్‌లోనే లైఫ్ స్కిల్స్‌పై అవగాహన కల్పించి, అర్థవంతమైన జీవితాన్ని గడిపే వ్యక్తులుగా తయారుచేస్తామన్నారు. తిరుపతి పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలో రెండురోజుల సిబిఎస్ఇ పాఠశాలల ప్రిన్సిపాళ్ళకు జాతీయస్థాయి ఎక్స్‌పోజర్ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి పద్మావతి వర్సిటీ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ హ్యూమానిటీస్ మేనేజ్‌మెంట్ డీన్ ఆచార్య విజయలక్ష్మి, స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ ఆచార్య టి.సుధ పాల్గొని విశ్వవిద్యాలయంలో విద్యతోబాటు చేపడుతున్న వివిధ కార్యక్రమాలు పరిశోధన, సామాజికసేవ, ఇంటర్న్‌షిప్ ప్రాజెక్టులు, ఇండక్షన్‌ప్రోగ్రామ్స్, కెరీర్ కౌన్సిలింగ్ తితర అంశాలను గురించి వివరించారు. ఎన్ఇపి కోఆర్డినేటర్ ఆచార్య టిజి అముదవల్లీ పాఠశాల విద్యలో ఎన్ఇపి 2020 కాగ్నిటివ్ నైపుణ్యాల అభివృద్ధిపై మాత్రమేగాకుండా సామాజిక, భావోద్వేగ నైపుణ్యాలపై గట్టి పట్టుదలతోఉందని అన్నారు.

## పిఒకెలో హమాస్ వచ్చాకే
# పహాల్గాంలో ఉగ్రదాడి

### ఇజ్రాయెల్ రాయబారి రెవెన్ అజర్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై ఇజ్రాయెల్ రాయబారి రెవెన్ అజర్ మాట్లాడుతూ అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడిగా పోల్చారు. ఈ రెండు దాడులు పౌరులనే లక్ష్యంగా చేసుకుని జరిగాయని, ఉగ్రవాద గ్రూపుల మధ్య సమన్వయం పెరుగుతోందని హెచ్చరించారు. ఉగ్రవాదులు అన్ని స్థాయిల్లో పరస్పరం సహకరించుకుంటున్నారు. అందుకోసం వారు ఒకరికొకరు అనుకరించడానికి ప్రయత్నిస్తున్నారు. దురదృష్టవశాత్తు ఉగ్రవాద సంస్థలు ఒకరిని ఒకరు ప్రేరేపించుకుంటున్నాయని మనం అంగీకరించాలి. పహల్గాం ఉగ్రదాడికి, 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడికి మధ్య చాలా పోలికలు ఉన్నాయి. పహల్గాంలో ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న అమాయకులైన పర్యాటకులపై దాడి జరిగితే,



ఇజ్రాయెల్ ప్రజలు సంగీత వేడుక జరుపుకుంటున్నప్పుడు ఈ దాడులు జరిగాయి. పహల్గాం దాడి జరగక ముందు ఇటీవల హమాస్ నాయకులు పాక్ ఆక్రమిత్ కశ్మీర్ (పీఓకే)లో పర్యటించారు. అక్కడ వారు జైషే మహ్మద్ కార్యకర్తలతో సమావేశమైనట్లు సమాచారం. దీనికి పహల్గాం దాడి మధ్య సంబంధం ఉండొచ్చు అని రెవెన్ అజర్ అనుమానం వ్యక్తం చేశారు.

పహల్గాం దాడిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించిన విధానాన్ని, ముఖ్యంగా బీహార్‌లోని మధుబని సభలో ఆయన చేసిన ప్రసంగాన్ని రెవెన్ అజర్ ప్రశంసించారు. భారత ప్రభుత్వం తీవ్రంగా ఖండించడం తీసుకున్న కఠినమైన చర్యలు, హెచ్చరికలు నాకు ఎంతో ధైర్యం కలిగించాయి. ఉగ్రవాదులకు మద్దతిస్తున్న దేశాలను ప్రపంచం బహిష్కరించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఉగ్రవాదాన్ని దేశాలు నిధులు, ఇంటెలిజెన్స్ సమాచారం, ఆయుధాల రూపంలో మద్దతు ఇస్తున్నాయి. ఇది ఆమోదయోగ్యం కాదు అని రెవెన్ అజర్ స్పష్టం చేశారు. మరోవైపు ఈ పహల్గాం ఉగ్రదాడి, పాకిస్థాన్ చర్యల గురించి భారత్ జీ 20 దేశాలకు సమాచారం అందించింది. గురువారం దిల్లీలో ఉన్న జీ20 దేశాల రాయబారులతో పాటు వ్యూహాత్మక భాగస్వాములతో సమావేశమైన భారత్ కార్యకదర్శి విక్రం మిస్రీ ఈ మేరకు వివరించారు. అలాగే, ఉగ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న విధానాన్ని గురించి కూడా తెలిపారు.

# ఇద్దరు ఉగ్రవాదుల ఇళ్లల్లో భారీ పేలుడు

## ఆర్మీ టార్గెట్‌గా లష్కరే ఉగ్రవాదుల కుట్రలు

**శ్రీనగర్, ఏప్రిల్ 25:** పహల్గాం ఉగ్రదాడిలో హస్తం ఉందని భావిస్తున్న లష్కరే తోయిబాకు చెందిన ఇద్దరు ఉగ్రవాదుల ఇళ్లల్లో పేలుడు సంభవించింది. ఆసిఫ్ పౌజీ అలియాస్ ఆసిఫ్ షేక్, ఆదిల్ హుస్సేన్‌థోకర్ అలియాస్ ఆదిల్ గురి అనే ఇద్దరు ఉగ్రవాదులు ఇళ్లు ధ్వంసమయ్యాయి. అయితే భద్రతా దళాలలు సోదాలు నిర్వహిస్తున్న సమయంలోనే ఈ పేలుళ్లు సంభవించాయని, త్రుటిలో తప్పించుకున్నారని అధికారులు వెల్లడించారు. అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం, పహల్గాం దాడి తర్వాత ఉగ్రవాదుల నివాసాల్లో భద్రతా దళాలు తఖీలు నిర్వహించింది. ఈ క్రమంలోనే దక్షిణ కశ్మీర్‌లోని త్రాల్‌కు చెందిన ఆసిఫ్ షేక్ ఇంటికి వెళ్లగా, అక్కడ పేలుడు పదార్థాలు ఉన్నాయని గుర్తించారు. అయితే అవి యాక్టివేట్ అయినట్లు తెలియడం వల్ల అప్రమత్తమైన సిబ్బంది బయటకు వచ్చేశారు. కాసేపటికే భారీగా పేలుళ్ల సంభవించాయి. ఇదే విధంగా అనంత్ నాగ్ జిల్లాలోని బిజ్‌బెహారా బ్లాక్‌లోని గురి గ్రామానికి చెందిన ఆదిల్ గురి నివాసంలోనూ పేలుడు సంభవించింది. గాలింపు చర్యలకు వచ్చిన సమయంలో ఆర్మీ జవాన్లకు హాని కలిగించాలనే ఉద్దేశంతోనే ఉగ్రవాదులు ముందుగానే తమ ఇళ్లల్లో పేలుడు పదార్థాలు అమర్చి ఉంటారని అధికారులు భావిస్తున్నారు. కావాలనే ఈ నివాసాల సమాచారం భద్రతా దళాలకు అందేలా ప్లాన్ చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆదిల్ గురి 2018లో చట్టబద్ధంగా పాకిస్థాన్ వెళ్లి, గతేడాది జమ్ముకశ్మీర్‌కు తిరిగి వచ్చాడని అధికారులు తెలిపారు. జమ్ముకు రాకముందు అక్కడ ఉగ్రవాద శిబిరాల్లో శిక్షణ పొందాడని వెల్లడించారు. పహల్గాం ఉగ్రదాడిలో పాల్గొన్న ముగ్గురు టెర్రరిస్టుల స్కెచ్‌లను దర్యాప్తు బృందాలు విడుదల చేశాయి. వీరిని ఆసిఫ్ ఫౌజి, సులేమాన్ షా, అబు తాలాగా గుర్తించారు. మూసా, యూనిస్, ఆసీఫ్ అనే కోడ్‌నేమ్‌లు కూడా ఉన్నట్లు తెలిపింది.



ఆదిల్ థోకర్ అనే మరో ఉగ్రవాదికి కూడా వీరితో సంబంధం ఉందని దర్యాప్తు బృందాలు తెలిపాయి. వీరందరూ జమ్ముకశ్మీర్ కేంద్రంగా పనిచేసే ది రెసిస్టెన్స్ ఫ్రంట్‌ఖిలో సభ్యులని చెప్పాయి. ఉగ్రదాడి నుంచి బయటపడిన ప్రత్యక్ష సాక్షులు చెప్పిన వివరాల ఆధారంగా ఈ ఊహా చిత్రాలను గీసినట్లు పేర్కొన్నాయి.

## బీహార్‌లో నీట్ పేపర్ లీకేజీ కేసు..
# ప్రధాన నిందితుడు అరెస్టు



**పాట్నా, ఏప్రిల్ 25:** 'నీట్ యుజి-2024' ప్రవేశ పరీక్ష పేపర్ లీకేజీ కేసులో ప్రధాన నిందితుడైన సంజీవ్ ముఖియాను ఆర్థికనేర విభాగం బృందం చేసింది. గురువారం రాత్రి అతడిని బీహార్ రాజధాని పాట్నాలో అరెస్టు చేశామని ఇఒయు అధికారి నయ్యర్ హుస్సేన్ ఖాన్ వెల్లడించారు. నీట్ పేపర్ లీకేజీ కేసులో సంజీవ్ ముఖియా ప్రధాన నిందితుడు. పేపర్ లీకేజీ అంశం బయటపడగానే అతడు పరారయ్యాడు. అతడిని పట్టుకునేందుకు బీహార్ ప్రభుత్వం ఇటీవల సంజీవ్‌పై రూ.3 లక్షల నజరానా ప్రకటించింది. ఈ క్రమంలోనే అతడు పాట్నాలోని ఒక అపార్టుమెంట్‌లో ఉన్నట్లు సమాచారం అందడంతో అధికారులు అక్కడికి వెళ్లి అతడిని అరెస్టు చేశారు. ముఖియా అరెస్టుతో పేపర్ లీకేజీతో సంబంధం ఉన్న మరింత మంది వ్యక్తుల పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉంది. బీహార్‌లోని నలందా జిల్లా నాగర్‌సోనా గ్రామం తానికి చెందిన సంజీవ్ తొలుత సాబూర్ అగ్రికల్చర్ కాలేజీలో పనిచేసేవాడు. అక్కడ పేపర్ లీక్ చేసినట్లు ఆరోపణలు రావడంతో 2016లో అతడిపై వేటు వేశారు. ఆ కేసులో కొన్నాళ్లపాటు జైలుశిక్ష కూడా అనుభవించాడు. అనంతరం నలందా కాలేజీ నూర్‌సరయ్ బ్రాంచ్‌లో టెక్నికల్ అసిస్టెంట్‌గా చేరాడు. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై మధ్యవర్తులు, విద్యార్థులు సహా 14 మందిని బీహార్ పోలీసులు అరెస్టు చేసి విచారించగా సంజీవ్ ముఖియా పేరు ప్రధానంగా బయట కొచ్చింది.

కాగా సంజీవ్ కుమారుడు శివ్‌కుమార్‌కూ ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్నట్లు తేలింది. అతడు బీహార్ ఉపాధ్యాయ నియామక పరీక్ష పేపర్ లీక్ కేసులో అరెస్టయి ప్రస్తుతం జైలులో ఉన్నాడు. వీరిద్దరూ 'ముఖియా సాల్వర్ గ్యాంగ్' పేరుతో ఓ ముఠాను ఏర్పాటు చేసినట్లు తెలిసింది.

# భారత మూలాలు మరవని ఉషా వాన్స్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:** జేడీ వాన్స్ కుటుంబం మూడు రోజుల పాటు భారత్‌లో పర్యటించారు. అయితే, భారత సంతతి మూలాలు ఉన్న ఆయన భార్య ఉషా వాన్స్ పైనే అందరి దృష్టి నెలకొంది. భారత మూలాలను మర్చిపోని ఆమె, వారి పిల్లలను భారతీయ సంప్రదాయ దుస్తులు కనువిందు చేశారు. ఈ క్రమంలోనే షాపింగ్ చేసిన ఆమె, పలు వస్తువులును కొనుగోలు చేశారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం భారత్‌కు వచ్చిన జేడీ వాన్స్ కుటుంబం దేశంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. తొలుత దిల్లీలో దిగిన వాన్స్ కుటుంబానికి ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత అక్షర్‌ధామ్ ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. అనంతరం జన్‌పథ్‌లో ఉన్న సెంట్రల్ కాటేజ్ ఇండస్ట్రీస్ ఎంపోరియంలో భారత హస్తకళల ఉత్పత్తుల దుకాణానికి వెళ్లి పలు ఉత్పత్తులు కొనుగోలు చేశారు. ఇందులో ముఖ్యంగా తేయాకుతో పాటు అనేక రకాల ఉత్పత్తులను కొనుగోలు చేసినట్లు అక్కడి మేనేజర్ మీటు వజిరాని తెలిపారు. ఇక్కడ జమ్ము కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఉన్న హస్త కళా ఉత్పత్తులు లభిస్తాయి. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఆయన భార్య ఉషా వాన్స్ ఇక్కడికి రావడం చాలా సంతోషంగా ఉంది. వారు ఇక్కడ చాలా సమయం గడిపారు. ప్రతి వస్తువును పరిశీలిస్తూ కొన్నింటిని కొనుగోలు చేశారు. జమ్ము కశ్మీర్‌కు చెందిన కళాకారులు మట్టితో చేసిన ఉత్పత్తులు కొన్నారు. ఉషా మాత్రం తేయాకుతో పాటు తేనెను తీసుకున్నారు. కొన్ని కారణాల వల్ల ధర, బ్రాండ్‌కు సంబంధించిన వివరాలు వెల్లడించలేమని మేనేజర్ తెలిపింది. మూడు రోజుల పాటు సాగిన అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్ భారత పర్యటన గురువారం ముగిసింది. ఆయన తన భార్య ఉషా వాన్స్, ముగ్గురు పిల్లలతో కలిసి గురువారం ప్రత్యేక విమానంలో అమెరికాకు తిరిగి వెళ్లారు. అంతకుముందు సోమ వారం రాత్రి దిల్లీకి చేరుకున్న వాన్స్ కుటుంబం అక్కడి నుంచి జైపుర్ వెళ్లింది. మంగళవారం జైపుర్‌లోని అంబర్ కోటతో పాటు ప్రపంచ ప్రసిద్ధ తాజ్‌మహల్ కూడా సందర్శించారు.

# అమెరికా కోసమే అన్ని తప్పులు చేశాం..

### పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్

**కరాచి, ఏప్రిల్ 25:** ఉగ్రవాద సంస్థలకు పాకిస్థాన్ మద్దతు ఇస్తున్నట్లు స్వయంగా ఆదేశ రక్షణ మంత్రే అంగీకరించారు. ఉగ్ర సంస్థలకు నిధులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పహల్గాం దాడి తర్వాత భారత్‌తో నెలకొన్న ఉద్రిక్తతలపై పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ ఉగ్ర సంస్థలకు నిధులు, ఉగ్రవాదులకు శిక్షణ, మద్దతు వంటివి పాకిస్థాన్ చాలాకాలంగా చేస్తోందన్నది మీరు ఒప్పుకుంటారా అని ప్రశ్నిస్తూ దీనిపై మీ స్పందన ఏంటీ అన్న ప్రశ్నలు రావడంతో ఖవాజా సమాధానమిస్తూ అమెరికా, బ్రిటన్ సహా పశ్చిమదేశాల కోసం మూడు దశాబ్దాల పాటు మేం ఈ చెత్త పనులు అన్నీ చేస్తున్నాం. అయితే అది పెద్ద తప్పు అని మాకు అర్థమైంది. దానివల్ల పాక్ చాలా ఇబ్బందులు



ఎదుర్కోవాల్సి వచ్చింది. అందుకే మీరు ఇప్పుడు నన్ను ఇలా ప్రశ్నిస్తున్నారు. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో, 9/11 తర్వాత జరిగి దాడుల్లో మేం పాల్గొనకపోయి ఉంటే పాక్‌కు తిరుగులేని ట్రాక్ రికార్డ్ ఉండేదని ఖవాజా అన్నారు. ఇదే ఇంటర్వ్యూలో లష్కరే తోయిబా గురించి ప్రస్తావిస్తూ, అది పాత పేరు అని, ఇప్పుడు తమ దేశంలో దాని ఉనికిలేదని తెలిపారు. అంతేకాకుండా భారతదేశంతో పూర్తి స్థాయిలో యుద్ధం జరగవచ్చని ఆసిఫ్ అన్నారు. ఉగ్రదాడి ప్రతిస్పందనగా చర్యలు పహల్గాంలో ఏప్రిల్ 22న పర్యటకులపై జరిపిన ఉగ్రవాదులు దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. కేంద్ర భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) సమావేశమై ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత ప్రభుత్వం తీసుకున్న చర్యలు తీసుకుంటుంది. పాక్‌దౌత్యవేత్తకు సమన్లు జారీ చేయడం, సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడం, పాకిస్థాన్‌కు సంబంధించి అన్నీ వీసాలపై వేటు, అంతేకాకుండా దాయాది పౌరులను తక్షణమే40 గంటల్లో భారత్ విడిచివెళ్లాలని ఆదేశించింది. అంతేకాకుండా ఇరుదేశాల రాయబార కార్యాలయాల్లో ఉన్న అధికారుల సంఖ్య తగ్గించడం వంటి చర్యలు తీసుకుంది.

# పాక్ ఆర్మీ అదుపులో భారత్ జవాన్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:** భారత్ పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితుల వేళ పొరపాటున సరిహద్దు దాటిని జవాన్‌ను దాయాది అదుపులోకి తీసుకుంది. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ కు చెందిన పీకే సాహును పాకిస్థాన్ రేజంర్లు అదుపులో తీసుకున్నారు. ఈ క్రమంలోనే భారత జవాన్ పీఎస్ సాహూ కుటుంబంతో పాటు స్నేహితులు



ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయన రాక కోసం ఎదురు చూస్తున్నామని సాహూ తండ్రి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుమారుడి కమాండిగ్ ఆఫీసర్ గురువారంరాత్రి తనకు కాల్ చేసి మాట్లాడారని చెప్పారు. సాహూను సురక్షితంగా విడుదల చేసేందుకు పాకిస్థాన్, భారత్ అధికారుల మధ్య సమావేశం ఉంటుందని చెప్పినట్లు వివరించారు. తన కుమారుడు దేశం కోసం పనిచేస్తున్నాడని, ఆయన సురక్షితంగా విడుదల చేసేందుకు అన్ని రకాల ప్రయత్నాలు జరుగుతాయని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. తన కుమారుడు హోలీ పండగకు ఇంటికి వచ్చడని, మూడువారాల కిందటే తిరిగి వెళ్లాడని వివరించారు. కాగా, సాహూకు భార్య రజినితో పాటు ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. మంగళవారం రాత్రి ఆయనతో మాట్లాడినట్లు భార్య రజిని వాపోయారు. వీలైనంత త్వరగా ఆయన తిరిగి రావాలని కోరుకుటుంటున్నట్లు చెప్పారు. అందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జవాన్ పీఎస్ సాహూ బంగాల్‌లోని హారిసభ ప్రాంతానికి చెందిన పీకే సాహూ, ప్రస్తుతం బీఎస్ఎఫ్ 182వ బెటాలియన్‌లో పంజాబ్ ఫిరోజ్ పూర్ సరిహద్దు వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు. బుధవారం విధులు నిర్వర్తిస్తున్న క్రమంలోనే పొరపాటున సరిహద్దు దాటగా పాకిస్థాన్ రేంజర్లు అదుపులోకి తీసుకున్నారు. అధికారుల సమాచారం ప్రకారం అదుపులోకి తీసుకున్న సమయంలో సాహూ యూనిఫారం ధరించి సర్వీస్ రైఫిల్‌తో ఉన్నాడని చెబుతున్నారు. సరిహద్దు సమీపంలోని చెట్టు కింద కొంతసేపు విశ్రాంతి తీసుకునేందుకు వెళ్లగా అదుపులోకి తీసుకున్నట్లు వివరిస్తున్నారు. అయితే, పీకే సాహూను తిరిగి రప్పించేందుకు బీఎస్ఎఫ్ ఫ్లాగ్ మీటింగ్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇరుదేశాల మధ్య ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతాయని వెల్లడించారు. కానీ, ఇటీవలె జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే పీకేసాహూను పాక్ అదుపులోకి తీసుకోవడంతో అందరిలోనీ భయం నెలకొంది.

## ఆ పిటిషన్లన్నింటినీ కొట్టివేయాలి..

### సుప్రీంలో కేంద్రం 1330 పేజీలతో అఫిడవిట్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:** వక్ఫ్ సవరణ చట్టంను సమర్థిస్తూ కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు లో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. వక్ఫ్ చట్టం 2025 చట్టబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లకు సమాధానంగా కేంద్రం కౌంటర్ అఫిడవిట్ వేసింది. ఈ చట్టం చెల్లుబాటును



సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేయాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరింది. ఈ చట్టంలో చేసిన పలు సవరణలు మత స్వేచ్ఛకు సంబంధించిన ప్రాథమిక హక్కులను హరిస్తాయనే తప్పుడు ప్రాతిపదికపై పిటిషన్లు ఉన్నాయని ఆరోపించింది. ఆర్టికల్ 32 ప్రకారం ఒక చట్టాన్ని సుప్రీంకోర్టు సమీక్షించవచ్చని తెలిపింది. కాకపోతే పార్లమెంటరీ ప్యానెల్ ద్వారా సమగ్రమైన, లోతైన, విశ్లేషణాత్మక అధ్యయనం అనంతరమే వక్ఫ్ చట్టానికి సవరణలు చేశామని తెలిపింది. గతంలో ఉన్న నిబంధనలతో ప్రైవేట్, ప్రభుత్వ ఆస్తుల దుర్వినియోగం జరిగిందని ఈ సందర్భంగా సుప్రీంకోర్టుకు కేంద్రం తెలిపింది. ఈ మేరకు 1332 పేజీలతో దాఖలు చేసిన ప్రాథమిక కౌంటర్ అఫిడవిట్‌లో ఈ చట్ట సవరణలను సమర్థించుకుంది. 2013 తర్వాత ఆశ్చర్యకరంగా వక్ఫ్ భూమి భారీగా పెరిగిందని పేర్కొంటూ మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ షేర్షా సీ షేక్ మొహిద్దీన్ అఫిడవిట్ దాఖలు చేశారు. వక్ఫ్ చట్టం రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ 72 పిటిషన్లు దాఖలు కాగా వాటిపై ఏప్రిల్ 17న సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఈ నేపథ్యంలో మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే ముందు దీనిపై సమాధానం ఇచ్చేందుకు కేంద్రం వారం గడువు కోరగా న్యాయస్థానం అందుకు అంగీకరించింది. ఈ నేపథ్యంలో తాజాగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. తదుపరి విచారణ వరకు వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేయబోమని కేంద్రం కోర్టుకు తెలిపింది. అయితే అప్పటివరకు వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతరులను సభ్యులుగా నియమించవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను మే 5కు వాయిదా వేసింది.




# మోడీ ఉండగా భారత్‌ను ఏమీ చేయలేరు!

### ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్

**ఉదగమండలం(తమిళనాడు), ఏప్రిల్ 25:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు చేసిన దాడిని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఖండించారు. ఉగ్రవాదంతో ప్రపంచానికి ముప్పు పొంచి ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు తమిళనాడులోని ఉదగమండలంలోని రాజ్‌భవన్‌లో తమిళ రాష్ట్ర, కేంద్ర, ప్రైవేట్ విశ్వవిద్యాలయాల వైస్‌ఛాన్సలర్ల సమావేశంలో పాల్గొన్న ఆయన, పహల్గాం ఉగ్రదాడి బాధితుల కోసం 2 నిమిషాలు మౌనం పాటించారు. నేను పాజిటివిటీని నమ్ముతాను. అలాగే మనమంతా సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలి. పహల్గాంలో ఉగ్రవాదులు దాడి చేసి అమాయకుల ప్రాణాలు బలిగొన్నారు. దీనిపై దేశంతోపాటు నేను కూడా తీవ్రమైన దుఃఖంతో, ఆగ్రహంతో ఉన్నాను. ఈ ఘటన ఉగ్రవాదం ప్రపంచానికి ముప్పు అనేది తెలియజేస్తుంది. ప్రపంచంలో శాంతిని ప్రేమించే దేశాల్లో భారతదేశం మొదటిది. మూడోసారి ప్రధానిగా ఉన్న మోదీ తన దార్శనిక నాయకత్వంతో అంతర్గతంగా, బాహ్యంగా ఎలాంటి పరిస్థితి ఎదురైనా, దేశాభివృద్ధికి ఆటంకం కలగకుండా చూసుకుంటారనే హామీ ఉంది. ప్రజలు వ్యక్తిగత, రాజకీయ, ఇతర ప్రయోజనాలకు అతీతంగా జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ విజ్ఞప్తి చేశారు. జాతీయ విద్యా విధానం ఒక గేమ్ ఛేంజర్ పాలసీ అని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు. ఈ జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) మన దేశ నాగరితక విలు వలకు అనుగుణంగా ఉంది. ఇది భారతీయ భాషలకు ప్రాధాన్యత ఇస్తుంది. అలాగే ఇది బహుళవిభాగాల అభ్యాసాన్ని ప్రోత్సహిస్తుంది. అందించే విద్య ఉద్యోగ అవకాశాలు మాత్రమే కాదు, వ్యక్తి అభ్యున్నతికి కూడా దోహదం చేస్తుంది. అన్నింటకంటే ముఖ్యంగా ఈ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ అనేది విద్యార్థులు తమ మాతృభాషలో చదువుకోవడానికి వీలు కల్పిస్తుంది. ఇది మనల్ని వలసపాలన నుంచి బయటకు తీసుకువస్తుంది. ఇది కచ్చితంగా ఒక గేమ్ ఛేంజర్. కానీ సమస్య ఏమిటంటే, విద్యాసంస్థల్లో ఉన్న చాలా మందికి ఈ విధానంగురించి పూర్తిగా తెలియదు. మన భాషలు మనకు గర్వకారణం. అవి మనకు వారసత్వంగా వచ్చాయి. సంస్కృతం, తమిళం, తెలుగు, కన్నడ, హిందీ, బంగ్లా మొదలైన భాషలన్నీ సాహిత్యానికి, జ్ఞానిని బంగారు గనుల్లాంటివి అని ఉపరాష్ట్ర పతి అన్నారు.

## హెచ్-1బి వీసా మోసం కేసు..
# భారతీయుడికి యేడాదికిపైగా శిక్ష

**వాషింగ్టన్, ఏప్రిల్ 25:** అమెరికాలో హెచ్-1బి వీసా మోసం కేసులో భారత సంతతి వ్యక్తి కిశోర్‌కు 14 నెలల జైలుశిక్ష పడింది. దీంతోపాటు నిబంధనలను ఉల్లంఘించినందుకు గానూ 1.25 లక్షల డాలర్లు, ఇతర కారణాల కింద 7,500 డాలర్ల జరిమానా, ప్రత్యేక రుసుము కింద మరో 1,100 డాలర్లు వసూలు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. నానోసెమోంటిక్స్ సంస్థ సహవ్యవస్థాపకుడిగా ఉన్న కిశోర్‌పై అక్రమ మార్గాల్లో వీసాలు పొందేందుకు ప్రయత్నించినట్లు అభియోగాలు రాగా.. అవి నిజమని దర్యాప్తులో తేలింది. ఇందుకు సంబంధించి గత యేడాదిలోనే నిందితుడు నేరం అంగీకరించగా ఇటీవల శిక్ష ఖరారైంది.
కాలిఫోర్నియాకు చెందిన కిశోర్.. బే ఏరియా టెక్ కంపెనీల కోసం నానోసెమాంటిక్స్ సంస్థ




ద్వారా నైపుణ్యం కలిగిన ఉద్యోగులను సరఫరా చేసి కమీషన్ పొందుతుండేవాడు. ఈ క్రమంలో 2019లో అక్కడ ఉద్యోగాలు అందుబాటులో లేకముందే వీసాలు పొందే చర్యలకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. ఇలా హెచ్-1బి వీసాల్లో అక్రమాలకు పాల్పడుతున్నారని గుర్తించిన పోలీసులు కిశోర్‌తోపాటు మరో ఇద్దరిపై వీసా మోసం, కుట్ర కేసులు నమోదు చేశారు.

# పరువు నష్టం కేసులో మేధా పాట్కర్ అరెస్టు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:** పరువునష్టంకేసులో సామాజిక కార్యకర్త నర్మదా బచావో ఆందోళన్ ఉద్యమకారిణి మేధా పాట్కర్‌ను ఢిల్లీపోలీసులు అరెస్టుచేసారు. 2000నాటి ఈ కేసును ప్రస్తుత ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్న వికె సక్సేనా దాఖలుచేసారు. దీనిపై ఇటీవల విచారణజరిపిన న్యాయస్థానం ఆమెకు నాన్‌బెయిలబుల్ వారంట్ జారీచేసింది. ఈ క్రమంలోనే శుక్రవారం పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆమెను కోర్టుముందు హాజరుపరచనున్నారు. మేధా పాట్కర్, వికెసక్సేనాల మధ్య 2000వ సంవత్సరంనుంచి న్యాయపోరాటం కొనసాగుతోంది. నర్మదా బచావో ఆందోళన్‌కు వ్యతిరేకంగా ప్రకటనలు ప్రచురించారనే ఆరోపణలపై వికె సక్సేనాపై ఆమె అప్పట్లో కేసు వేసారు. ఆ సమయంలో ఆయన అహ్మదాబాద్ కేంద్రంగా ఉన్న నేషనల్ కౌన్సిల్‌ఫర్ సివిల్ లిబర్టీస్ అనే ఎన్జీవోకు చీఫ్‌గా ఉన్నారు. మరోవైపు ఒక టివిఛానెల్ ఇంటర్వ్యూలో తనను కించపరిచేలా వ్యాఖ్యలు చేసారని, పరువునష్టం కలిగించేలా పత్రికా ప్రకటనలు జారీ చేసారని ఆరోపిస్తూ పాట్కర్‌పై వికె సక్సేనా సైతం రెండు కేసులు దాఖలు చేసారు.

# పోప్ చివరి దర్శనం కోసం లక్షల మంది

## పరిశుభ్రతకు గంట మాత్రమే చర్చి మూత

**వాటికన్, ఏప్రిల్ 25:** ప్రజా సందర్శన కోసం సెయింట్ పీటర్స్ బసిలికా చర్చిలో ఉంచిన పోప్ ఫ్రాన్సిస్ పార్థివదేహానికి నివాళులర్పించడానికి ప్రపంచం నలుమూలల నుంచి లక్షలాది మంది తరలి వస్తున్నారు. అనుకున్న దానికంటే ఎక్కువ మంది భక్తులు, అభిమానులు చివరి దర్శనం కోసం బారులు తీరుతుండటంతో సెయింట్ బసిలికా చర్చిని రాత్రంతా తెరచే ఉంచారు. గురువారం ఉదయం ఒక గంట మాత్రమే చర్చిని పరిశుభ్రం చేయడం కోసం మూసి ఉంచినట్లు వాటికన్ వర్గాలు తెలిపాయి. గత సోమవారం స్ట్రోక్ కారణంగా మరణించిన 88 యేళ్ల పోప్ ఫ్రాన్సిస్ చివరి చూపు కోసం గంటల తరబడి మౌనంగా క్యూలో నిలబడ్డ భక్తులు తమకు ఆయనపై



ఉన్న ప్రేమాభిమానాలను చాటుతున్నారు. వాటికన్ నగరంలోని కన్సిలియాజోన్ నుంచి సెయింట్ పీటర్స్ స్క్వేర్ మీదుగా బసిలికాకు చేరడానికి అనేక గంటలు పట్టినా ఖాతరు చేయకుండా నెమ్మదిగా ముందుకు సాగుతున్నారు. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకూ లైన్ లోనే నిలుచున్నా ఎమిలియానో ఫెర్నాండెజ్ 'ఇక్కడ ఎంతసేపు వేచి ఉన్నానన్నది సమస్యే కాదు. ఎందుకంటే ఆయన పట్ల నా అభిమానాన్ని చూప డానికి ఇదే చివరి అవకాశం' అన్నారు.

**ప్రపంచం ఆనందభరిత ప్రదేశం కావాలన్నదే పోప్ సందేశం:** సాదాసీదా శవపేటికలో ఉంచిన పోప్ ఫ్రాన్సిస్ పార్థివదేహాన్ని ప్రజా దర్శనం కోసం బుధవారం సెయింట్ పీటర్స్ బసిలికా చర్చికి తీసుకొచ్చారు. ఆయన అంత్యక్రియలు శనివారం జరగనున్నాయి. '12 సంవత్సరాల పాటు పోప్ పీఠంపై ఉన్న ఫ్రాన్సిస్ పేదల పట్ల అవ్యాజమైన ప్రేమ కురిపించడంతోపాటు అన్ని వర్గాలనూ కలుపుకొని వెళ్లేలా పనిచేశారు. ఆ కారణంగా ఆయన ఛాందస వర్గాల నుంచి విమర్శలకు గురయ్యారు కూడా. ప్రపంచాన్ని ఆనందభరిత ప్రదేశంగా మార్చాలన్నదే ఆయన సందేశం'

**జాతీయ జెండా అవనతం:** పోప్ ఫ్రాన్సిస్ పట్ల గౌరవ సూచకంగా ఆయన అంత్యక్రియలు జరిగే శనివారం నాడు భారత్‌లో దేశవ్యాప్తంగా అన్ని భవనాలపై జాతీయ జెండాను అవనతం చేస్తారు. ఆరోజు అధికారికంగా ఎలాంటి వినోద కార్యక్రమం నిర్వహించబోమని కేంద్రం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. తనువు చాలించిన పోప్ ఫ్రాన్సిస్ పట్ల గౌరవం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం మూడు రోజులు అధికారిక సంతాప దినాలుగా ప్రకటించిన విషయం విదితమే. దేశంలో ఈ నెల 22, 23 తేదీల్లో సంతాపదినాలు పాటించారు. అంత్యక్రియలు జరిగే శనివారం చివరి సంతాప దినం పాటిస్తారు. పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హాజరుకానున్నారు.

# మెగాస్టార్‌గా ఎదిగిన చిరంజీవి: ఎపి సిఎం

డాక్టర్ శరణి రచించిన మైండ్‌సెట్ షిఫ్ట్ పుస్తకావిష్కరణ కార్యక్రమం విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో జరిగింది. ఆంధ్రప్రదేశ్ గౌరవనీయ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు, పద్మ విభూషణ్ మెగాస్టార్ చిరంజీవి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి మంత్రి పొంగూరు నారాయణ కుమార్తెగా డాక్టర్ శరణికి ఉన్న గుర్తింపు అందరికీ తెలిసిందే. ఆమె రచించిన మైండ్‌సెట్ షిఫ్ట్ పుస్తకావిష్కరణలో



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, సానుకూల ఆలోచన, బలమైన అంకితభావమే విజయాన్ని సాధించడంలో తోడ్పడతాయి. చిరంజీవి సినిమా నేపథ్యం లేని సాధారణ కుటుంబం నుండి వచ్చారు. నటుడు కావాలనే ఆయన సంకల్పం, ఆయన మనస్తత్వం ఆయన గొప్ప శిఖరాలకు చేరుకోవడానికి దోహదపడింది. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత, చిరంజీవిఅవకాశాన్ని ఉపయోగించుకుని, తీవ్ర కృషి, దృఢ సంకల్పంతో ఆ శూన్యాన్ని పూరించడం ద్వారా చిత్ర పరిశ్రమలో ఎదిగారు. సామాజిక సేవ చేయాలన్న గొప్ప ఆలోచనతో ముందుకు వచ్చిన మొదటి నటుడు చిరంజీవి. నేను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, చిరంజీవిని క్రమం తప్పకుండా కలిసేవాడిని. ఆ సమావేశాలలో ఒకదానిలో, బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు భూమి కేటాయించమని ఆయన నన్ను కోరారు. సినిమా నటులు సినిమాను దాటి ఆలోచించి ప్రజా సేవపై దృష్టిపెట్టడం చాలా అరుదు. కానీ అలాంటి చొరవ తీసుకున్న మొదటి నటుడిగా చిరంజీవి నిలిచారు అని అన్నారు. మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ, డాక్టర్ శరణి నన్ను ఈ ప్రారంభోత్సవానికి ఆహ్వానించినప్పుడు చాలా ఆనందమేసింది. వ్యక్తిత్వ వికాసంపై పుస్తకాల పట్ల నాకు ఎప్పుడూ ఆసక్తి ఉంటుంది. ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేస్తారు, కానీ తెలివిగా పనిచేయడం, సరైన మనస్తత్వాన్ని పెంపొందించుకోవడం తేడాను కలిగిస్తుంది. ఈపుస్తకం అంతా దాని గురించే. నా గ్రాడ్యుయేషన్ తర్వాత నాకు కెరీర్ మీద ఒ స్పష్టత లేదు. కానీ చిన్న ప్పటి నుంచి నటన పట్ల నాకున్న మక్కువ నా మార్గాన్ని కనుగొనడంలో నాకు సహాయపడింది. విమర్శలు, ప్రతికూల స్పందనలు ఎదురైనప్పటికీ ఒకే లక్ష్యం, అంకితభావంతో ముందుకు సాగాను. నటనలో కెరీర్‌ను కొనసాగించాలనే నా ప్రణాళికలను నా తల్లిదండ్రులకు వెల్లడించినప్పుడు వారు నా నిర్ణయానికి మద్దతు ఇచ్చారు. అంతేకాకుండా బ్యాకప్‌గా మరొక కోర్సును అనుసరించమని కూడా నాకు సలహా ఇచ్చారు. అప్పుడే నేను ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌తో పాటు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియాలో చేరాను. కొంతకాలం పాటు రెండింటినీ సమతుల్యం చేసు కోగలిగాను. కానీ చివరికి, నటనే నా నిజమైన ప్రేమ అని నేను గ్రహించాను. ఉంటే సినిమా పరిశ్రమలో ఉండాలి లేకుంటే ఎక్కడా ఉండొద్దు అని నిర్ణయించుకున్నాను.

# ‘కలియుగమ్ 2064’ ట్రైలర్ లాంచ్

జెర్సీ కృష్ణ అండ్ హిజ్ లీల డాకు మహారాజ్ వంటి సూపర్ హిట్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన హీరోయిన్ శ్రద్ధా శ్రీనాథ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన సైన్స్ ఫిక్షన్ అండ్ అడ్వెంచరస్ థ్రిల్లర్ మూవీ కలియుగమ్ 2064. కిషోర్ కీలక పాత్ర పోషించిన ఈ చిత్రాన్ని ఆర్.కె.ఇంటర్నేషనల్ సంస్థపై కె.ఎస్. రామకృష్ణ నిర్మించారు. యంగ్ అండ్ టాలెంటెడ్ ప్రమోద్ సుందర్ దర్శకత్వం వహించారు. ద్విభాషా చిత్రంగా రూపొందిన ఈ సినిమా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ప్రపంచవ్యాప్తంగా మే 9న తమిళ,తెలుగు భాషల్లో ఏకకాలంలో సమ్మర్ కానుకగా విడుదల కాబోతోంది. తెలుగులో ఈ చిత్రాన్ని టాప్ బ్యానర్ అయిన మైత్రి డిస్ట్రిబ్యూషన్ సంస్థ విడుదల చేస్తుంది. ఇప్పటికే మణిరత్నం లాంచ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌కి విశేషాదరణ లభించింది. ఇక విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ సభ్యులు ప్రచార కార్యక్రమాలు వేగవంతం చేశారు. ఇందులో భాగంగా ట్రైలర్ ను సెన్సేషనల్ దర్శకుడు రాంగోపాల్ వర్మ చేతుల మీదుగా లాంచ్ చేశారు. ట్రైలర్ లాంచ్ అనంతరం దర్శకుడు రాంగోపాల్ వర్మ మాట్లాడుతూ.. ఇప్పుడే కలియుగమ్ 2064 ట్రైలర్ చూశాను. చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. ఆబ్సోల్యూట్లీ ఒక ఫ్యూచరిస్టిక్ ఎక్స్పీరియన్స్ కలిగింది. ఫోటోగ్రఫి,క్యారెక్టర్స్ డిజైన్. ఆర్టిస్టుల పెర్ఫార్మన్స్.. ఇలా అన్నీ ఒక మోడరన్ కైండ్ ఆఫ్ బుక్ చదివిన ఫీలింగ్ ఇచ్చాయి. మే 9న థియేటర్లలో రిలీజ్ అవుతుంది. అందరూ తప్పకుండా చూడండి. ఈ సందర్భంగా చిత్ర బృందానికి నా బెస్ట్ విషెస్ చెబుతున్నాను అంటూ తెలిపారు. ఇక కలియుగమ్ 2064 ట్రైలర్ విషయానికి వస్తే భవిష్యత్తులో ముఖ్యంగా 2064 లో వచ్చే విపత్కర పరిస్థితుల్లో మనుషులు మనుగడ కోసం చేసే పోరాటాన్ని ప్రధానంగా చూపించారు. ఆహారం, నీరు, మానవత్వం అనేవి కరువైనప్పుడు విచక్షణ జ్ఞానం కోల్పోయి మనుషులు ఎలాంటి ఘోరాలకి పాల్పడ్డారు? అనే థీమ్‌తో కలియుగంలోని పౌరాణిక ఇతివృత్తాలను గుర్తుచేస్తూ ఈ చిత్రాన్ని రూపొందించారు. విజువల్ ఎఫెక్ట్స్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అన్ని ప్రేక్షకులను ఒక కొత్త ప్రపంచంలోకి తీసుకువెళ్ళే విధంగా ఉన్నాయి.ముఖ్యంగా పి.సి.శ్రీరామ్ శిష్యుడు కె.రాంచరణ్ అందించిన సినిమాటోగ్రాఫి టాప్ నాచ్‌లో ఉంది. కచ్చితంగా ఈ సినిమా ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని కలిగిస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు చిత్ర యూనిట్ సభ్యులు.

నటీనటులు: శ్రద్ధా శ్రీనాథ్, కిషోర్, ఇనియన్ సుబ్రమణి, హ్యారీ తదితరులు

సాంకేతిక నిపుణులు: బ్యానర్: ఆర్. కె. ఇంటర్నేషనల్, నిర్మాత: కె. యస్. రామకృష్ణ

రచన, దర్శకత్వం: ప్రమోద్ సుందర్

డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: కె. రామ్ చరణ్

ఎడిటర్: నిమల్, సంగీత దర్శకుడు:డాన్ విన్సెంట్, ఆర్ట్ డైరెక్టర్: శక్తి వెంకట్రాజు

డిజిటల్: బజ్ బాస్కెట్, సౌండ్ డిజైన్: తపస్ నాయక్.



# మే 2వ వారంలో ‘ఎర్రచీర’..

ప్రముఖ నటుడు రాజేంద్ర ప్రసాద్ మనవరాలు బేబీ సాయి తేజస్విని ప్రధాన పాత్ర పోషించిన చిత్రం ఎర్రచీర. ది బిగినింగ్ అనేది ట్యాగ్ లైన్. సుమన్ బాబు స్వీయ దర్శకత్వంలో నిర్మించడమే కాకుండా ఇందులో కీలక పాత్రను పోషించారు. మదర్ సెంటిమెంట్, హారర్, యాక్షన్ బ్యాక్ డ్రాప్‌తో రూపుదిద్దుకున్న ఈ సినిమా 25 ఏప్రిల్‌లో రిలీజ్ కావాల్సి ఉంది. అయితే పలు సాంకేతిక కారణాలతో విడుదల వాయిదా పడింది. ఇప్పుడీ సినిమాను వేసవి కానుకగా మే రెండో వారంలో విడుదల చేయబోతున్నట్టు దర్శక నిర్మాత సుమన్ బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ, ఈ నెల 25న రిలీజ్ కావాల్సిన ఎర్రచీర కొన్ని టెక్నికల్ కారణాలతో వాయిదా పడింది. మే నెలలో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకుని రావడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాం. కంటెంట్ మాత్రం ఖతర్నాక్‌గా ఉంటుంది. కామెడీ, హారర్, మదర్ సెంటిమెంట్, యాక్షన్ అన్నీ కలగలిపి ఎక్కడా బోర్ కొట్టకుండా సిద్ధం చేసుకున్నాం. సినిమా చూసి బయటకు వెళ్లే ప్రేక్షకులు కన్నీళ్లు పెట్టుకుని బయటికి వెళ్తారు అని చెప్పగలను. సెన్సార్ సభ్యులు కూడా సినిమా చూసి అభినందించారు. భలే సినిమా చేశారని అన్నారు. ఈ సినిమాకి ఒక కాంటెస్ట్ అనౌన్స్ చేస్తున్నాం. సినిమా కథ కరెక్టుగా రిలీజ్‌కి ముందు గెస్ చేస్తే ఐదు లక్షలు ప్రైజ్ మనీ ఇస్తాం. 8019246552 నంబర్‌కి కరెక్ట్ కథ చెప్పినవారికి ప్రీ రిలీజ్ ఈవెంట్ లో ఐదు లక్షలు ఇవ్వడం జరుగుతుంది అని అన్నారు.



# సుధీర్ అత్తవర్ మూవీ ‘కొరగజ్జ’

త్రివిక్రమ సినిమాస్, సక్సెస్ ఫిల్మ్స్ బ్యానర్‌పై సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత సుధీర్ అత్తవర్ దర్శకత్వం వహించిన చిత్రం కొరగజ్జ. కర్ణాటక, కేరళలోని కరావళి (తులునాడు) ప్రాంతంలో, ముంబైలోని కొన్ని ప్రదేశాలలో పూజించబడే ప్రధాన దేవత కొరగజ్జ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. సుధీర్ అత్తవర్‌తో కలిసి పనిచేస్తున్న మ్యూజిక్ డైరెక్టర్ గోపీ సుందర్ ఈ ప్రాజెక్ట్‌ను ఓ ప్రత్యేక అనుభవంగా చెబుతున్నారు. ఈ చిత్రంతో తాను మ్యూజిక్‌లో సరికొత్త ప్రయోగాల్ని చేశానని తన వర్క్ ఎక్స్‌పీరియెన్స్ గురించి పంచుకున్నారు. ఈ చిత్రానికి సంగీతం కంపోజ్ చేయడానికి ఎంతో రీసెర్చ్ చేయాల్సి వచ్చింది. సంగీతంలో కొత్త ప్రయోగాల్ని చేయాల్సి వచ్చింది. గత చరిత్రను తెలుసుకోవాల్సి వచ్చింది. అందుకే కాస్త ఎక్కువ సమయం పట్టింది. నాటి ఆచారాలను, సంప్రదాయాల్ని అర్థం చేసుకున్న తర్వాత నాకు ఈ ట్యూన్స్ వచ్చాయి. దర్శకుడికి నా పని నచ్చినందుకు, నేను ఇచ్చిన మ్యూజిక్ నచ్చినందుకు సంతోషంగా ఉంది. కొరగజ్జ కథాంశం కొత్త సంగీతాన్ని అన్వేషించడానికి, కొత్త శైలిని కనిపెట్టడానికి నాకు వీలు కల్పించింది. ఈ చిత్రం నాకు ఎంతో సవాలుగా అనిపించింది అని అన్నారు. ఈ చిత్రంలో ఆరు పాటలు ఉంటాయి, వీటిని వివిధ శైలి, భాషల్లో స్వరపరిచారు. ఈ పాటలకు సుధీర్ అత్తవర్ స్వయంగా సాహిత్యం అందించారు. ఈ చిత్రంలో శ్రేయ ఘోషల్, సునిధి చౌహాన్, శంకర్ మహదేవన్, జావేద్‌అలీ, స్వరూప్ ఖాన్, అర్మాన్‌మాలిక్ వంటి ప్రతిభావంతులైన గాయకులు పాటలు పాడారు. కాంతార సినిమా కంటే ఎంతో భిన్నంగా ఉంటుందని దర్శకుడు వెల్లడించారు. వేల దేవతలకు నిలయమైన కర్ణాటక, కేరళ గొప్ప సాంస్కృతిక వారసత్వంలో కాంతార ఒకరిని మాత్రమేచూపించింది. దీనిపై ఇపి శ్రీ విద్యాధర్ శెట్టి సహాయంతో దర్శకుడు సుధీర్ అత్తవర్ పరిశోధన చేశారు. కాంతార తర్వాత ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం మల్టీ లాంగ్వేజెస్‌లో విడుదల కానుంది. ఇందులో కబీర్ బేడి, ప్రఖ్యాత కొరియోగ్రాఫర్లు సందీప్ సోపార్కర్, గణేష్ ఆచార్య, దక్షిణాది అగ్ర నటులు భవ్య, శ్రుతి మరెంతో అద్భుతమైన సమిష్టి తారాగణం పని చేసింది. మనోజ్ పిళ్ళై సినిమా టోగ్రఫీ, జిత్ జోషి, విద్యాధర్ శెట్టి ఎడిటింగ్, బిబిన్ దేవ్ సౌండ్ డిజైనింగ్, మూడుసార్లు కేరళ రాష్ట్ర అవార్డు గెలుచుకున్న డిఐ కలరిస్ట్ లిజు ప్రభాకరన్ డిఐ, లవన్ కుషన్ విఎఫ్ఎక్స్ గ్రాఫిక్స్ వంటి అసాధారణ సాంకేతిక బృందం ఈ చిత్రానికి పని చేసింది. ఇక ఈ మూవీ ఆడియో రైట్స్ కోసం భారీ రేటుని చెల్లించేందుకు పెద్ద కంపెనీలు పోటీ పడుతున్నాయి.



# మే 17న ‘టామ్ క్రూయిస్ మిషన్:ఇంపాజిబుల్’

పారామౌంట్ పిక్చర్స్ ఇండియా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మిషన్: ఇంపాజిబుల్ ది ఫైనల్ లెక్కింపు ఇప్పుడు మే 17, 2025, శనివారం షెడ్యూల్ కంటే 6 రోజుల ముందుగానే (మే 23) థియేటర్లలోకి వస్తుందని ప్రకటించడంతో, ఐకానిక్ ఫ్రాంచైజీ అభిమానులు ఇప్పుడు ఈథన్ హంట్ యొక్క చివరి మిషన్‌ను పెద్ద స్క్రీన్‌పై చూడటానికి ఎక్కువసేపు వేచి ఉండాల్సిన అవసరం లేదు. ఫ్రాంచైజ్ యొక్క ట్రేడ్‌మార్క్ అడ్రినలిన్ మరియు హృదయంతో, ది ఫైనల్ లెక్కింపు ఒక చివరి మిషన్, ఎపిక్ స్కేల్, భావోద్వేగ పందాలు మరియు ఎడ్జ్ ఆఫ్‌యువర్‌సీట్ థ్రిల్స్‌తో నిండి ఉంటుంది, ఇది మిషన్: ఇంపాజిబుల్ మాత్రమే అందించగలదు. ఇది నిజంగా అభిమానులు ఎదురు చూస్తున్న వీడ్కోలు. పారామౌంట్ పిక్చర్స్ మరియు స్కైడాన్స్ టామ్ క్రూజ్ ప్రొడక్షన్‌లో క్రిస్టోఫర్ మెక్‌క్వారీ దర్శకత్వం వహించిన మిషన్: ఇంపాసిబుల్ ది ఫైనల్ రికకింగ్. ఈ యాక్షన్ జగ్గర్‌నాట్ లో హేలీ అట్వెల్, వింగ్ రేమ్స్, సైమన్ పెగ్, ఎసై మోరల్స్, పోమ్ క్లెమెంటీఫ్, హెన్రీ క్జెర్నీ, ఏంజెలా బాసెట్, హోల్ట్ మెక్‌కాలనీ, జానెట్ మెక్‌టీర్, నిక్ ఆఫర్‌మాన్, హన్నా వాడింగ్ హామ్,ట్రామెల్ టిల్‌మాన్, షియా విఘం, గ్రెగ్ టార్జాన్ డేవిస్, చార్లెస్ పార్నెల్, మార్క్ గాటిస్, రోల్ఫ్ సాక్సన్ మరియు లూసీ తులుగార్జుక్ వంటి పవర్ హౌస్ సమిష్టి ఉంది. శనివారం, మే 17, 2025న మిషన్: ఇంపాసిబుల్ ది ఫైనల్ రికనింగ్ ఇంగ్లీష్, హిందీ, తమిళం తెలుగులో విడుదలకు సిద్ధమైంది. ప్రేక్షకులకు చక్కటి ఎడ్వంచర్ ఇవ్వనుంది.



# ‘ప్రేమంటే’ థ్రిల్లింగ్ షెడ్యూల్ పూర్తి

ఎక్సయిటింగ్ లైనప్‌తో అలరిస్తున్న ప్రియదర్శి, రానా దగ్గుబాటి, జాన్వీ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు క్రేజీ కొలాబరేషన్‌లో చేస్తున్న సినిమా ప్రేమంటే. థ్రిల్‌యూ ప్రాప్తిరస్తు అనేది ట్యాగ్‌లైన్. ట్యాలెంటెడ్ యాక్టర్ ఆనంది, ప్రముఖ యాంకర్ సుమ కనకాల ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ తో నవనీత్ శ్రీరామ్ డైరెక్టర్‌గా డెబ్యు చేస్తున్నారు. ప్రతిష్టాత్మక టైమ్స్ పవర్ ఉమెన్ 2024 అవార్డు గ్రహీతగా గుర్తింపు పొందిన తర్వాత జాన్వి నారంగ్ ఫస్ట్ ప్రొడక్షన్ వెంచర్ ఇది. తాజాగా ఈ చిత్రం థ్రిల్లింగ్ షెడ్యూల్ పూర్తి చేసుకుంది. ప్రధాన తారాగణం పాల్గొన్న ఈ షెడ్యూల్ చాలా కీలకమైన సన్నివేశాలు చిత్రీకరించారు. నారాయణ్ దాస్ నారంగ్ ఆశీస్సులతో, ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పి బ్యానర్ల పై నిర్మిస్తున్నారు, స్పిరిట్ మీడియా దీనిని సమర్పిస్తోంది. ఈ చిత్రం ఎక్సయిటింగ్ సినిమా ఎక్స్ పీరియన్స్ అందించబోతోంది. ట్యాలెంటెడ్ టెక్నీషియన్స్ ఈ చిత్రానికి పని చేస్తున్నారు. విశ్వనాథ్ రెడ్డి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నారు, అన్వర్ అలీ ఎడిటర్.

నటీనటులు: ప్రియదర్శి, ఆనంది, సుమ కనకాల,

సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: నవనీత్ శ్రీరామ్, నిర్మాతలు: జాన్వీ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు, సమర్పణ: రానా దగ్గుబాటి

బ్యానర్లు: ఎస్‌విసిఎల్‌ఎల్‌పి, స్పిరిట్ మీడియా

పీఆర్వో: వంశీ శేఖర్

మార్కెటింగ్: హ్యాష్‌ట్యాగ్ మీడియా.






# ‘బ్రోమాన్స్’ స్ట్రీమింగ్

ఇటీవల థియేటర్స్‌లో విడుదలై ప్రేక్షకాదరణ పొందిన హాస్యభరిత చిత్రం బ్రోమాన్స్ ఇప్పుడు ప్రముఖ ఓటీటీ మాధ్యమం సోనీ లివ్‌లో మే 1 నుంచి సోనీ లివ్‌లో ప్రత్యేకంగా స్ట్రీమింగ్ కానుంది. హాస్యం, యాక్షన్, డ్రామా, స్నేహంపై, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగ సన్నివేశాలతో ఈ మలయాళ సినిమా తెరకెక్కింది. థియేటర్స్‌లో ఈ సినిమాను చూడలేక పోయినవారు ఆ మ్యాజిక్‌ను ఇప్పుడు మీ ఇంట్లోనే చూసి ఆస్వాదించవచ్చు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు అరుణ్ డి.జోస్ మాట్లాడుతూ బ్రోమాన్స్ చిత్రాన్ని థియేటర్స్‌లో వీక్షించి తమ ప్రేమాభిమానాలను అందించిన ప్రేక్షకులను ఎప్పటికీ మరచిపోలేను. ఇది అందరి హృదయాలను హత్తుకున్న ఫ్రెండ్ షిప్ స్టోరి. చక్కటి డ్రామా, సస్పెన్స్ వంటి చాలా ఎలిమెంట్స్‌ను ఇందులో మనంచూడొచ్చు. అందుకనే ప్రేక్షకులకు సినిమా ఎంతగానో నచ్చింది. కనిపించకుండా పోయిన ఓ స్నేహితుడిని వెతికే స్నేహితుల కథ. మే 1నుంచి సోనీ లివ్‌లో స్ట్రీమింగ్ కానుండం ఆనందంగా ఉంది. దీంతో ఈ చిత్రం మరింత మంది ప్రేక్షకుల హృదయాలను ఆకట్టుకుంటుం దనటంలో సందేహం లేదు అన్నారు. అరుణ్ డి.జోస్ దర్శకత్వంలో తెరకెక్కిన బ్రోమాన్స్ చిత్రం బింటో అనే యువకుడి కోణంలో కథ నడుస్తుంది. అతను తన సోదరుడి స్నేహితులతో కలిసి కనిపించకుండా పోయిన తన సోదరుడిని వెతకటానికి ప్రయత్నిస్తాడు. కథంతా ఒరాత్రిలోనే జరుగుతుంది. ఊహించని ట్విస్టులు, మరచిపోలేని జ్ఞాపకాలతో నిండిన ప్రయాణంగా అందరినీ సినిమా మెప్పిస్తుంది. అరుణ్ డి.జోస్, రవీష్ నాథ్, థామస్ పి.సెబాస్టియన్ రాసిన ఈ కథను అషిక్ ఉస్మాన్ నిర్మించారు. ఇందులో అర్జున్ అశోకన్, భరత్ బోపన్న, శ్యామ్ మోహన్, మహిమ నంబియార్, మాథ్యూ థామస్, కలభవన్ షాజోన్ వంటి ప్రతిభావంతులైన నటీనటులు నటించారు.



# ఎక్సలెంట్ క్వాలిటీతో ‘చౌర్య పాఠం’

బ్లాక్ బస్టర్ డైరెక్టర్ త్రినాథ రావు నక్కిన తన అప్ కమింగ్ క్రైమ్‌కామెడీ డ్రామా చౌర్య పాఠంతో మూవీ ప్రొడక్షన్ అడుగుపెడుతున్నారు. యంగ్ ట్యాలెంటెడ్ ఇంద్రా రామ్‌ను హీరోగా పరిచయం చేస్తున్నారు. కార్తికేయ 2 మొదలైన చిత్రాలకు చందూ మొండేటి వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేసిన నిఖిల్ గొల్లమారి ఈ మూవీతో దర్శకునిగా పరిచయం అవుతున్నారు. నక్కిన నెరేటివ్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ మూవీకి వి చూడమణి సహ నిర్మాత. ఈ చిత్రం టీజర్ ట్రైలర్ థ్రిల్లింగ్ క్రైమ్, డార్క్ హ్యూమర్ బ్లెండ్‌తో ఇప్పటికే బజ్ క్రియేట్ చేసింది. సాంగ్స్ సూపర్ హిట్‌అయ్యాయి. సమ్మర్‌లో వన్ అఫ్ ది బిగ్గెస్ట్ అట్రాక్షన్‌గా చౌర్య పాఠం ఏప్రిల్ 25న థియేటర్లలోకి రాబోతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత త్రినాథరావు నక్కిన విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**ఈ సినిమాని నిర్మించడానికి ఈ కథలో మిమ్మల్ని ఆకట్టుకున్న అంశాలు ఏమిటి?** కార్తిక్ ఘట్టమనేని ఫాదర్ డిపార్ట్మెంట్‌లో వర్క్ చేశారు. ఆయన సర్వీస్‌లో ఉన్నప్పుడు ఓ చిలిపి దొంగతనం కేసు జరిగింది. ఆ సంఘటన గురించి కార్తిక్ చెప్పినప్పుడు చాలా ఇంట్రస్టింగ్‌గా అనిపించింది. ఇది సినిమాగా చేయమని కార్తిక్‌ని అడిగాను. తను సరే అన్నాడు. అలా ఈ సినిమా చేయడం జరిగింది. ఆ కేసుని యధావిధిగా తీసుకోలేదు. దాన్ని స్ఫూర్తిగా తీసుకొని పూర్తి సినిమాటిక్‌గా చేయడం జరిగింది.

**హైస్ట్ సినిమాలకి బడ్జెట్ ఎక్కువ అవుతుంది కదా?** అవును. మామూలు సినిమాలు కంటే హైస్ట్ సినిమాలు తీయడం ఖర్చుతో కూడుకున్న పని. మేము అనుకున్నదాని కంటే ఒక పదిశాతం బడ్జెట్ పెరిగింది. కంపనీ నుంచి వస్తున్న తొలి సినిమా. ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా మంచి క్యాలిటీతో తీశాం. అందులోనూ కార్తిక్ లాంటి డీవోపీ వున్నప్పుడు టెక్నికల్ గా చాలా యాడ్ ఆన్స్ వుంటాయి. సినిమా అవుట్ పుట్ ఎక్సలెంట్ క్యాలిటీతో వచ్చింది.

**హీరో ఇంద్ర రామ్ గురించి?** ఇంద్ర రామ్ కొత్త అబ్బాయి. మొదట్లో నేను కాస్త భయపడ్డాను. వర్క్ షాప్ చేశాం. సెట్స్‌పైకి వెళ్ళిన తర్వాత కూడా చిన్న భయం ఉండింది. అయితే రెండు రోజుల తర్వాత క్యారెక్టర్ పట్టేశాడు. అద్భుతంగా చేశాడు. తనే కాదు ఇందులో ప్రతి ఒక్కరూ చాలా చక్కగా పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. ఇందులో క్యారెక్టర్స్ తప్పా ఆర్టిస్టులు కనిపించరు. అంత సహజంగా పాత్రల్లో ఒదిగిపోయారు.

**డైరెక్టర్ నిఖిల్ గురించి?** నిఖిల్‌ని కార్తికేయ షూటింగ్‌లో చూశాను. చాలా యాక్టివ్‌గా వర్క్ చేస్తాడు. ఈ సినిమాకి డైరెక్టర్ ఎవరు అనుకున్న సమయంలో కార్తిక్.. నిఖిల్ పేరు చెప్పాడు.


నిర్మాత త్రినాథరావు నక్కిన

# ఖర్చు లెక్కలకు యాప్

పొదుపు చేయాలని ప్రతి ఒక్కరికి ఉంటుంది. ఇంటిపరిస్థితులు, చేసే ఉద్యోగం, వచ్చే జీతం, ఇంట్లో మనుషులు ఇవన్నీ అనుకూలంగా ఉంటే ఎంతో కొంత పక్కనపెట్టవచ్చు. ఏ పరిస్థితి ఎప్పుడు వస్తుందో చెప్పలేని నేటి రోజులలో ఎంతో కొంత దాచి పెట్టుకోవడం ఎంతో మేలు. అనుకోవడం సులభమే ఆచరణలో పెట్టడం కష్టమైన పనే. అయినప్పటికీ చేయాలన్న సంకల్పం ఉండాలి. అందుకు తగిన నిర్ణయాలు తీసుకుని కఠినంగానైనా ఆచరణలో పెడితే మంచిదే. జీతం ఏ రోజు వస్తుందో ఆ రోజే సేవింగ్స్, ఇన్వెస్ట్‌మెంట్లకు ఆటోమేటిక్‌గా డబ్బులు వెళ్లేలా సెట్ చేసుకోవాలి. డబ్బు కనిపిస్తూ, ప్రత్యేకంగా దాచాలి అంటే ఇబ్బందే. అనుకోకుండానే దేనికో ఓ దానికి డబ్బులు పోతుంటాయి. ఉన్నవాటిని చక్కగా ఖర్చుపెట్టుకోవచ్చు. నచ్చినవన్నీ చేసేయాలన్న ఆలోచన మంచిదే కానీ, అనవసరంగా కొనడం వృధానే కదా! అందుకే ఎంత నచ్చినా అప్పటికప్పుడు కొనొద్దు. 24 గంటలు నియమం పెట్టుకోవాలి. ఒకరోజు తరువాత తప్పనిసరి అనిపిస్తేనే కొనాలి. ఈ తీరు ఇంపల్సివ్ స్పెండింగ్‌కి అడ్డుకట్ట వేస్తుంది. ఈ చిన్న బ్రేక్‌లు చాలానే ఆదా చేయగలవు. పెట్టుబడికోసం ముహూర్తాలు చూసు కూర్చోవద్దు. రోజుకు ఎంతో కొంత చిన్న పొదుపు లేదా ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్ చేసుకోవాలి. చిన్న మొత్తాలు, పెద్ద పొదుపు మాట వినే ఉంటారు. తెలియ కుండానే కొంతమొత్తం పక్కన పెట్టినట్లు అవుతుంది. జీతమొచ్చి పది రోజులైనా అవదు. ఖాతా ఖాళీ అవుతుంద



నిపిస్తుంది. పైగా ఇప్పుడున్నవన్నీ ఆన్‌లైన్ పేమెంట్లే. కొనడం చకచకా డబ్బులు కట్టేయడం. ఏ రూపాయి ఎటు వెళుతుందో లెక్క ఉండదు. ఈసారి నుంచి ఎక్కడ ఎంత ఖర్చు పెడుతున్నాము అన్నది లెక్కరాసుకోవాలి. లేదా సంబంధిత యాప్‌ను వాడినా సరే. ఎక్కడ ఖర్చు అవుతుందో తెలిస్తే దానికి అడ్డుకట్ట వేయడం సులువవుతుంది. అది కూడా పొదుపు చేసినట్లే. పొదుపు అంటే ఆశలకు కళ్లెం వేయడమే అని భావిస్తారు. అందుకే భవిష్యత్తుపై బెంగ మాని ఈ రోజు కోసమే ఆలోచిస్తున్నారు. బలవంతంగా చేస్తే కదా బెంగ. గిల్ట్ ఫ్రీ నగదు పక్కన పెట్టుకోవాలి. దాంతో నచ్చివన్నీ చేసుకోవచ్చు. అయితే నెలకు ఎంత కేటాయించారో అంత మొత్తంలోనే ఎంజాయ్ చేయాలి మిగతాది పొదుపు చేయాలి. ఇలా ప్లాన్ చేసుకుంటే ఏదీ ఇబ్బందిగా ఉండదు. నచ్చినట్లు జీవించడం అన్నది మంచి విషయం. కానీ భవిష్యత్తుకి అందులో చోటివ్వాలి. అప్పుడే ఆర్థిక భద్రత, జీవితాన్ని ఎంజాయ్ చేయవచ్చు.

ఆధ్యాత్మికం

# వరూధినీ ఏకాదశి

చైత్రశుద్ధ ఏకాదశినే వరూధినీ ఏకాదశి అంటారు. అన్ని ఏకాదశులూ విష్ణువును ఆరాధిస్తే, వరూధినీ ఏకాదశి మాత్రం విష్ణుమూర్తియొక్క అయిదవ అవతారమగు వామనావతారమూర్తిని ఆరాధించడం జరుగుతుంది. వరూధినీ ఏకాదశి మహాత్మ్యం గురించి శ్రీకృష్ణుడు ధర్మరాజుకు వివరించినట్లు భవిష్య పురాణంలో చెప్పబడింది. వెంటాడే మృత్యువు నుంచి కూడా తప్పించగలిగేది, దురదృష్టాన్ని సైతం అదృష్టంగా మార్చి చచ్చుబడిన కాళ్లలో సైతం చైతన్యాన్ని నింపి నడిపించగలిగేంతటి గొప్పరోజని చెప్పబడింది. మహాశివుని శాపమునుంచి ఇక్ష్వాకు రాజైన దుందునారుడు విముక్తిని పొందాడని, ప్రతియొక్క మనిషీ ఈ వ్రత మహాత్మ్యంతో ఈ జన్మకే కాక మరుజన్మలో సైతం పుణ్యఫలితాన్ని కలిగి ఉంటాడని ప్రతీతి. ముందురోజున రోజంతా ఉపవాసముండి లేదా ఒక్కపూట మాత్రము ఫలహారం చేసిగానీ హవిస్సును యజ్ఞమందు సమర్పిస్తారు. దానివల్ల వరూధిని సూచించినట్లు హానికరమైన, దురదృష్టకరమైన కష్టాల నుంచి కుంటూ బయటపడగలిగే మార్గమని భావిస్తారు. ఈ వ్రతం ఎక్కువగా ఉత్తరభారతంలోప్రసిద్ధమైంది. వరూధినీ ఏకాదశిరోజున మాంసాహారం, జూదము, దొంగతనం, చాడీలు, కోపం, నిద్ర, క్షురకం, నూనెతో తలంటుకోవటం లాంటి పనులు నిషిద్ధం. అలాగే శక్తికొద్దీ గుర్రము, ఏనుగు,భూమి, నువ్వులు, గింజధాన్యం, బంగారం, కన్యాదానం, గోదానం, విద్యాదానం వంటివి చేయడం వల్ల విశేషఫలితం పొందగలరు. కొత్త భాషలు నేర్వటమో, కొత్త ఆటలు నేర్పటమో, మంచి సంగీతం, సాహిత్యం, వంటకం, నాట్యం లాంటివి ఏదో ఒక ఉపయోగపడే విషయంలో ధ్యాసను మళ్లించేలా పెద్దవాళ్ల ప్రయత్నిస్తే అదీ ఒక విధమైన విద్యనే అవుతుంది. దానివల్ల యజ్ఞయాగాదులు చేయకపోయినా పరిజ్ఞానం మాత్రం వస్తుంది. విజ్ఞానం మీద ఆసక్తి కలిగిన పిల్లలు భావితరానికి ఎంతో అవసరం. విద్యార్జన మరియు విద్యా దానం రెండూ కూడా పవిత్రమైన ఉద్దేశంతో కూడిన యజ్ఞాలే. దానివల్ల పొందే జ్ఞానమే హవిస్సు. అటువంటి హవిస్సును సమాజమంతా విస్తరించిన దైవస్వరూపమగు కార్యములకోసం వినియోగిస్తూ మరింత మందికి మేలు చేకూర్చడం ఫలమే కదా. దానివల్ల వచ్చే కష్ట నష్టములు ఏమీ ఉండవు. ఇంకా జ్ఞానం పెరగటం వల్ల క్లిష్టసమయాలలో తట్టుకునే శక్తి, సామర్థ్యాలు, సమస్యలతో పోరాడి గెలవగల నైపుణ్యం, పరిష్కారమార్గం వంటివి కూడా జరిగి సమస్త ప్రజానీకానికి మంచే జరుగుతుంది. అందువల్ల ఇదో హైందం సంప్రదాయ వ్రతంగా కాకుండా సంక్షేమ సూత్రంగా భావించి ఆచరిస్తే మానసిక ఉల్లాసం కలుగుతుంది.

- దేగల అనితాసూరి

# హెపాటిక్ క్షయ(హెచ్‌టిబి)

ఆరోగ్య భాగ్యం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

లివర్ అనేది శరీరంలోని అన్ని గ్రంథులకన్నా పెద్దది. ఇది ముఖ్యమైన అవయవం. ఇది ఉదరంలో కుడి వైపున ఉంటుంది. ఇది ఆహారంలో అధిక చక్కరలు లివర్‌లో నిల్వ ఉంచి అది కొంత శక్తిగా, కొంత కొవ్వుగా మార్చుతుంది. ఇది పైత్య రసాన్ని తయారు చేసి పిత్తాశ యంలో కొవ్వుగా మార్చుతుంది. ఇది పైత్యరసాన్ని తయారు చేసి పిత్తాశయంలో నిల్వ చేయబడి జీర్ణక్రియలో తోడ్పడుతుంది. పైత్య రసవాహిక ద్వారా పైత్యరసం ఆంత్ర మూలంకి చేరుతుంది. లివర్‌కి రక్తాన్ని శుద్ధి చేయడమే గాకుండా, శరీరంలో పేరుకున్న వ్యర్థపదార్థాల్ని బైటికి పంపే శక్తి ఉంటుంది. క్షయవ్యాధి ఒక ఏరోబిక్ బాసిల్లస్ వల్ల వస్తుంది. క్షయ ప్రధా నంగా ఊపిరి తిత్తుల్ని ప్రభావితం చేసినప్పటికి ఇది శరీరంలోని ఏ ఇతర అవయవాల్ని కూడా ప్రభావితం చేసే శక్తి ఉండి ఊపిరితిత్తుల్లో ఆక్సిజన్ అధికంగా ఉండే పరిసరాలలో ఇది చాలా విజయవంతంగా పెరుగుతుంది. ఇది ప్రతి 15-20 గంటలకి విభజన చెంది లివర్‌కి వ్యాపిస్తుంది. దీన్నే లివర్ ట్యూబర్ క్యులోసిస్, హాట్‌లివర్, హెచ్‌టిబి, హెపాటిక్ క్షయ అని అంటారు. ఇది 50-80శాతం మందిలో మిలియరీ టిబి వల్ల, ఎక్స్‌ట్రా పల్మోనరీ టిబి వల్ల వస్తుంది. ఇది అడ్వాన్డ్ పల్మోనరీ టిబి ఉన్నవారిలో 50-80శాతం మందిలో వస్తుంది.

హెపాటిక్ క్షయవ్యాధిని మొదట 18.58లో డాక్టర్ జాన్ సెయిర్ బ్రిస్టోవే అనే ఇంగ్లీష్ ఫిజిషియన్ గుర్తించడమైనది. దీంతో 8.7 మిలియన్ ప్రజలు ప్రపంచ వ్యాప్తంగా బాధ పడుతున్నారు. ప్రతి సంవత్సరం 87,000 కొత్త కేసులు నమోదు అవుతున్నా యంటే దీని తీవ్రత అర్థం చేసుకోవచ్చు. గత 30 సంవత్సరాల్లో వీరి సంఖ్య పెరుగుతూనే ఉంది. హెచ్ఐవి కేసులో 17.6, క్షయవ్యాధి, లివర్‌వ్యాధి కేసుల్లో 26 శాతం మందిలో కన్పిస్తుంది. అభివృద్ధి చెందని దేశాలలో ఇది ఒక ప్రధాన ప్రపంచ ఆరోగ్య సమస్యగా తయారైంది. ఇది చాలా అరుదైన ఎక్స్‌ట్రా పల్మోనరీ టి.బి అని చెప్పవచ్చు. ఇది గ్రామీణ ప్రాంతాల వారిలో అపరిశుభ్ర వాతావరణంలో జనసామర్థ్యమున్న మురికి వాడల్లోని ప్రజల్లో కన్పిస్తుంది. ఇది స్త్రీల కన్నా పురుషుల్లో కన్పిస్తుంది. ఇది యుక్త వయస్కుల్లో 22-70 సంవత్సరాల మధ్య వారిలో కన్పిస్తుంది. అంతే గాకుండా 26శాతం నయం కాని హెచ్ ఐవి రోగుల్లో ఎక్కువగా వస్తుంది. ఇది ఎండమిక్ వెరియాలోను, ఇఆర్, ఇండియా, సౌదీ అరేబియా, టర్కీ, ఆఫ్రికా దేశాల్లో ఎక్కువుగా కన్పిస్తుంది.

**వ్యాప్తి :** ఇది గాలి, రక్తం, వీర్యం, కలుషిత నీరు, సెక్సువల్స్ కాంటాక్ట్ ద్వారా, క్షయరోగులతో సన్నిహితంగా ఉండేవారిలో, లింఫాటిక్ వెసల్స్‌ద్వారా, ట్యూబర్ క్యులస్ లింఫ్‌నోడ్ రప్చర్ కావడం ద్వారా ఇన్ఫెక్షన్ పోర్టల్ ట్రాక్ ద్వారా, బొడ్డు తాడు సిర ద్వారా, ఉమ్మనీటి ద్వారా కూడా వ్యాపిస్తుంది. ఒకరు వాడిన సూదులు బ్లేడులు వస్తువుల ద్వారా కూడా వ్యాపించే అవకాశముంది. ముఖ్యంగా ఊపిరితిత్తులు, జీర్ణకోశం ద్వారా, పోర్టల్ సిర, హైపాటిక్ ఆర్టరీ ద్వారా 21శాతం మందిలో వ్యాపిస్తుంది.

**కారణాలు :** ఇది (ఉదర క్షయ) టిబి, మాదక ద్రవ్యాలు వాడే వారిలో, పొగాకు, అల్కహాలిక్స్‌లో వస్తుంది. స్టీరాయిడ్ ట్రీట్‌మెంట్ తీసుకున్న వారిలో, టైప్ -2 డయాబెటిస్ క్రానిక్ రీనల్ ఫెయిల్యూర్, ఎస్ఎల్ఇ, సార్కాయిడోసిస్, ఫష్ వ్యాధులు, ఆటో ఇమ్యూన్ వ్యాధులున్న వారిలో ఇది కన్పిస్తుంది.

# వేసవిలో స్నానానికి..

రుతువుల ప్రభావం మన చర్మంపై పడుతూ ఉంటుంది. ముఖ్యంగా వేసవిలో వేడికి చర్మం పొడిబారుపోతుంది. దీని వల్ల కొందరికి చర్మం పగిలిపోతుంది. చెమట పొక్కులు వస్తాయి. ఇలాంటి సమస్యలు రాకుండా ఆయుర్వేద శాస్త్ర ప్రకారం ఔషధగుణాలున్న దినుసులతో పిండిని తయరుచేస్తారు. దీని వల్ల రకరకాల చర్మ సమస్యలు తొలగిపోతాయి. ఆ పిండిని ఎలా తయారు చేయాలో చూద్దాం..



కావల్సిన పదార్థాలు : పెసలు (ఒక కేజీ), గంధకచ్చూరాలు (25 గ్రాములు), బావంచాలు (25 గ్రాములు), వట్టివేళ్ల (25 గ్రాములు) ఉసిరి ఒరుగు( 25 గ్రాములు) కస్తూరి పసుపు (50 గ్రాములు), ముద్ద కర్పూరం (25 గ్రాములు), వేపాకు చూర్ణం (10 గ్రాములు) **తయారీ విధానం :** పెసలను బాగా ఎండబెట్టి పిండి పట్టించాలి. ముద్ద కర్పూరం తప్ప మిగిలిన వాటిని ఎండబెట్టుకోవాలి. వీటిని ఒక సన్నటి కన్నాలు ఉన్న వస్త్రంలో వేసి జల్లెడ పట్టాలి. దానిలో మద్ద కర్పూరాన్ని కలపాలి. ఈ మిశ్రమం పెసర పిండిలో కలపాలి. ఇలా తయారైన మిశ్రమంతో స్నానం చేస్తే చర్మం నిగనిగలాడుతుంది. పై చెప్పిన పదార్థాలన్నీ అన్ని ఆయర్వేద షాపుల్లోను లభిస్తాయి.

# ఎగ్ ప్లాంట్

ఎగ్‌ప్లాంట్ (పెద్ద వంకాయ): ఒకటి, టమాట: ఒకటి, పిజ్జా సాస్: అర కప్పు, తురిమిన చీజ్: అర కప్పు, పార్సిమెన్: పావు కప్పు, ఆలివ్స్: పావు కప్పు, ఆలివ్ ఆయిల్: అర కప్పు, కొత్తిమీర తురుము: కొద్దిగా.

**తయారీ విధానం:**
ఎగ్‌ప్లాంట్‌ను కాస్త మందంగా గుండ్రటి ముక్కల్లా కోయాలి. కోసిన ముక్కల్ని ఒక ప్లేట్‌పై పరిచి పైనుంచి ఆలివ్ ఆయిల్ వేసి పదిహేను నిమిషాల పాటు 180 డిగ్రీల వద్ద ఒవెన్‌లో బేక్ చేయాలి. బేక్ అయిన ముక్కలపై పిజ్జా సాస్, చీజ్ తురుము, పార్సిమెన్ వేసి పైనుంచి ముక్కలు చేసిన ఆలివ్స్, సన్నగా, గుండ్రంగా కోసిన టమాట ముక్కలు పెట్టి మరో పదినిమిషాలు బేక్ చేయాలి. చివరగా పైనుంచి కొత్తిమీర చల్లుకుంటే వేడివేడిగా నోరూరించే ఎగ్‌ప్లాంట్ పిజ్జా సిద్ధం.

# వేసవి భత్యం పెంపు లేకపోవడం బాధాకరం

## ముఖ్యమంత్రికి మాజీ మంత్రి జీవన్‌రెడ్డి లేఖ

**హైదరాబాద్,ఏప్రిల్25 ప్రభాతవార్త:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ గ్రామీణ ఉపాధిహామి కూలీలకు వేసవి భత్యం పెంపు విషయంలో ఏ విధమైన నిర్ణయం తీసుకోకపోవడం బాధకరమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో పేర్కొన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామి కూలీల వేతనం రూ.400కు పెంచడంతోపాటు ఎండ తీవ్రత దృష్ట్యా ప్రత్యేకంగా వేసవి భత్యం కూడా ఇవ్వాలని ఆయన సూచించారు. మార్చినెలలో 25శాతం, ఏప్రిల్ మే నెలలో 30శాతం భత్యం అదనంగా వేతనంతోపాటు ఇవ్వాల్సి ఉన్నప్పటికి రోజులు గడుస్తున్నా ఇంకా నిర్ణయం వెలువడలేదని అన్నారు. మార్చినెల నుంచి కూలీలకు భత్యం లెక్కించి విడుదల చేయాలని ఆయన సూచించారు. గత ఏడాది తెలంగాణలో ఎన్ఆర్ఇజిఎస్ కూలీలకు 300రూపాయలు వేతనం చెల్లించగా ఈ యేడాది కేవలం ఏడు రుపాయలు మాత్రమే పెంచి 307రూపాయలు చెల్లించారని అన్నారు. వేసవిలో చెల్లించే కరువు భత్యం సైతం చెల్లించకపోవడతో ఉపాధిహామి కూలీలు చాలీచాలని వేతనంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

ఇప్పటికేనా హర్యానా పంజాబ్ రాష్ట్రాల్లో కూలీలకు రోజువారి కూలీ రేటు రూ.400 చెల్లిస్తున్న అంశాన్ని పరిగణలోకి తీసుకొని తెలంగాణలో కూడా చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంతర్‌రెడ్డికి ఆసిన లేఖలో ఆయన కోరారు.

# ఉపాధి పనులను పరిశీలించిన విదేశీ ప్రతినిధులు



**సదాశివపేట, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం (ఎంజిఎన్ఆర్ఈజిఎస్) కొనసాగుతున్న తీరును పరిశీలించేందుకు ఆయా దేశాలకు చెందిన 25 మంది విదేశీ ప్రతినిధులు సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండల పరిధిలోని సూరారం గ్రామానికి శుక్రవారం చేరుకున్నారు. రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ కమిషనర్ సృజన, అధికారులతో జిల్లాకు ఏరుకున్న విదేశీ ప్రతినిధులను కలెక్టర్ వల్లూరు క్రాంతి స్వాగతం పలికారు. సూరారం గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామి పనులను విదేశీ ప్రతినిధులు పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామి పనులతో గ్రామీణ ప్రాంతా అభివృద్ధి పనులను పరిశీలించి కూలీలతో ముచ్చటించారు. ఉపాధి అవకాశాలు, వేతన చెల్లింపులు, మహిళాల బాగస్వామ్యం లాంటి అంశాలపై సమాచారాన్ని సేకరించారు.పథకం ద్వార గ్రామీణ జీవన విధానంలో చోటుచేసుకున్న మార్పులను గమనించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శ్రాఖ అధికారులు, జిల్లా కలెక్టర్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు విదేశీ ప్రతినిధుల బృందానికి నీటి సంరక్షణ,పల్లె ప్రగతి కింద చేపడుతున్న పనులపై సమాజిక తనిఖీపై వివరించారు. డిజిటల్ మానిటరింగ్ విధానాలు, పారదర్శక చెల్లింపుల వ్యవస్థలు, మహిళల భాగస్వామ్యం అంశాలను విదేశీ ప్రతినిధులు ప్రశంసించారు. ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశంలో లేని ఉపాధి హామి పథకం కేవలం భారత దేశంలో కొనసాగుతుందని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు 100 రోజులు పని కల్పిండం అభినందనీయమన్నారు.

అంతకు ముందు ఉపాధి హామి పథకంలో చేసిన పనులతో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబీషన్‌ను విదేశీ ప్రతినిధులు తిలకించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పి పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి, అడిసనల్ కమిషనర్ శేషు కుమర్, ఎస్పిఎం మురళి, పిడి డిఆర్‌డిఏ జ్యోతి, అదనపు డిఆర్‌డిఓలు బాలరాజు, జంగారెడ్డి, ఎన్జీఓ ప్రతినిధులు వర్ధిని పంచాయితీరాజ్, రెవిన్యూ శాఖల అఐకారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పెహాల్గాం ఉగ్రవాదులను కాల్చి చంపాలి! ముస్లింల ఆందోళన

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 25 ప్రభాతవార్త** కాశ్మీర్‌లోని పహల్గావ్ లో అరాచకం సృష్టించి 28 మందిని పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను కాల్పి చంపాలని మైనారిటి ముస్లింలు శుక్రవారం మధ్యాహ్నం నమాజుల తరువాత నల్లజెండాలు,జాతీయ జెండాను చేతపట్టుకొనినిరసన తెలిపారు. పాకిస్తాన్ టెర్రరిస్టులను పట్టుకొని కాల్పి చంపాలని నినాదాలు చేసారు.పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేసారు.శుక్రవారం మధ్యాహ్నం నమాజుల సందర్భంగా ప్రసంగాల్లో జామియామస్‌జిద్‌లో హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్, నూర్‌ఏమస్‌జిద్‌లో హాఫీజే ఖుర్ ఆన్ మహమ్మద్ అలి దివ్యఖుర్‌ఆన్‌లోని అంశాలను మహమ్మద్ ప్రవక్త సందేశాలను ఉటకిస్తూ ఏ ఒక్కరికి అల్లాహ్ ఇచ్చిన జీవితాన్ని ముగించే హక్కులేదన్నారు. ఒక వేళ ఎవరైనా ఒకరిని వంద మంది చంపితే ఆ వందమందిని చంపెయాలని సూచిస్తుందన్నారు.ఇస్లాం మతం మంచిని కోరుకుంటుంది తప్ప ఉగ్రవాదాన్ని కాదన్నారు. ప్రపంచంలో ముస్లిం మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు.పాలస్తీనాలో శాంతి సౌభా తృత్వం ఉండాలన్నారు. శ్రీకాళహస్తిలోని అన్ని పార్టీలకు చెందిన నాయకులు హాజరు కాగా మైనారిటి ముస్లింలు జామియా మస్‌జిద్ వద్ద సమావేశం అయి సంతాప సూచకంగా నల్లజెండాలను చేతపట్టుకొని మౌన ప్రదర్శన జరిపారు.ఈ సందర్భంగా జామీయా మస్‌జిద్ ముతవల్లి అక్రమ్ సాహెబ్,పేష్ఇమాం రేహాన్ సాహెబ్ వైకాపాకు చెందిన ఇస్మాయిల్,సిఎంపికు చెందిన మస్తాన్ షరీఫ్,అల్తాఫ్,ఉమర్,హమీద్,తాజుద్దీన్,అంజద్‌సాహెబ్,ఫుజయిల్,సుహాయబ్, సుహాయల్‌ల సారధ్యంలో ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. పహల్గావ్ వద్దకు పర్యాటకులుగా వెళ్ళిన వారిని నిర్ధాక్షిణ్యంగా,రాక్షసంగా పొట్టన పెట్టుకున్న పాకిస్తాన్ తీవ్రవాదాదులను పట్టి ఉరి తీయాలన్నారు.

# దిక్కు లేని పశు వైద్యం

## పట్టిపీడిస్తున్న మందుల కొరత - శిథిలావస్థలో భవనాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** తెలంగాణలో పశువుల ఆసుపత్రులు దయనీయం పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. తవివిధ జిల్లాల్లో పశువులకు వైద్య సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయనే విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. నిధులు చాలినన్నినవిడుదల చేయకపోవడంతో ఆసుపత్రులు మొక్కుబడిగా పనిచేస్తున్నాయి. చాలా ఆసుపత్రుల్లో మందుల కొరత తీవ్రంగా ఉంది. ప్రధానంగా వైద్యులు, సిబ్బంది, మందుల కొరత కారణంగా పూర్తి స్థాయిలో చికిత్స అందడం లేదు. ఆవులు, బర్రెలు, మేకలు, గొర్రెలు, ఎద్దులు, గేదెలు తదితర వాటికి ఏదైనా సమస్య వచ్చి వెటర్నరీ ఆసుపత్రులకు తీసుకెళితే అక్కడ మందులు ఉండడం లేదు. హాస్పిటళ్లకు జీవాలను తీసుకెళితే మందులు రాసి బయట కొనుక్కోమని సిబ్బంది చెబుతుండటంతో రైతులపై ఆర్థిక భారం పడుతోంది. అత్యవసర సమయాల్లో సైతం అందచేయాల్సిన మందులు కూడా లేకపోవడంత ప్రైవేటు మెడికల్ షాపులలో కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. కేవలం నట్టల నివారణ మందులు మినహా ఇతర వైద్య సేవలు దాదాపుగా అందుబాటులో లేవని రైతులు చెబుతున్నారు. వివిధ జిల్లాల్లో వెటర్నరీ డాక్టర్లు, ఇతర సిబ్బంది, అటెండర్లు తగినంత మంది లేకపోవడంతో ముఖ్యంగా ఇంటర్నల్ ఏరియాలు, తండాలకు సరైన పశు వైద్యం అందడం లేదని వాపోతున్నారు. రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లాలోని పెద్దపల్లి, గోదావరిఖని, మంథనిలో ఏరియా, 10 ప్రైమరీ, 7 సబ్ సెంటర్లు ఉండగా, 5గురు డాక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. ఈ జిల్లాల్లో 39 వెటర్నరీ హాస్పిటల్స్, సబ్ సెంటర్లు ఉండగా 24 మందే డాక్టర్లు ఉన్నారు. 44 అటెండెంట్ పోస్టులకు 16 మంది మాత్రమే ఉన్నారు. జిల్లాలకు ఏటా అరకొరకగా 17 నుండి 25 లక్షల రూపాయల వరకూ గ్రాంటును ఇస్తున్నా అవి ఏ మూలకూ సరిపోవడం లేదని వైద్యులు అంటున్నారు. జిల్లాలోని చాలా ఆసుపత్రుల్లో యాంటీ బయోటిక్, లివర్ టానిక్‌లు, ఫీడ్ సప్లిమెంట్‌లు, నట్టల నివారణ మందులు దొరకడం లేదని ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా ఆదిలాబాద్ జిల్లాలో 44 పశువుల ఆసుపత్రులు ఉండగా, అందులో 10 వరకూ అసౌకర్యాలతోనే కొట్టుమిట్టాడుతున్నాయి. చాలా చోట్ల ఆసుపత్రులు అద్దె, తాత్కాలిక భవనాల్లో కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని పశు వైద్యశాల భవనం శిథిలావస్తకు చేరుకుని కూలిపోయే పరిస్థితి నెలకొందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది సొంత భవనం అయినా స్లాబు మూడేళ్ల క్రితం కూలిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఐదారు సంవత్సరాల క్రితమే భవనం శిథిలావస్థకు చేరుకున్నా నూతన భవన నిర్మాణం గూర్చి పట్టించుకోవడం లేదు. జిల్లా కేంద్రంలోనే ఈ పరిస్థితి ఉంటే ఇక మండలాలు, ఇతర మారుమూల గ్రామాల్లో ఉన్న పశు వైద్య శాలలు మరింత దయనీయంగా ఉన్నాయి. అలాగే తాండూరు మండలంలోని పశు వైద్యశాల భవనం పూరితగా శిథిలావస్థకు చేరుకోగా ఎప్పుడు కూలుతుందో తెలియని స్థితి ఉంది. నెన్నెల, కన్నెపల్లి, చెన్నూరు మండలాల్లోని పలు గ్రామాల్లో పశు వైద్యశాలలకు సరైన భవనాలు లేవని చెబుతున్నారు. సిబ్బంది విషయానికి వస్తే అరకొర సిబ్బందే గతవుతున్నారు. జిల్లాలోని పశు వైద్య శాలల్లో దాదాపు 10 ఖాళీలు ఉన్నాయి. ఇక గొర్లు, మేకలు తదితర వాటికి ఏదైనా అనారోగ్యం వస్తే ప్రైవేటు మందుల దుకాణంలో కొనుగోలు చేయాల్సి వస్తోందని అంటున్నారు. కొన్నిసార్లు నట్టల మందులు, గాలి కుంటు వ్యాధి నివారణకు అవసరమైన ఇంజక్షన్లు అందుబాటులో లేవంటున్నారు. ఇదేవిధంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పశు వైద్య శాలలు అరకొర సౌకర్యాలతో కొట్టుమిట్టాడుతున్నాయని జీవాల యజమానులు వాపోతున్నారు.

# రాష్ట్రం మీదుగా తిరిగే ఎర్నాకులం - పాట్నా

## ప్రత్యేక రైళ్లు మే వరకు పొడిగింపు

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 25,ప్రభాతవార్త** ప్రస్తుత వేసవి సెలవుల సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ ప్రస్తుతం రాష్ట్రం మీదుగా ఎర్నాకులం-పాట్నా-ఎర్నాకులం మధ్య నడుపుతున్న ప్రత్యేక రైలు సర్వీసులను మే ఆఖరు వరకు పొడిగించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ఎర్నాకులం నుంచి ప్రతి శుక్రవారాల్లో పాట్నాకు బయలుదేరే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌ను మే 30వరకు పాట్నా నుంచి ఎర్నాకులంకు ప్రతి సోమవారం బయలుదేరే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ సర్వీసులను 28నుంచి జూన్ 2 వరకు పొడిగించారు. రాష్ట్రంలో ఈ రైళ్లు గూడూరు, నెల్లూరు, గోలు,బాపట్ల, తెనాలి,విజయవాడ, ఏలూరు, తాడేపల్లి గూడెం,రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, సింహాచలం, పెందుర్తి,కొత్తవలస, విజయనగరం,చీపురుపల్లి,శ్రీకాకుళం,పలస, సోంపేట, ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్లతో పాటు కేరళ, ఝార్ఖండ్, బీహార్ రాష్ట్రాలలోని ముఖ్యమైన స్టేషన్లలో నిలుస్తాయి.

# గిరిజన ప్రాంతాల్లో మలేరియా హాట్ స్పాట్‌లపై ప్రత్యేక దృష్టిపెట్టాలి

## పోస్టర్లను ఆవిష్కరించిన ఆరోగ్య శాఖ స్పెషల్ సియస్ కృష్ణబాబు

**విజయవాడ,ఏప్రిల్25,ప్రభాతవార్తప్రతినిధి:** గిరిజన ప్రాంతాల్లో గుర్తించిన మలేరియా హాట్ స్పాట్‌లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని వైద్య,ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం.టి.కృష్ణబాబు సూచించారు. ఈనెల 25న జరుపుకునే ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా రూపొందించిన పోస్టర్లను ఏపీ సచివాలయంలోని వైద్య,ఆరోగ్య శాఖ కాన్ఫరెన్స్ హాల్లో ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం వంటి గిరిజన ప్రాంతాల్లో గుర్తించిన మలేరియా హాట్ స్పాట్‌లలో మలేరియా కేసులు తగ్గాయా, పెరిగాయా సమాచారం ఆధారంగా తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలపై భవిష్యత్ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. అవసరమైతే ప్రత్యేక ఏజెన్సీని నియమించడం ద్వారా హాట్ స్పాట్ లలో మలేరియా కేసుల్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రపంచ మలేరియా నివేదిక 2022 ప్రకారం 2021లో మలేరియా జ్వరంతో 6,19,000 మంది మరణించినట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు. రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నం, మరియు ఏలూరు జిల్లాల్లో మలేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయన్నారు.

# ఒక్క ఓవర్లో వైడ్స్ హీరోస్



బెర్ట్ వాన్స్ | మహ్మద్ సమీ | ఆంబ్రోస్ | డారిల్ టఫీ | స్కాట్ బోస్‌వెల్

## ప్రపంచ క్రికెట్‌లోనే చెత్త బౌలర్లు
## ఈ జాబితాలో టీమిండియా నో

**న్యూఢిల్లీ:** క్రికెట్‌లో బ్యాటర్లు, బౌలర్లు రాణించాలని కోరుకుంటుంటారు. బ్యాటర్లు తుఫాన్ ఇన్నింగ్స్‌లతో సత్తా చాటాలని పట్టుదలను ప్రదర్శిస్తుండగా, బౌలర్లు మాత్రం తక్కువ పరుగులు ఇచ్చి ఎక్కువ వికెట్లు తీయాలని చూస్తుంటారు. కానీ, కొన్నిసార్లు విఫలమవుతుంటారు. లక్ లేకపోవడంతో ఎన్ని మ్యాచ్‌లు ఆడిన సత్తా చాటాలేక జట్టు నుంచి దూరం అవుతుంటారు. ఎంతో దూకుడుగా కెరీర్ ఆరంభించి, నిరుత్సాహంగా కెరీర్ ముగించిన ప్లేయర్లు చాలామందే ఉన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఒకే ఓవర్‌లో అత్యధిక బంతులు వేసిన అటువంటి బౌలర్లూ ఉన్నారు. క్రికెట్ చరిత్రలో ఒకే ఓవర్లో అత్యధిక బంతులు వేసిన ఐదుగురు బౌలర్ల గురించి తెలిస్తే కచ్చితంగా షాక్ అవుడం ఖాయం. ఈ బౌలర్లు తమ ఓవర్లలో వైడ్స్, నో బాల్స్ ఎక్కువగా వేసి, సుధీర్ఘ ఓవర్‌తో చెత్త రికార్డ్ సృష్టించారన్నమాట. ఈ లిస్ట్‌లో పాకిస్తాన్ బౌలర్ కూడా ఉన్నాడు. ఈ అవాంఛనీయ రికార్డు సృష్టించిన ఐదుగురు బౌలర్ల జాబితాలో టీమిండియాకు చెందినవారు మాత్రం చోటు లభించ లేదు. ఈ జాబితాలో న్యూజిలాండ్ మాజీ స్పిన్నర్ బెర్ట్ వాన్స్ పేరు మొదటి స్థానంలో ఉంది. 1990 ఫిబ్రవరి 20న కాంటర్‌బరీతో జరిగిన మ్యాచ్‌లో బెర్ట్ వాన్స్ 1 ఓవర్‌లో 22 బంతులు వేశాడు. అలాగే ఈ జాబితాలో పాకిస్తాన్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సమీ పేరు రెండవ స్థానంలో ఉంది. బంగ్లాదేశ్‌పై మహ్మద్ సమీ 1 ఓవర్‌లో 17 బంతులు బౌలింగ్ చేశాడు. 2004లో మహ్మద్ సమీ ఈ చెత్త రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఈ ఓవర్లో సమీ 7 వైడ్లు, 4 నో బాల్స్ వేశాడు. అదే విధంగా ఇటువంటి అవాంఛనీయ ప్లేయర్ల జాబితాలో వెస్టిండీస్ బౌలర్ కర్ట్‌లీ ఆంబ్రోస్ మూడవ స్థానంలో చేరాడు.

ఆంబ్రోస్ 1 ఓవర్లో 15 బంతులు వేశాడు. 1997లో ఆస్ట్రేలియాతో ఆడుతున్న సమయంలో ఆంబ్రోస్ ఈ చెత్త రికార్డును తన పేరు మీద లిఖించుకున్నాడు. ఈ ఓవర్లో ఆంబ్రోస్ 9 నో బాల్స్ వేశాడు. ఇక న్యూజిలాండ్‌కు చెందిన డారిల్ టఫీ నాల్గవ స్థానంలో ఉన్నాడు.

2005లో ఆస్ట్రేలియాతో ఆడుతున్నప్పుడు డారిల్ టఫీ ఒకే ఓవర్‌లో 14 బంతులు వేశాడు. ఈ ఓవర్‌లో డారిల్ టఫీ 4 వైడ్‌లు, 4 నో బాల్స్ వేశాడు. ఇక ఈ జాబితాలో ఇంగ్లాండ్ మాజీ ఫాస్ట్ బౌలర్ స్కాట్ బోస్‌వెల్ చివరి స్థానంలో నిలిచాడు. 2001లో జరిగిన ది బి ట్రోఫీలో స్కాట్ 1 ఓవర్‌లో 14 బంతులు వేశాడు.



## జాతీయ క్రికెట్ జట్టుకు ఏడుగురు హైదరాబాద్ అమ్మాయిలు

**న్యూఢిల్లీ:** హైదరాబాద్ అమ్మాయిలు రికార్డు సృష్టించారు. జాతీయ క్రికెట్ జట్టులోకి ఒకేసారి ఏడుగురు సెలెక్ట్ అయ్యి రికార్డు సృష్టించారు. బిసిసిఐ అండర్19 జట్టులోకి ఒకేసారి ఏడుగురు సెలెక్ట్ కావడం ఇదే మొదటి సారి కావడం విశేషం. ఎంపికైన వారిలో కే.నిధి, సంధ్య గోరా, కావ్యశ్రీ, జాస్మిన్ గిల్, పివి హంసిక, సిపి పార్వతి, ఇ.శృజన అనే సిటీ క్రికెట్ ప్లేయర్లు ఉన్నారు. త్వరలోనే రాంచీలో జరగనున్న జట్టు ఏ శిబిరంలో నిధి, సంధ్య, కావ్యశ్రీలు శిక్షణకు హాజరవుతారు.అదే సమయంలో టీమ్ డిలో డెహ్రాడూన్‌లో నిర్వహించే శిక్షణకు హంసిక, పార్వతి, సృజన హాజరుకానున్నారు. టీమ్‌బీలో భాగంగా అహ్మదాబాద్‌లో నిర్వహించే శిక్షణ శిబిరానికి జాస్మిన్ గిల్ పాల్గొంటుంది. వీరంతా హైదరాబాద్ నుంచి బిసిసిఐ అండర్ 19 క్రికెట్ శిక్షణ శిబిరాల్లో పాల్గొనున్నారు. ఏప్రిల్ 25నుంచి మే 21వరకు శిక్షణ శిబిరాల్లో పాల్గొనున్నారు. శిక్షణ ముగిసిన తర్వాత జాతీయ స్థాయి వేదికలపై క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు.

## భారత్, పాకిసాన్‌లను ఒకే గ్రూప్‌లో ఉంచొద్దు

### ఐసిసికి లేఖ రాసిన బిసిసిఐ



**న్యూఢిల్లీ:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన దాడిన తర్వాత బిసిసిఐ రంగంలోకి దిగింది. పహల్గాంలో జరిగిన హృదయ విదారక ఉగ్రదాడి తర్వాత బిసిసిఐ కీలక నిర్ణయం తీసుకుంది. భారత క్రికెట్ నియంత్రణ బోర్డు (బిసిసిఐ) ఐసిసికి లేఖ రాసింది. రాబోయే ఐసిసి టోర్నమెంట్లలో భారత్, పాకిస్థాన్‌లను ఒకే గ్రూప్‌లో ఉంచవద్దని బిసిసిఐ ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) అభ్యర్థించింది. ఐసిసి ఈవెంట్లలో కూడా క్రికెట్ మైదానంలో రెండు దేశాల మధ్య ఘర్షణలను తగ్గించాలని లేదా తొలగించాలని బోర్డు కోరుకుంటోంది. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో ఉగ్రవాదులు 26 మంది అమాయక పర్యాటకులను కాల్చి చంపేశారు. ఈ క్రమంలో ఇక ఐసిసి ఈవెంట్లలో కూడా భారత్, పాకిస్థాన్ మధ్య ఘర్షణలను తగ్గించాలని బిసిసిఐ కోరుకుంటోంది. రాజకీయ సంబంధాలు క్షీణించడం వల్ల ఇప్పటికే రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్ చాలా కాలంగా నిలిపివేయబడింది. బిసిసిఐ డిమాండ్‌ను ఐసిసి అంగీకరిస్తే పాకిస్థాన్‌కు పెద్ద ఎదురుదెబ్బ తగలవచ్చు. మరోపక్క ఈ సంవత్సరం ఐసిసి మహిళల వన్డే ప్రపంచ కప్ భారత గడ్డపై జరగనుంది. ఈ టోర్నమెంట్‌లో భారత్, పాకిస్థాన్ తలపడనున్నాయి. ఐసిసి, బిసిసిఐ, పిసిబిల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం పాకిస్థాన్ జట్టు భారత్‌కు రాదు. తటస్థ వేదికలో తన మ్యాచ్‌లను ఆడుతుంది. 2025 సంవత్సరంలో ఆసియా కప్ కూడా నిర్వహించబడుతుంది. ఈ టోర్నమెంట్‌లో భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య మూడు మ్యాచ్‌లు జరగనున్నాయి. అయితే ఇప్పుడు ఆసియా కప్ షెడ్యూల్ ఎలా తయారు చేయబడుతుందో చూడటం ఆసక్తికరంగా ఉంటుంది.

## తెలంగాణ అమ్మాయి నిత్యకు రెండో స్వర్ణం



### మధ్యప్రదేశ్ అథ్లెట్ మీనాకు పసిడి

**న్యూఢిల్లీ:** కేరళ వేదికగా జరుగుతున్న జాతీయ ఫెడరేషన్ సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ అథ్లెట్ గాదె నిత్య డబుల్ ధమాకాతో అదరగొట్టింది. టోర్నీలో ఇప్పటికే 100మీటర్ల రేసులో పసిడి కొల్లగొట్టిన నిత్య తాజాగా 200మీటర్ల స్ప్రింట్‌లోనూ సత్తాచాటింది. కేరళలోని కొచ్చి వేదికగా జరిగిన రేసును నిత్య 23.68 సెకన్లలో ముగించి రెండో స్వర్ణాన్ని ఖాతాలో వేసుకుంది. ఇదే పోటీలో పాల్గొన్న ఏంజెల్ సిల్వా (23.91సె), సుదీక్ష (24.31సె) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. ఆది నుంచే తనదైన జోరు కనబరిచిన నిత్య ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ పసిడి కొల్లగొట్టింది. అలాగే మధ్యప్రదేశ్ రాష్ట్ర అథ్లెటిక్స్ అకాడమీకి చెందిన పోల్ వాల్ట్ అథ్లెట్ దేవ్ మీనా 28వ జాతీయ ఫెడరేషన్ సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 2025లో బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు. దేవ్ 5.35 మీటర్లు దూకి కొత్త రికార్డును నెలకొల్పాడు. ఈ టోర్నమెంట్ ఏప్రిల్ 21 నుండి 24 వరకు కొచ్చిలో నిర్వహించబడుతోంది. తమిళనాడుకు చెందిన ఎం. గ్వాథమ్ పోల్ వాల్ట్ ఈవెంట్‌లో 5.15 మీటర్లు దూకి రజత పతకాన్ని గెలుచుకున్నాడు. రీగన్ జి. తమిళనాడు పోల్ వాల్ట్ ఈవెంట్‌లో 5.10 మీటర్లు దూకి కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు.

## బాక్సర్ చాంపియన్‌షిప్స్‌లో.. సెమీస్‌కు మరో ఐదుగురు భారత్ బాక్సర్లు



**న్యూఢిల్లీ:** ఏషియన్ అండర్ 15 బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత బాక్సర్లు అదరగొడుతున్నారు. ఈ చాంపియన్‌షిప్ మరో ఐదుగురు ఇండియా బాక్సర్లు సెమీస్‌లోకి ప్రవేశించారు. జోర్డాన్‌లోని అమ్మాన్ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో భారత్ కాలమానం ప్రకారం శుక్రవారం జరిగిన అండర్-15 మెన్స్ 55 కేజీ తొలిరౌండ్లో ఇది వరకే ఆరుగురు భారత బాక్సర్లు సెమీస్ చేరగా తాజాగా మరో ఐదుగురు సెమీఫైనల్స్‌కు అర్హత సాధించారు. సెమీస్ చేరిన వారిలో ఇద్దరు మహిళా బాక్సర్లు ఉన్నారు. నెల్సన్ (55 కిలోలు), అభిజీత్ (61 కిలోలు), లక్ష్య పొగాట్ (64 కిలోలు), ప్రిన్సి (55 కిలోలు), సమృద్ధి సతీశ్ (55 కిలోలు) క్వార్టర్స్ పోరులో ప్రత్యర్థులను చిత్తు చేశారు. ఇక నెల్సన్ ఆర్ఎస్సీ (రిఫరీ స్టాప్ కంటెస్ట్) ద్వారా వాంగ్ షెంగ్‌యాంగ్ (చైనీస్తైపీ)పై గెలిచాడు. 61 కేజీ క్వార్టర్ఫైనల్లో అభిజీత్ 5-0తో ముఖమ్మద్ బుర్హానోవ్ (కిర్గిస్తాన్)పై గెలవగా, 64 కేజీల్లో లక్షయ్ ఫోగట్ 5-0తో లైత్ అజైలత్ (జోర్డాన్)ను ఓడించి సెమీస్లోకి అడుగుపెట్టారు. బాలికల 52 కేజీల్లో ప్రిన్సి 5-0తో యెవా కుబనోవా (ఉక్రెయిన్)పై, 55 కేజీల్లో సమృద్ధి సతీష్ షిండే ఆర్ఎస్సీ ద్వారా క్సేనియా సవినా (ఉక్రెయిన్)పై నెగ్గి సెమీస్కు చేరారు. ఇక మెన్స్ 52 కేజీలో రవి సిహాగ్ 2-3తో ఎల్షాడ్ షకీర్జోనోవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో, 58 కేజీల్లో నమన్ సైనీ 0-5తో జఖోంగిర్ జాన్ ఉస్మాన్ కులోవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో పరాజయం చవిచూశారు.

# సెన్సెక్స్, నిఫ్టీలపై టెర్రర్ ఎఫెక్ట్

**ముంబై, ఏప్రిల్ 25:** దేశీయ మార్కెట్ సూచీలు శుక్రవారం భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు ఉన్నప్పటికీ.. దేశీయంగా బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు సూచీలను పడేశాయి. దీనికి తోడు పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపించాయి. దీంతో నేటి ట్రేడింగ్‌లో సూచీల భారీగా పతనమయ్యాయి. చివరకు కాస్త కోలుకున్న ప్పటికీ నష్టాలు తప్పలేదు. సెన్సెక్స్ దాదాపు 600 పాయింట్లు దిగజారగా, నిఫ్టీ 24వేల మార్క్‌ను నిలబెట్టుకోగలిగింది. శుక్రవారం నాటి ట్రేడింగ్‌ను సూచీలు సానుకూలంగానే ప్రారంభించినప్పటికీ.. కాసేపటికే అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఈ ఉదయం 79,830 వద్ద ఉత్సాహంగా ప్రారంభమైన సెన్సెక్స్ ఒక దశలో 80వేల మార్క్ పైన కదలాడింది. కానీ.. ఆ ఉత్సాహం ఎంతోసేపు కొనసాగలేదు. మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో ఒత్తిడికి గురైన సూచీ దాదాపు 1200 పాయింట్లు క్షీణించి ఇంట్రాడేలో 78,605 కనిష్ఠ స్థాయికి పడిపోయింది. చివర్లో కాస్త కోలుకున్నప్పటికీ నష్టాలు ఎక్కువగానే ఉన్నాయి. నేటి మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 588.90 పాయింట్లు పతనమై 79,212.53 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ కూడా 23,84724,365 మధ్య కదలాడింది. చివరకు 207.35 పాయింట్లు దిగజారి 24,039.35 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 17 పైసలు క్షీణించి 85.44గా ముగిసింది.



ఐటీ మినహా దాదాపు అన్ని రంగాల షేర్లు నష్టపోయాయి. బ్యాంకింగ్, మీడియా, టెలికాం సూచీలు 23 శాతం మేర కుదేలయ్యాయి. నిఫ్టీలో యాక్సిస్ బ్యాంక్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, శ్రీరామ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్, ట్రెంట్ షేర్లు భారీగా నష్టపోయాయి. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు రాణించాయి. మరోవైపు, తాజా పరిణామాలతో పాక్ స్టాక్ మార్కెట్లు కూడా భారీగా నష్టపోయాయి. కరాచీ స్టాక్ ఎక్స్ఛేంజ్ 100 సూచి గురువారం దాదాపు 2500 పాయింట్లు కుంగింది. ఈ నేపథ్యంలో పాక్ స్టాక్ ఎక్స్ఛేంజీ పోర్టల్ డౌన్ అవ్వడం చర్చనీయాంశమైంది. శుక్రవారం ఉదయం ఆ పేజీ యూజర్లకు అందుబాటులో లేదు. ప్రస్తుతం ఇది మెయింటనెన్స్‌లో ఉందని, త్వరలోనే అందుబాటులోకి వస్తుందనే సందేశం కన్పిస్తోంది.

## అమెరికాలో ఇక 'మేక్ ఇన్ ఇండియా' ఐఫోన్లే..

**వాషింగ్టన్, ఏప్రిల్ 25:** అమెరికా, చైనా భారీ స్థాయిలో పరస్పర సుంకాలు విధించుకోవడంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య యుద్ధం రాజుకుంది. ఈ క్రమంలోనే టారిఫ్‌ల నుంచి తప్పించుకునేందుకు దిగ్గజ సంస్థ యాపిల్ ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతోంది. ఇందులో భాగంగానే అమెరికా మార్కెట్లో విక్రయించే ఐఫోన్ల తయారీ మొత్తాన్ని భారత్‌కు తరలించాలని కంపెనీ యోచిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. 2026 నాటికి అమెరికా మార్కెట్ కోసం ఐఫోన్ల తయారీ ప్రక్రియ మొత్తం భారత్ కేంద్రంగానే జరిగేలా ఆపిల్ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సదరు కథనాల సారాంశం. ఇప్పటివరకు అమెరికా వెలుపల తయారు చేస్తున్న ఐఫోన్లలో భారత్ వాటా 14% కాగా.. దాదాపు 80 శాతం ఐఫోన్లు చైనాలోనే తయారవుతున్నాయి. ఇప్పుడు సుంకాల నేపథ్యంలో ఆపిల్‌పై అదనపు భారం పడనుంది. చైనా నుంచి అమెరికాలో దిగుమతి చేసుకుంటే, 145% పన్ను కట్టాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో చైనా, భారత్‌లో తయారు చేసే ఐఫోన్ల ధరల మధ్య అమెరికా విపణిలో భారీ వ్యత్యాసం ఉంటోంది. ఈ క్రమంలోనే తయారీని భారత్‌కు మార్చాలని ఆపిల్ యోచిస్తోంది. అదే జరిగితే.. ఇక అగ్రరాజ్య మార్కెట్‌లో మేక్ ఇన్ ఇండియా ఐఫోన్లే కన్పిస్తాయి. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ తొలిసారి ఎన్నికైనప్పుడే చైనాతో వాణిజ్య విరోధం మొదలైంది. ఫలితంగా బలమైన ప్రత్యామ్నాయ తయారీ కేంద్రంగా మరో దేశాన్ని ఎంచుకోవాలని ఆపిల్ సహా పలు బహుళజాతి సంస్థలు భావించాయి. అదే సమయంలో స్మార్ట్‌ఫోన్లపై తయారీ ఆధారిత ప్రోత్సాహకాలు కల్పిస్తామని 2020లో భారత ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఆపిల్ మనదేశంలో ఐఫోన్ల అసెంబ్లింగ్‌ను ప్రారంభించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఆపిల్ 22 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్లను భారత్‌లో తయారు చేసింది.



## వడ్డీరేట్లు తగ్గించిన కెనరా, ఇండియన్ బ్యాంకులు

**ముంబై, ఏప్రిల్ 25:** భారతీయ రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఇటీవలి ఎంపిసి సమావేశంలో కీలక రేట్లను మరో 25 బేసిస్ పాయింట్లు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. ఈనిర్ణయాన్ని అనుసరిస్తూ ఇప్పటికే బ్యాంకులు రుణాల రేట్లను తగ్గించాయి. తాజాగా ప్రభుత్వ రంగ కెనరా బ్యాంకు, ఇండియన్ బ్యాంకులు కూడా రెపో లింక్డ్ లెండింగ్ రేటు (ఆర్ఎల్ఎల్ఆర్) 25 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. ఈ నిర్ణయం తర్వాత ఇండియన్ బ్యాంకు ఇళ్ల రుణాలపై వడ్డీ రేటు ప్రస్తుతం ఉన్న 8.15 శాతం నుంచి 7.90 శాతానికి, వాహ నాలపై వడ్డీ 8.50 శాతం నుంచి 8.25 శాతానికి దిగిరానుంది. దీంతో పాటు ఇండియన్ బ్యాంకు ప్రాసెసింగ్ ఫీజు, జీరో డాక్యుమెంటేషన్ ఛార్జీల్లో రాయితీ వంటి ప్రయోజనాలను కూడా ప్రకటించింది. ఇక కెనరా బ్యాంకు కూడా ఆర్ఎల్ఎల్ఆర్ తగ్గించడంతో ఇళ్ల రుణాలు 7.90శాతం నుంచి ప్రారంభమవు తాయి. వాహన రుణాలపై వార్షిక వడ్డీ 8.20శాతం నుంచి ప్రారంభమవుతుందని అధికారిక ప్రకటనలో పేర్కొంది.



## డెత్ క్లెయిమ్‌ల కోసం ఎల్ఐసి స్పెషల్ విండో

**వాణిజ్యం**

**శ్రీనగర్, ఏప్రిల్ 25:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదదాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన తర్వాత బాధితుల కుటుంబాలకు అండగా నిలబడడానికి త్వరితగతిన డెత్ క్లెయిమ్ పరిష్కారాలను అందించడానికి లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ఇండియా ఓ స్పెషల్ విండోను అందుబాటులోకి తీసుకొచ్చింది. పహల్గాంలో అమాయక పౌరుల మరణం పట్ల ఎల్ఐసి ఆఫ్ ఇండియా తీవ్ర విచారం వ్యక్తం చేస్తోంది. మరణజంచిన వారి డెత్ క్లెయిమ్‌ను వీలైనంత త్వరగా పరిష్కరించడానికి ప్రత్యేక రాయితీలను ప్రకటించింది. దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబానికి ఎల్ఐసి ఆఫ్ ఇండియా అండగా నిలుస్తుంది అని ఎల్ఐసి మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సిఇఒ సిద్ధార్థ మొహంతి ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. డెత్ క్లెయిమ్ ప్రక్రియ పూర్తిగా ఆఫ్‌లైన్‌లో ఉందని క్లెయిమ్‌దారులు తప్పకుండా గమనించాలి. ఈ ప్రక్రియను ప్రారంభించడానికి, నామినీ అవసరమైన అన్ని పత్రాలను తీసుకొని పాలసీని జారీ చేసిన ఎల్ఐసి శాఖను సంప్రదించాలి. పాలసీ ప్రీమియంలు రెగ్యులర్‌గా చెల్లించి ఉంటే, గ్రేస్ పీరియడ్‌లోపు మరణం సంభవించినట్లయితే క్లెయిమ్ సెటిల్‌మెంట్‌కు అర్హత ఉంటుంది. నామినీ అవసరమైన పత్రాలతో పాలసీ జారీ చేసిన ఎల్ఐసి బ్రాంచ్‌ను సంప్రదించాలి. పాలసీ నంబర్, తేదీ, మరణించడానికి కారణం వంటి వివరాలతో ఎల్ఐసి సర్వీసింగ్ బ్రాంచ్‌కు లిఖితపూర్వకంగా తెలియచేయాలి. నామినీదారునికి, మరణించిన వ్యక్తికి గత సంబంధాన్ని తెలియచేయడానికి ఫారమ్ ఎను సబ్మిట్‌చేయాలి. అధికారిక మరణ ధ్రువీకరణ పత్రంగా, స్థానిక మరణ రిజిస్టర్ నుంచి ధ్రువీకరించిన పత్రాలను సమర్పించాలి. వయస్సు ధ్రువీకరణ కోసం ఆధార్, పాన్‌కార్డు వంటివి ఇవ్వాల్సి ఉంటుంది. మరణ ధృవీకరణ పత్రాలకు బదులుగా, ఉగ్రవాద దాడి కారణంగా పాలసీదారు మరణించినట్లు ప్రభుత్వ రికార్డులలో ఉన్న ఏవైనా ఆధారాలు, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించిన ఏదైనా పరిహారం వంటివి పాలసీదారు మరణించినట్లు నిర్ధారించడానికి ఉపయోగపడతాయి.



## రియాల్టీలోకి రూ.2.29 లక్షల కోట్లు

**ముంబై, ఏప్రిల్ 25:** రియల్ ఎస్టేట్ మార్కెట్లో పెట్టుబడుల పట్ల సంస్థాగ ఇన్వెస్టర్లు ఉత్సాహం చూపిస్తున్నారు. ఈ రంగం 2022-24 మధ్య కాలంలో 26.7 బిలియన్ డాలర్లు అంటే రూ.2.29 లక్షల కోట్లు ఈక్విటీ పెట్టుబడులను అందుకున్నట్లు సిఐఐ-సిబిఆర్ఇ సంయుక్త నివేదిక తెలిపింది. ఇందులో పావు శాతం అంటే 6.7 బిలియన్ డాలర్లను అంటే రూ.57,600 కోట్లు ముంబై నగరం ఆకర్షించడం విశేషం. ముంబైతో పాటు ఢిల్లీ-ఎన్‌సిఆర్, బెంగళూరు ఈ మూడు నగరాల నుంచి మార్కెట్లోకి వచ్చిన పెట్టుబడులు 16.5 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు ఈ నివేదిక వెల్లడించింది. మొత్తం ఎస్టేట్ రంగంలోకి 2022-24 మధ్య వచ్చిన పెట్టుబడుల్లో 62శాతాన్ని ఈ మూడు నగరాలు దక్కించుకున్నాయి. పెట్టుబడిశ్రేణికి సంబంధించిన ప్రాజెక్టులు ప్రధానంగా ఈ నగరాల్లో కేంద్రీ కృతమై ఉండడం, బలమైన మౌలిక సదుపాయాలు, నైపుణ్య మానవవనరుల లభ్యత, రియల్ ఎస్టేట్ రంగం క్రమంగా సంఘటితంగా మారుతుండడం ఈ మూడు నగరాలకు అనుకూలిస్తున్నట్లు ఈ నివేదిక వివరించింది. ల్యాండ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులు 2022-24 మధ్య 44శాతం మేర ఈక్విటీ పెట్టుబడులను ఆకర్షించినట్లు, ఆ తర్వాత ఆఫీస్ నిర్మాణ ఆస్తుల్లోకి 32 శాతం వచ్చినట్లు సిఐఐ-సిబిఆర్ఇ నివేదిక వెల్లడించింది. ఇక గత మూడేళ్లలో 10శాతం మేర ఈక్విటీ పెట్టుబడులు టైర్-2 పట్టణ రియల్ ఎస్టేట్‌లోకి వచ్చినట్లు తెలిపింది. 'భారత రియల్ ఎస్టేట్ రంగం కొత్త వృద్ధిపథంలోకి అడుగు పెట్టింది. బలమైన మూలధన పెట్టుబడులు, అభివృద్ధికి భూముల లభ్యత ఇందుకు మద్దతుని స్తాయని కూడా వెల్లడించింది.



## నెట్‌ఫ్లిక్స్ సేవలకు స్మాల్ బ్రేక్!

**ముంబై, ఏప్రిల్ 25:** ప్రముఖ ఒటిటి సంస్థ నెట్‌ఫ్లిక్స్ సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. సాంకేతికంగా సమస్యలు తలెత్తడంతో నెట్‌ఫ్లిక్స్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా సబ్‌స్క్రైబర్లు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా అమెరికాలోని న్యూయార్క్, చికాగో, డాలస్, లాస్ ఏంజెలెస్‌లోని యూజర్లు ఈ సమస్యతో ఎక్కువగా ఇబ్బందిపడ్డారు. ఈ విషయాన్ని తెలియచేస్తూ, అక్కడి యూజర్లు సమస్యపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. నెట్‌ఫ్లిక్స్ లాగిన్‌లో ఎర్రర్ వస్తోందని, తమ ఖాతాను ఓపెన్ చేయలేకపోతున్నామని తెలియచేశారు. సమ్ థింగ్ వెంట్ రాంగ్.. కొంత సమయం తర్వాత మళ్లీ ప్రయత్నించండి అనే సందేశం స్క్రీన్‌పై దర్శనమిస్తున్నట్లు యూజర్లు పేర్కొంటున్నారు. అంతేకాకుండా మరికొంత మంది యూజర్లు ప్రొఫైల్ మిస్ మ్యాచ్ అవుతుందని వెల్లడించారు. ఒక ప్రొఫైల్‌లో వీక్షించిన జాబితా మరో ప్రొఫైల్‌లో కనిపిస్తుందని తెలిపారు. కొన్ని గంటల పాటు ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. అయితే వెంటనే స్పందించిన సంస్థ, ఈ సమస్యలను పరిష్కరించేందుకు నెట్‌ఫ్లిక్స్ సాంకేతిక బృందం తీవ్రంగా శ్రమిస్తున్నట్లు తెలిసింది. ఇక ప్రపంచవ్యాప్తంగా నెట్‌ఫ్లిక్స్‌ను వినియోగించే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. 2025 నాటికి ఈ ప్లాట్‌ఫామ్‌ను 300 మిలియన్ల మంది సబ్‌స్క్రైబ్ చేసుకున్నారు. కేవలం అమెరికా ఒక్క దేశంలో ఈ సంఖ్య 81 మిలియన్లుగా ఉంది. తాజాగా ఏర్పడిన సమస్య వల్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న సబ్‌స్క్రైబర్లకు ఇది ఆటంకంగా మారింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.